KLVA102M302

> కాస్త మంచి పని చెయ్యడం ఎవరికీ ఏమంత కష్టమైన పనికాదు. కాని జీవితమంతా మంచిపని చేయడం, ఎన్నడూ చెడ్డ పని చేయకుండా వుండటం, విస్తృత ప్రజానీకపు ప్రయోజనాల కొరకు, యువతరం ప్రయోజనాల కొరకూ, విప్లవం కోసమూ, నిరంతరం పని చేయడం, దశాబ్దాల తరబడి కష్టతరమైన పోరాటంలో నిమగ్నమై వుండటం - అన్నిటికంటే అత్యంత కష్టభూయిష్టమయిన పని.
>
> - మావో

ప్రజాపంథా

సి.పి.ఐ (ఎం.ఎల్ - న్యూడెమోక్రసీ) పక్షపత్రిక

సంపుటి : 24 సంచిక : 23 15-04-2008 పేజీలు : 12 ప్రచురణస్థలం : హైదరాబాద్ ఎడిటర్ : మాదాల నారాయణస్వామి వెల : 8

ఓబీసీ కోటాకు సుప్రీం కోర్టు ఆమోదం

రిజర్వేషన్ల రక్షణకూ, అమలుకూ పోరాటాలే మార్గం

కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ)కు 27 శాతం కోటా కేటాయింపును సుప్రీంకోర్టు ఆమోదించడమే గాకుండా, ఈ విద్యాసంవత్సరం నుండే అమలు చేయాలని ఏప్రిల్ 11న తుది తీర్పునిచ్చింది. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పును దేశంలోని పాలకప్రతిపక్ష పార్టీలన్నీ సమర్థించాయి. ఓబీసీ కోటా అమలుకు గల అడ్డంకులను తొలగిస్తూ చీఫ్ జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవంగా ప్రకటించిన ఈ తీర్పు సామాజిక న్యాయసాధనలో మరో ముందడుగే. ఇటీవలి కాలంలో ఎన్నో వివాదాస్పద తీర్పులనిస్తున్న సుప్రీంకోర్టు రిజర్వేషన్ల విషయంలో సామాజిక న్యాయానికి కట్టుబడుతూ నేడు తీర్పునివ్వడం ముదావహం. దేశంలోని అట్టడుగు వర్గాల ప్రజానీకానికి సంతోషకరమైన ఈ తీర్పును తక్షణం అమల్లోకి తీసుకురావాలి. 'క్రీమీలేయర్'ను ఈ కోటా నుండి ఉపసంహరించాలనే విషయంలో కొంత వ్యతిరేకత వస్తున్నప్పటికీ రిజర్వేషన్ ఫలాలు కింది దాకా అందాలనుకున్నప్పుడు కోర్టు తీర్పు సమంజసమైనదే.

యూపీఏ ప్రభుత్వం 2006 జనవరి 20న ఓబీసీ విద్యార్థులకు 27 శాతం రిజర్వేషన్ కోటాను కల్పిస్తు రాజ్యాంగాన్ని సవరించింది. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ అదే సంవత్సరం మే నెలలో ఢిల్లీకి చెందిన ఎయిమ్స్ వైద్యుల సంఘం నాయకుడు అశోక్ కుమార్ ఠాకూర్ సుప్రీంకోర్టు కెళ్ళాడు. ఈ సందర్భంగా దేశ వ్యాపితంగా ఓబీసీ కోటాను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ఆందోళనను సాగించారు. ఢిల్లీ కేంద్రంగా సాగిన ఈ ఆందోళనకు మీడియా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించింది. ఉన్నత విద్యా సంస్థల్లోని అత్యధికంగా గల అగ్రవర్ణాల విద్యార్థులు సాగిస్తున్న ఈ ఆందోళనకు విపరీత ప్రచారం కల్పించడం ద్వారా సమాజాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలు అనేకం జరిగాయి. వీపీ సింగ్ హయాం నాటి మండల్ వ్యతిరేక ఆందోళనా దృశ్యాలను పదేపదే చూపెట్టటం ద్వారా రిజర్వేషన్ వ్యతిరేకతను మీడియా తారా స్థాయికి తీసుకు పోయింది. ప్రతిభను కాపాడాలనే పేరిట అగ్రవర్ణాల విద్యార్థులు సాగించిన ఆందోళన అత్యంత అప్రజాస్వామికంగా, నిరంకుశంగా, అమానుషంగా కొనసాగింది. ప్రతిభ కేవలం అగ్రవర్ణాల గుత్త సొత్తులాగా మనువాదులు గొంతు చించుకున్నారు. కేంద్ర స్థాయిలో ఉన్నత విద్యాసంస్థల్లోనూ ఓబీసీలకు రిజర్వేషన్లను అమలు చేస్తే ప్రతిభకు పాడె గట్టినట్లేనని అగ్రవర్ణ, భూస్వామ్య దురహంకారం బుసలు కొట్టింది. ఈ ఆందోళనలకు పరోక్షంగా పాలక ప్రతిపక్షాలనే తేడాలు మరిచి సహకరించారు. తాజా సుప్రీం కోర్టు తీర్పు తర్వాత ఈ పార్టీల వారే హర్షం వెలిబుచ్చుతున్నారు. ఇది రాబోవు ఎన్నికల్లో అసంఖ్యాకంగా గల ఓబీసీల ఓట్ల ద్వారా లబ్ధిపొందడానికేననేది స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

మొత్తం రిజర్వేషన్లనే ప్రగతి నిరోధకంగా భావించే ధోరణులు ఓబీసీ కోటా 27 శాతం కేటాయించాలన్నప్పుడే కాదు, అంతకు ముందు 1980లో మండల్ కమీషన్ కాలం నాటి నుండే కొనసాగుతూ వస్తున్నాయి. రిజర్వేషన్ ప్రతిభకు పాడె గడుతుందనే కుట్ర పూరిత ప్రచారాన్ని దేశంలోని అగ్రకుల, భూస్వామ్య, పెత్తందారీ వర్గాలు, మనువాదులు బాహటంగానే వ్యక్తం చేస్తూ వస్తున్నాయి. పుష్కర కాలం ఆలస్యంగా మండల్ కమీషన్ సిఫార్సులను అమలు చేయడానికి ప్రయత్నిస్తే, దానికి విరుగుడు అన్నట్లుగా కమండల్‌గా ఎల్.కె. అద్వానీ రథయాత్రను చేపట్టడం కాకతాళీయం కాదు. సరిగ్గా ఇదే కాలంలో రిజర్వేషన్ పట్ల వ్యతిరేకతను మీడియా అతిగా ప్రచారం కల్పించడం కూడా, ఆయా యాజమాన్యాల 'వర్గ' లక్ష్యాల కనుగుణ్యంగా కొనసాగింది. 1993లో సుప్రీం కోర్టు మండల్ కమీషన్ సిఫార్సులకు ఆమోదముద్ర వేసినా దేశంలోని అన్ని బూర్జువా రాజకీయ పార్టీలు అనుసరిస్తూ వస్తున్న అవకాశవాద, స్వార్థ రాజకీయాల వల్ల 2008 వరకు కూడా ఓబీసీలు కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో రిజర్వేషన్లను అనుభవించలేక పోయారు. ఈ 15 సం॥రాల కాలంపాటు ఈ పార్టీలు, వాటి ప్రభుత్వాలు అనుసరించిన స్వార్థ రాజకీయాలు ఓబీసీలకు గల రాజ్యాంగబద్ధ, చట్టబద్ధ అవకాశాలను చేజార్చాయనేది ముమ్మాటికీ వాస్తవమే!

సామాజిక న్యాయానికి పాతరేస్తున్న ప్రపంచీకరణ

వందల వేల ఏళ్ళపాటు సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కబడుతున్న దళితులు, ఆదివాసీలు, బీసీలు నేడు ప్రపంచీకరణపద ఘట్టనల క్రింద నలిగి పోతున్నారు. దేశంలో అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వస్తున్న భూస్వామ్య విధానంతో నిరంతరం దోపిడీ, పీడనను ఎదుర్కొంటున్న అణగారిన కులాలకు ఒక ఉపశమనంగా ఉపయోగపడుతూ వస్తోన్న రిజర్వేషన్లు ప్రపంచీకరణవిధానాల అమలుతో తుడిచిపెట్టుకు పోతున్నాయి. ప్రభుత్వ రంగం కనుమరుగై, సర్వం ప్రయివేట్ పరం అవుతున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీల లాగానే బీసీల్లోని విద్యార్థులు చదువు 'కొన'డం గగనమై పోతున్నది. హస్టళ్ళు ఇప్పుడికే మూతపడిపోయాయి. అరకొరగా ఇచ్చే స్కాలర్ షిప్స్‌తో చదువును సాగించలేక చాలించే దౌర్భాగ్య పరిస్థితులు ముమ్మరమవుతున్నాయి. డ్రాపౌట్స్‌లో ఎస్సీ, ఎస్టీలతోబాటు బీసీ విద్యార్థులూ ఉంటున్నారు. రిజర్వేషన్లను పాలకవర్గాలు అణగారిన వర్గాలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కుగా గాకుండా బిక్షగా చూస్తున్న కారణంగానే గత 60 సం॥రాల కాలంలో కూడా ఒక్కటంటే ఒక్క సామాజిక వర్గం కూడా లబ్ది పొందలేక పోయింది. తాజా సుప్రీం కోర్టు తీర్పు కూడా ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చింది. "స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా బీసీల జాబితా నుండి కులాలను తొలగించిన దాఖలాలే లేవు. ఆ జాబితా ఇంకా పెరుగుతూనే ఉంది. అంటే... వెనుకబాటు తగ్గడానికి బదులు పెరుగుతూ పోతుందా?" అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అంతేగాదు, "అసమానతలను తొలగించాల్సిందే. కానీ, ఇప్పటి దాకా ఒక్క కులాన్ని కూడా బీసీ జాబితా నుండి తీసేయలేదంటే... సమానత్వ సాధనపై సందేహాలు కలుగక మానవు" అని సుప్రీం కోర్టు సీరియస్‌గా వ్యాఖ్యానించింది. అత్యున్నత సుప్రీం కోర్టే ఇలా వ్యాఖ్యానించాల్సి వచ్చిందంటే దేశంలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ రిజర్వేషన్లను అమలు చేస్తున్న పాలకుల పని తీరు ఏ పాటిదో అర్థమవుతున్నది.

తరతరాలుగా అణచివేతకూ, పీడనకూ గురవుతూ వస్తోన్న అణగారిన వర్గాల ప్రజానీకానికి ఇతరులతోపాటు ఎదిగెందుకు ముందుకు తెచ్చామంటున్న రిజర్వేషన్లను సక్రమంగా అమలు జరపని ఫలితంగా ఆయా వర్గాల ప్రజలు ఈనాటికీ కడు పేదరికం, దుర్భర దారిద్ర్యంతో కొట్టుమిట్టాడుతూ జీవనం గడుపుతున్నారు. సమానంగా కాదు గదా... కనీసావసరాలు నేరవేర్చుకోలేని దుస్థితిలో మగ్గి పోతున్నారు. కడుపాకలిని తీర్చుకోవడంతోపాటు ఆత్మగౌరవంతో బతుకు గడపడం కూడా సాధ్యం కావడం లేదు. కూడూ, గుడ్డా, నీడ కోసం ఈనాటికీ ఎదురు చూపులే... ఈ వర్గాల ప్రజానీకానికి తగినన్ని కాక పోయినా కనీస పాటి అవకాశాలు కూడా కల్పించకుండా ప్రతిభ పేరిట గావు కేకలు వేసి, రిజర్వేషన్లనొద్దనడం ఈనాడు దేశంలోని అగ్రవర్ణాల విద్యార్థులకూ, వారిని సమర్థించే మేధావులకూ ఫ్యాషనై పోయింది. జాతీయ నాలెడ్జ్ కమీషన్ చైర్మన్ శ్యాంపిట్రోడా సైతం రిజర్వేషన్ల వల్ల ప్రతిభ దెబ్బతింటుందని బహిరంగ విమర్శకు దిగితే అందులోని సభ్యులైన పి.యం. భార్గవ, జయతీఘోష్ ల్లాంటి మేధావులు ఇది సరికాదని చెప్పాల్సి వచ్చిందంటే పాలనా యంత్రాంగానికి రిజర్వేషన్లపైగల అవగాహన ఎంతటి ప్రగతి నిరోధకమైనదో అర్థమవుతున్నది.

సమాజంలో సాంఘిక, ఆర్థిక అసమానతలు కొనసాగినంత కాలం రిజర్వేషన్లు కొనసాగాలని బలంగా చెప్పడంతోపాటు రిజర్వేషన్లను పరిరక్షించుకోవడానికీ, వాటిని సక్రమంగా అమలు జరిపించుకోవడానికీ ఈ ప్రభుత్వాలపై నిరంతర ఉద్యమించాలి. చట్టాలు అనేకం ఉన్నప్పటికీ అవి ఆచరణలో చట్టబండలవుతున్న తీరును గత 60 సం॥రాలుగా చూస్తూనే ఉన్నాం. ప్రజలు ఉద్యమించిన సందర్భాల్లోనే అవి ఆచరణకు నోచుకుంటున్నాయి. చట్టాలనైనా, కోర్టు తీర్పులనైనా అమలు చేయించుకోవాలంటే పదేపదే పోరాటాలు, ఆందోళనలు అనివార్యం అవుతున్న స్థితే దేశంలో కొనసాగుతున్నది. నేటి సుప్రీం కోర్టు తీర్పుగానీ, ఈ తీర్పుకు నేపథ్యంగా వచ్చిన రాజ్యాంగ సవరణసైతం ఉద్యమాల, పోరాటాల ఫలితమే తప్ప మరేం కాదని గుర్తించాలి. అంతేకాదు, ప్రయివేట్ రంగంలోనూ రిజర్వేషన్లనూ కల్పించాలని సంఘటితంగా ఉద్యమించాల్సి ఉంది. ప్రయివేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణల అమలులో కోల్పోతున్న విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం సమైక్యంగా పోరాడేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర అణగారిన వర్గాలను సమీకరించాలి. కుల పీడనకూ, అణచివేతకు భూమికగా నిలుస్తున్న భూస్వామ్య సంబంధాలను బద్దలు చేసే వర్గ పోరాటాల్లో భాగస్వాములను చేయాలి.

కామ్రేడ్ లెనిన్‌కు విప్లవ జోహార్లు



ఏప్రిల్ 22 (138వ జయంతి)

అన్‌రిజర్వ్‌డ్ భూములను ఫారెస్ట్ భూముల్లో కలపాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పశ్చిమగోదావరి జిల్లాలో విస్తృత ఆందోళన

ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలలో ఉన్న రిజర్వ్‌డ్ ఫారెస్ట్ భూమిలో బొగ్గుగనులున్నందున ఈ రిజర్వ్‌డ్ ఫారెస్టు భూమిని సింగరేణి సంస్థకు అప్పగించి, ఆ భూమికి బదులుగా, పశ్చిమ ఏజెన్సీలో ఉన్న అన్‌రిజర్వ్‌డ్ భూమిని రిజర్వ్‌డ్ భూమిగా బదలాయించాలనే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. పశ్చిమ ఏజన్సీలోని బుట్టాయిగూడెం, పోలవరం మండలాల పరిధిలో గెడ్డపల్లి, జిల్లెలగూడెం, ముంజులూరు, పులిరామన్నగూడెం గ్రామ పంచాయితి పరిధిలోని గ్రామాలలో అన్ రిజర్వ్‌డ్ భూమిని సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. జయలక్ష్మి సర్క్యులర్ జారీ చేశారు. దీని ప్రకారం 17.3.2008న సింగరేణి సంస్థ అధికారులు, రెవెన్యూ అధికారులు ఏజెన్సీ గ్రామాలలో సర్వే నిర్వహించారు. వారి సర్వే ప్రకారం వీరన్నపాలెం గ్రామంలో 500 ఎకరాలు, గోగుమిల్లిలో 1625 ఎకరాలు, ముంజులూరులో 750 ఎకరాలు, చింతపల్లిలో 400



ఎకరాలు, వర్రింకకల్లు మామిడి గ్రామాల పరిధిలో 875 ఎకరాలు, గిన్నెపల్లిలో 600 ఎకరాలు, తంగెడికొండ గ్రామం పరిధిలో 325 ఎకరాలు, చిమలూరులో 250 ఎకరాలు, గిడ్డపల్లిలో 750 ఎకరాలు, గుమ్ములూరులో 387 ఎకరాల భూమి ఉన్నది. ఇది మొత్తం అన్‌రిజర్వ్ భూమి. 6462 ఎకరాల పైగా గల ఈ భూమిని రిజర్వ్‌డ్ ఫారెస్టులోకి కలపాలని కలెక్టర్‌కి నివేదిక పంపారు.

గిరిజనుల మనుగడనే ప్రశ్నార్థకం చేసే ఈ చర్యను సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) తీవ్రంగా వ్యతిరేకించింది. పై గ్రామాలలో ఉన్న అన్‌రిజర్వ్ భూమిలో గిరిజనులు పోడు వ్యవసాయం, జీడి తోటలు, ఇతర అటవీ ఉత్పత్తులతో జీవనం కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా వనసంరక్షణ సమితుల ద్వారా అనేక రకాల ఉపాధి పొందుతున్నారు. అన్‌రిజర్వ్ భూమిలో వున్న వెదురువల్ల వారికి కూలితోపాటు గ్రామానికి ఒక్కంటికి సంవత్సరానికి లక్ష రూపాయల నుండి రెండు లక్షల వరకు గ్రామ ఆదాయంగా పొందుతున్నారు. ప్రభుత్వ చర్యవల్ల గిరిజనులు బ్రతుకు దుర్భరమై, వారి సంస్కృతీ సాంప్రదాయాలు దెబ్బతింటాయి. ఉపాధి లేక వారి మనుగడే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే అతి చిన్నదయిన పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ పోలవరం ప్రాజెక్ట్‌తో 29 గ్రామాలు, కోవ్వాడ, పోగండ రిజర్వాయర్ల పేరున మరికొన్ని గ్రామాలు తమ ఉనికినే కోల్పోతున్నాయి. గిరిజనుల భూములు కబలించటానికి ప్రభుత్వం తీసుకొనే ఈ చర్యను వ్యతిరేకిస్తూ ప్రజలలో చైతన్యం తీసుకురావటానికి దశల వారీగా ఆందోళన ఉధృతం చెయ్యటానికి పార్టీ నిర్ణయించి చైతన్య పాదయాత్రలు, బహిరంగసభలు నిర్వహించి ఐ.టి.డి.ఏ. ముందు ఆందోళన చేయాలని నిర్ణయించటమైనది.

చైతన్య పాదయాత్రలు

22.3.08న పులి రామన్నగూడెంలో చైతన్య పాదయాత్రను పులి రామన్నగూడెం ఎంపీటీసీ సభ్యులు కా॥ ఏసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పార్టీ డివిజన్ నాయకులు కా॥ కె.వి. రమణ మాట్లాడుతూ తరతరాలుగా గిరిజనులు అనుభవిస్తున్న అన్‌రిజర్వ్ భూములు రిజర్వ్‌డ్ ఫారెస్టుకి అప్పగించాలనే చర్యలను తీవ్రంగా ప్రతిఘటించాలని, భవిష్యత్‌లో పార్టీ ఇచ్చే ఆందోళన కార్యక్రమంలో పెద్ద ఏత్తున ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ సభలో సిహెచ్. వసంతరావు, ఎస్. రామోహన్‌లు మాట్లా డారు. అనంతరం భారీ వర్షంలో గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

చైతన్య పాదయాత్రలలో భాగంగా 12 మందితో కూడిన బృందం 22.3.08 నుండి 1.4.08 వరకు 11 రోజులపాటు పాదయాత్రలు నిర్వహించి గ్రామాలలో గ్రూప్ మీటింగులు నిర్వహించింది. పులి రామన్నగూడెంలో 60 మంది, ఉప్పరెల్లిలో 150, కన్నిర్పాడులో 60, వీరన్నపాలెం 50, గోగుమిల్లి 100, ముంజులూరు 150, చింతపల్లిలో 130, ఉర్రింకకల్లు మామిడిలలో 350, గిన్నెపల్లిలో 250, తంగెడి కొండలో 25, చిమలూరు 18, దారవాడలో 25, చిలకలూరులో 80, గెడ్డపల్లి 50, కోపల్లెలో 250, రామనర్సాపురంలో 180, సరిపల్లికుంటలో 25 మందితో గ్రూపు మీటింగులు జరిగాయి. సభలలో సిహెచ్. వసంతరావు, ఎస్. రామ్మోహన్, డి. గోవింద్‌లు మాట్లాడారు.

బహిరంగ సభలు

మార్చి 27న ముంజులూరు పంచాయతీ పరిధిలోని గ్రామాలకు కన్నిర్పాడు గ్రామంలో 400 మందితో బహిరంగసభ జరిగింది. ఎంపీటీసీ యు. ఏసుబాబు అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగసభలో పార్టీ జిల్లా నాయకులు కా॥ ధర్ముల సురేష్ మాట్లాడుతూ, ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన అటవీ చట్టం ద్వారా గిరిజనులకు పట్టాలు ఇస్తామని, భూములు పంచుతామని ప్రచారం చేస్తూ ఇప్పుడు గిరిజన గ్రామాలను ఖాళీ చేయించటానికే కుట్ర జరుగుతుందని విమర్శించారు. గిరిజన వ్యతిరేక చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. అన్‌రిజర్వ్ భూమి గిరిజనులకు దక్కే వరకు జరిగే పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా ఈ సభలో ఎపీసీఎల్‌సీ రాష్ట్ర నాయకులు ఎన్. శ్రీమన్నారాయణ, ఎ.ఐ.కె.ఎం.ఎస్ నాయకులు వెట్టి సుబ్బన్న, పీవైఎల్ నాయకులు పి. సత్యం, ముంజులూరు సర్పంచ్ కా॥ కె. చల్లమ్మ మాట్లాడారు.

28.3.08న జిల్లెల్లగూడెం పంచాయితీ పరిధిలోని చింతపల్లిలో 300 మందితో యు. ఏసుబాబు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సభలో పార్టీ జిల్లా నాయకులు కా॥ ధర్ముల సురేష్, ఎ.ఐ.కె.ఎం.ఎస్. నాయకులు వెట్టి సుబ్బన్న, పీవైఎల్ నాయకులు పి. సత్యం మాట్లాడారు.

29.3.08న గెడ్డపల్లిలో 250 మందితో బహిరంగసభ జరిగింది. కా॥ వెట్టి సుబ్బన్న అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ జిల్లా నాయకులు కా॥ ధర్ముల సురేష్, ఎంపీటీసీ యు. ఏసుబాబు, సర్పంచ్ సత్యనారాయణ, పీవైఎల్ నాయకులు పి. సత్యం మాట్లాడారు. ఐదువేల కరపత్రాలతో విస్తృతంగా ప్రచారం జరిగింది.

ఐటీడీఏ ముట్టడి - పనుల స్థంబన

సింగరేణి అవసరాల కోసం పశ్చిమ ఏజన్సీలోని అన్‌రిజర్వ్‌డ్ భూములను రిజర్వ్ ఫారెస్టుగా మార్చి గిరిజనులను బయటకు గెంటి వేయడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ), ఎ.ఐ.కె.ఎం.ఎస్.ల ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న కె.ఆర్.పురంలోని ఐ.టి.డి.ఎ. కార్యాలయాన్ని ముట్టడించారు. విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బయటకు పంపించి వేశారు. కార్యాలయాన్ని స్థంబింపజేశారు.

వందలాది మంది గిరిజనులు ఎర్ర జెండాలు, బ్యానర్లు చేపట్టి భారీ ప్రదర్శనగా వచ్చి ఐ.టి.డి.ఏ. కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ ప్రదర్శనలో గిరిజనులు తమ సాంప్రదాయక ఆయుధాలైన విల్లంభులు ధరించి అగ్రభాగాన పాల్గొన్నారు. నినాదాలతో ఐ.టి.డి.ఎ. కార్యాలయం మారుమోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఇల్లెందు ఎమ్మెల్యే కా॥ గుమ్మడి నర్సయ్య, ఎ.ఐ.కె.ఎం.ఎస్. రాష్ట్ర కార్యదర్శి కా॥ కె. రంగయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభకు న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కా॥ ధర్ముల సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సభలో ఇల్లెందు ఎమ్మెల్యే కా॥ గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ, గిరిజనుల డిమాండ్‌ను అసెంబ్లీలో వివరించడానికి వాయిదా తీర్మానం కోసం నోటీసు యిస్తే స్పీకర్ తిరస్కరించాడని ఆయన తీవ్రంగా ఖండించారు. వివిధ జిల్లాల్లో వివిధ కారణాలతో గిరిజనులపైన ప్రభుత్వం దాడి చేస్తున్నదనీ, దీన్ని ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. అన్‌రిజర్వ్‌డ్ ఫారెస్టును రిజర్వ్ ఫారెస్టుగా మార్చి గిరిజనులను అడవి నుండి గెంటివేస్తే తీవ్ర ప్రతిఘటన చవి చూడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టువల్ల కొన్ని గిరిజన గ్రామాలు, సింగరేణి కోసం మరికొన్ని గ్రామాలు, కొవ్వాడ రిజర్వాయర్ వల్ల కొన్ని గ్రామాలు మింగేస్తుంటే రేపు గిరిజనుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. పశ్చిమ ఏజెన్సీలో ఉన్న ఫారెస్టు భూమి తక్కువ. గ్రామాలు తక్కువ. వున్న వాటిని ఈ విధంగా ఖాళీ చేయిస్తే సహించబోమని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వమే నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే గిరిజనులు పెద్దఎత్తున ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎ.ఐ.కె.ఎం.ఎస్. రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె. రంగయ్య, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి కా॥ కె. పోలారి, కా॥ యుపీ తదితరులు ప్రసంగించారు.

ఈ ముట్టడి అనంతరం ఐ.టి.డి.ఎ. పి.ఓ. లేక పోవడంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ షేక్ సుల్తాన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన వెంటనే ఫోనులో జిల్లా కలెక్టర్‌కు గిరిజనుల డిమాండ్‌ను వివరించారు. ఈ విషయాన్ని పునఃపరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ హామీ యిచ్చారని ఎస్.డి.సి. తెలియజేశారు. అనంతరం ఐ.టి.డి.ఎ. నుండి కన్నాపురం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రధాన వీధుల్లో ఈ ర్యాలీ జరిగింది.

ఈ కార్యక్రమానికి సి.పి.ఐ(ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) జిల్లా నాయకులు కామ్రేడ్స్ ధర్ముల సురేష్, కె. పోలారి, పి.ఆర్. గూడెం ఎం.పి.టి.సి. యు. ఏసుబాబు, అలివేరు సర్పంచ్ పట్టెల చిన్నన్న, ముంజులూరు సర్పంచ్ కతల చెల్లమ్మ, గెడ్డపల్లి సర్పంచ్ సత్యనారాయణ, కోర్సవారిగూడెం సర్పంచ్ గురుగుట్ల చెల్లమ్మ, అంతర్వేదిగూడెం ఎం.పి.టి.సి. గురుగుంట్ల చిన్నబ్బి, ఎ.ఐ.కె.ఎం.ఎస్. జిల్లా నాయకులు వి. సుబ్బన్న, పి. శ్రీను, ఇఫ్టూ నాయకులు కె.వి. రమణ, యు.వి., పీడీఎస్‌యూ నాయకులు యన్. రామ్మోహన్, సిహెచ్. వసంతరావు, పీవైఎల్ నాయకులు టి. ప్రకాష్, సత్యం, పీఓడబ్ల్యూ నాయకులు వి. భారతి, పద్మలత, తదితరుల్లు నాయకత్వం వహించారు.

లెనిన్ బోధనలను అనుసరిద్దాం! మహోపాధ్యాయుడు లెనిన్ బాటనే పయనిద్దాం!!

ఈ సంవత్సరం ఏప్రిల్ 22న కామ్రేడ్ లెనిన్ 138వ జయంతి. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) 39వ ఆవిర్భావ దినం కూడా. ఈ సందర్భంగా లెనిన్ బోధనలను అనుసరించి భారత విప్లవాన్ని విజయవంతం చేయటానికి పునరంకితమవుదాం.

మార్క్స్, ఏంగెల్స్‌ల విప్లవ సిద్ధాంతాన్ని పరిరక్షించి, మరింత వున్నత స్థాయికి అభివృద్ధి చేసిన మహోన్నత కార్మికవర్గ నాయకుడూ మహోపాధ్యాయుడూ కామ్రేడ్ లెనిన్. ప్రపంచంలో విజయవంతమైన మొట్టమొదటి సోషలిస్టు విప్లవానికి - రష్యా అక్టోబరు సోషలిస్టు మహా విప్లవానికి నాయకత్వం వహించిన గొప్ప విప్లవకారుడు కామ్రేడ్ లెనిన్. మొట్ట మొదటి సోషలిస్టు దేశంలో సోషలిస్టు నిర్మాణానికి ఆయన మార్గదర్శకత్వం వహించాడు. రష్యా నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిజాన్ని సమర్ధవంతంగా వర్తింప చేయటమే కాకుండా, ఆనాటి ప్రపంచ పరిస్థితులను ప్రతిభావంతంగా విశ్లేషించి అంతర్జాతీయ కమ్యూనిస్టు వుద్యమానికి నిర్దిష్ట వ్యూహం, యెత్తుగడలను కామ్రేడ్ లెనిన్ రూపొందించాడు. ప్రపంచ కమ్యూనిస్టు వుద్యమానికి సరియైన మార్గదర్శకత్వాన్ని అందించాడు.

రష్యాలో కేవలం అధ్యయన గ్రూపులకే పరిమితమైన మార్క్సిజాన్ని మొట్టమొదటగా కార్మికోద్యమంతో జోడించిన వాడు లెనిన్ - నర్నోక్కుల, సోషలిస్టు రివల్యూషనరీల వ్యక్తిగత హింసావాద సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోరాడి ఓడించాడు. మరోప్రక్క ఆర్థికవాదం, లీగలిజం, ప్రాప్తకాలజ్ఞతా ధోరణులకు వ్యతిరేకంగా పోరాడి ఓడించాడు. ఏకశిలా సదృశమైన విప్లవపార్టీ నిర్మాణానికి ఆయన పట్టుదలతో కృషి చేశాడు.

కాట్‌స్కీ నాయకత్వంలోని రెండవ ఇంటర్నేషనల్ ముందుకు తెచ్చిన పిడివాద, రివిజనిస్టు సిద్ధాంతాలను కామ్రేడ్ లెనిన్ చీల్చి చెండాడాడు. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి దశలో మార్క్స్, ఏంగెల్స్‌లు 'ఒక దేశంలో విప్లవ విజయవంతం కావడం సాధ్యం కాదని, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలన్నిటిలో ఒకేసారి విప్లవం సాగాల్సి వుంటుందని' చేసిన సూత్రీకరణను మారిన పరిస్థితులను దృష్టిలో పెట్టుకోకుండా గుడ్డిగా వల్లెవేయటాన్ని లెనిన్ ఖండించాడు. పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా మారిన పరిణామాన్ని లెనిన్ వివరించాడు. సామ్రాజ్యవాద యుగంలో ఒక దేశంలో కూడా విప్లవం విజయవంతమవుతుందని వివరించాడు. సామ్రాజ్యవాద యుగంలో ఒక వెనుకబడిన పెట్టుబడిదారీ దేశంలో విప్లవానికి పరిస్థితులు యెలా పరిపక్వమవుతాయో వివరించాడు. రష్యాలో వైరుధ్యాలన్నీ యెలా కేంద్రీకృతమయ్యాయో, అది విప్లవాన్ని యెలా గర్భం దాల్చివుందో వివరించాడు. 'సామ్రాజ్యవాదం - పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' అనే గ్రంథంలో సామ్రాజ్యవాద దశ ప్రత్యేకతలను లెనిన్ విశ్లేషించాడు. ఈ దశలో పెట్టుబడిదారీ విధానపు వైరుధ్యాలన్నీ యెలా పతాక స్థాయికి చేరుకుంటాయో అత్యంత ప్రతిభావంతంగా వివరించాడు. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ అని, చివరి దశ అని వివరించాడు. సామ్రాజ్యవాదమంటేనే యుద్ధమని, సామ్రాజ్యవాదం అనివార్యంగా విప్లవాలకు, సోషలిజానికి దారి తీస్తుందని వివరించాడు. సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధాలు వచ్చినప్పుడు, కార్మికవర్గం వాటిని అంతర్యుద్ధాలుగా మార్చాలని లెనిన్ ప్రబోధించాడు. రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాదులు - సామ్రాజ్యవాదులు పరస్పరం యుద్ధాలకు పూనుకున్నప్పుడు - తమ, తమ సామ్రాజ్యవాద ప్రభుత్వాలను బలపరచటాన్ని, జాతీయ దురహంకార చర్యలుగా, కార్మిక విద్రోహంగా కామ్రేడ్ లెనిన్ ఖండించాడు.

రష్యాను భూస్వామ్య విధానంవైపు వెనక్కి తీసుకు పోవాలనే సోషలిస్టు రివల్యూషనరీ సిద్ధాంతాన్ని లెనిన్ వ్యతిరేకించాడు. బూర్జువావర్గం సామ్రాజ్యవాదులతోను, భూస్వాములతోను మిలాఖతై బూర్జువా విప్లవానికి ద్రోహం చేసిందని, బూర్జువా విప్లవ కర్తవ్యాలను కూడా కార్మికవర్గమే పూర్తి చేయాల్సి వుంటుందని కామ్రేడ్ లెనిన్ ప్రబోదించాడు. మెన్షివిక్కులు పెట్టుబడిదారుల పార్టీ అయిన కేడెట్లను బలపరచాలని చేసిన వాదనలను కార్మిక ద్రోహంగా లెనిన్ ఖండించాడు.

కామ్రేడ్ లెనిన్ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని వున్నత స్థాయికి అభివృద్ధి చేశాడు. గతితార్కిక భౌతికవాద సిద్ధాంతం మీద తన కాలంలో బూర్జువా తత్వవేత్తలు సాగించిన దాడిని 'భౌతిక వాదం - అనుభవవాద విమర్శ' అనే గ్రంథం ద్వారా ఆయన యెదుర్కొన్నాడు. సామ్రాజ్యవాద దశ విశ్లేషణద్వారా ఆయన మార్క్సిస్టు అర్థశాస్త్రాన్ని నూతన దశకు అభివృద్ధి చేశాడు.

సంపాదకీయం

'రాజ్యాంగ యంత్రం - విప్లవం' పుస్తకం ద్వారా బూర్జువా రాజ్యాంగ యంత్ర మంటే కార్మికవర్గాన్ని అణచివేసే నియంతృత్వ సాధనమని, దానిని కార్మికవర్గం సాయుధ విప్లవం ద్వారా మాత్రమే కూలద్రోయగల్గుతుందని కామ్రేడ్ లెనిన్ బోధించాడు. ఆ తర్వాత యేర్పడే కార్మికవర్గ రాజ్యాంగ యంత్రం కూడా బూర్జువా వర్గంపై కార్మికవర్గం నియంతృత్వంగానే కొనసాగుతుందని బోధించాడు. కార్మికవర్గ నియంతృత్వం లేకుండా సోషలిజాన్ని కాపాడుకోవటం అసాధ్యమని ఆయన బోధించాడు.

మార్క్సిస్టు విశ్వజనీన సత్యాలకు తిలోదకాలు యివ్వటానికి పూనుకున్న రివిజనిస్టులకు వ్యతిరేకంగా లెనిన్ పోరాడాడు. మరోవైపు, అరాచకవాదానికి వ్యతిరేకంగా, పిడి వాదానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేశాడు.

'నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట విశ్లేషణ' మార్క్సిజానికి జీవమని కామ్రేడ్ లెనిన్ బోధించాడు. విప్లవ సిద్ధాంతాన్ని ఆచరణకు జోడించాలని ఆయన బోధించాడు. 'విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవోద్యమం లేదు' అని వుద్ఘాటించి విప్లవ సిద్ధాంత ప్రాముఖ్యతను నొక్కి చెప్పాడు. మార్క్సిస్టు విశ్వజనీన సత్యాలకు దృఢంగా కట్టుబడి వుంటూ, నిర్దిష్ట కాలమాన పరిస్థితులకు ఈ సూత్రాలను వర్తింప చేసుకోవాలని లెనిన్ బోధించాడు. పార్లమెంటరిజాన్ని, లీగలిజాన్ని ఆయన వ్యతిరేకించాడు. అయితే, అదే సమయంలో పార్లమెంటరీ, లీగల్ సంస్థలలో విప్లవకారులు పాల్గొని వుపయోగించుకోవాలని నొక్కి చెప్పాడు. పార్లమెంటరీ, పార్లమెంటేతర పోరాటాలను, చట్టబద్ద, చట్ట విరుద్ధ పోరాటాలను నైపుణ్యంగా జోడించాలని ఆయన బోధించాడు. ఆర్థిక పోరాటాలను, రాజకీయ పోరాటంతో జోడించాలని, తక్షణ సమస్యలపై పోరాటాలను రాజకీయాధికారం కోసం జరిగే విప్లవ పోరాటంతో జోడించాలని లెనిన్ ప్రబోధించాడు.

లెనిన్ 138వ జయంతి సందర్భంగా లెనిన్ బోధనలను లోతుగా అధ్యయనం చేయటానికీ, మన విప్లవాచరణకు అన్వయించుకోవటానికీ ప్రతిన పూనుదాం. అతివాదం, మితవాదులకు వ్యతిరేకంగా, రివిజనిజం, పిడివాదాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాన్ని కొనసాగిన్తూ మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధాన పవిత్రతను కాపాడుకుందాం. భారత నూతన ప్రజాస్వామిక విప్లవ పోరాటాన్ని విజయోన్ముఖంగా ముందుకు తీసుకుపోదాం.

మీకు తెలుసా? అన్నార్తుల ఆకలితో వ్యాపారం

దారిద్ర్యం, నిరుద్యోగాలతో పీడించబడ్తున్న కోట్లాది భారతీయులు తన కుటుంబ సభ్యుల ఆకలిని తీర్చుకోటానికి, కనీసావసరాలను పూర్తి చేయటానికి, గడ్డుకాలంలో చేసిన బాకీలను తీర్చటానికి తమ శరీరాంగాలను అమ్ముకోవలసిన దుస్థితికి నెట్టబడ్తున్నారు. ధన దాహం కల్గిన స్వార్ధపరులు వీరి దయనీయ పరిస్థితిని వుపయోగించుకొని వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారు. అనేక అమానుష నేరాలకు, మోసాలకు పాల్పడుతున్నారు.

మానవ అంగాలను కొనటం, అమ్మటం చట్టరీత్యా నేరం. అయినా చట్టాల కళ్లుగప్పి ఈ వ్యాపారం మూడు పూవులు, ఆరు కాయలుగా సాగుతోంది. అమాయక ప్రజలను మభ్యపరచి, మోసపుచ్చి దౌర్జన్యంగా వారి శరీర భాగాలను బలవంతాన కాజేయటం సర్వసాధారణంగా మారింది. ముఖ్యంగా మూత్రపిండాల వ్యాపారం భారతదేశంలో పెద్దయెత్తున సాగుతోంది.

మన దేశంలో మూత్ర పిండాల వైఫల్యంతో ప్రతి సంవత్సరం 5 లక్షల మంది చనిపోతున్నారు. ప్రపంచంలోనూ లక్షలాది మంది యిలా చనిపోతున్నారు. మన దేశంలో లక్షా, 50 వేల మంది ప్రతి యేడాదీ కిడ్నీల మార్పిడి కోసం హాస్పిటళ్లలో చేరుతున్నారు. కిడ్నీలు దానం చేసేవాళ్లు చాల అరుదుగా దొరుకుతారు. కనుక కిడ్నీలకు దేశంలోనూ, విదేశాలలోనూ పెద్ద డిమాండు యేర్పడింది. ఒక కిడ్నీకి 20 లక్షల వరకు చెల్లించటానికి విదేశీ ధనుకులు సిద్ధపడ్తున్నారు. ఇంత లాభదాయకమైన వ్యాపారం కావటంతో అనేక మాఫియా గ్యాంగులు యిందులో కీలకపాత్ర వహిస్తున్నారు. కిడ్నీలు అమ్ముకుంటున్న వారిలో 71 శాతం మంది స్త్రీలను ఒక అంచనా.

నరమాంస భక్షకులకు ప్రసిద్ధి చెందిన గురుగాం యిప్పుడు కిడ్నీల కుంభకోణంతో వార్తలకెక్కింది. డాక్టర్ అమిత్‌కుమార్ అనే నరరూప రాక్షసుడు ఒక డాక్టర్ల గ్యాంగును యేర్పరచుకొని కిడ్నీల వ్యాపారాన్ని సాగించాడు. గత 9 సంవత్సరాలలో ఈ గ్యాంగు 500లకు పైగా కిడ్నీల మార్పిడిని చేశారు. ఈ వ్యాపారంలో కుమార్ వేయి కోట్లకు పైగా సంపాదించినట్లు అంచనా. ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేసి కిడ్నీలు కాజేశారు. అమాయకులైన పేద రోజు కూలీలను బలవంతాన పట్టుకు వచ్చి నిర్బంధించి దౌర్జన్యంగా ఆపరేషన్లు చేసి వారి కిడ్నీలను కాజేశారు. బాధితులకు తృణమో, పణమో అప్పజెప్పి పంపుతారు. ఇష్టపూర్వకంగా కిడ్నీలు అమ్ముకునే వారికి 50 వేల నుండి లక్ష వరకు ముట్ట చెబుతారు. దీనికి పది రెట్ల నుండి 20 రెట్ల రేటుకు వాటిని దేశ, విదేశీ ధనికులకు అమ్ముకుంటారు. గురుగాం కేంద్రంగా జరుగుతున్న ఈ కుంభకోణం యిటీవలే బయటపడి అమిత్‌కుమార్ అరెస్టు చేయబడ్డాడు. అయితే వెల్లడయింది సముద్రంలో నీటి బొట్టంత మాత్రమే. ప్రజలు దారిద్ర్యంతో, నిరుద్యోగంతో, నిస్సహాయ స్థితిలో మ్రగ్గుతున్నంత కాలం, లాభతృష్టే ఏకైక నీతిగా కొనసాగుతున్నంత కాలం నేటుగానో, దాటుగానో ఈ వ్యాపారం కొనసాగుతూనే వుంటుంది.

అన్యాయానికి గురి అవుతున్న అడవి బిడ్డలు

అడవి సంపద పట్టుకొని... సామి
షావుకారు కొట్టు కెళితే... సామి
ఈతాకు చుపిండు వాడూ... సామి
తాటాకు దొబ్బిండు వాడు... సామి
సబ్బు పౌడరు మోజు చూపి... ఆ.. ఆ..
రంగు డబ్బల బొమ్మ జూపిండు. కొంపముంచిండు...
కొంపె పెట్టిండు... బాంఛన్ ॥ఏమున్నదక్కో॥

గిరిజనుల ఆర్థిక వనరుల్లో ప్రధానమైన అటవీ వుత్పత్తుల సేకరణ ప్రారంభమయింది. రాష్ట్రంలోని వేలాది మంది గిరిజనులు అటవీ ఉత్పత్తులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. గిరిజనులు సేకరించే చిన్న తరహా వుత్పత్తులు, వ్యవసాయోత్పత్తులకు న్యాయమైన గిట్టుబాటు రేట్లు చెల్లించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఔషద పరిశ్రమల్లో వుపయోగించే అన్ని రకాల వనమూలికలూ, సబ్బులు, షాంపులు, అగర్‌బత్తి, కొవ్వొత్తులు (క్యాండెల్స్) తదితర పరిశ్రమలకు వుపయోగపడే ముడి సరుకులు అటవీ ప్రాంతం నుండే లభిస్తున్నాయి. జిగురు, నారమామిడి చెక్క, కరక్కాయలు, మారేడు గడ్డలు, పుట్ట తేనే, తేనే మైనం, ముషిని గింజలు, చిల్లగింజలు, కుంకుడు, గాకపప్పు, ఉసిరిక పప్పు, నల్ల జీడి గింజలు, అడ్డ ఆకు, తిప్పతీగ, రేల చెక్క, బీడీ ఆకు, శీకాయ తదితర అటవీ వుత్పత్తుల వలన 4 నెలలు గిరిజనులకు వుపాధి లభిస్తుంది. గిరిజనులు అనేక కష్టాలు పడి అటవీ వుత్పత్తులు సేకరిస్తారు. కోడి కూత జామున నిద్రలేచి సద్ది (క్యారేజ్) పట్టుకొని గ్రామాలకు దూరంగా వున్న ఎత్తయిన కొండలు, గుట్టలు, వాగులు, చెట్టు చెట్టూ తిరుగుతూ, మండు టెండకు సైతం లెక్క చేయకుండా, కౄర మృగాల మధ్య ప్రాణాలకు తెగించి సేకరించే అటవీ వుత్పత్తులకు గిట్టుబాటు రేటు లభించటం లేదు.

గిరిజనాభివృద్ధి గురించి నిత్యం ప్రచారం చేసుకొనే పాలకులు గిరిజనులకు ఉపాధి కల్పిస్తున్న అటవీ వుత్పత్తులకు గిట్టుబాటు రేట్లు చెల్లించే సమస్య అసలే పట్టించుకోలేదు. దీనితో గిరిజనుల అభివృద్ధిపై పాలకులకు ఎంత శ్రద్ధ వుందో మనం అర్థం చేసుకోవచ్చు. గిరిజనుల అభివృద్ధికే పాటు పడుతున్నట్లు గొప్పలు చెప్పుకుంటూ అమాయక గిరిజన ప్రజలను పాలకులు మోసం చేస్తున్నారు. పాలకులకు గిరిజనాభివృద్ధిపై చిత్తశుద్ధి వుంటే కల్లబొల్లి కబుర్లతో కాలం గడపకుండా ప్రభుత్వం గిరిజనోత్పత్తులకు న్యాయమైన గిట్టుబాటు రేట్లు కల్పించి మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

అటవీ వుత్పత్తులు సేకరించేటప్పుడు గిరిజనులు పడే కష్టాలు ఇంకా వివరంగా పరిశీలిద్దాం. చీపురు అటవీ నుండి సేకరించి తమ ఇండ్లకు తీసుకొనివచ్చి, వారం రోజులు ఎండలో ఆరపెట్టి చీపులో వున్న పొట్టు దులిపి విడి విడిగా వున్న చీపురు పుల్లలు నారతో కట్టలు కట్టి మార్కెట్‌కు తీసుకెళ్ళుతారు. అలాగే చింత పండు మారకపు సరుకుగా తయారు చేయాలంటే చింత చెట్టు ఎక్కి చింత పండు కింద పడే వరకు దులుపుతారు. కింద పడిన చింతపండును ఒక దగ్గర పొగుచేసి పైపొట్టు శుభ్రపరిచి స్త్రీ, పురుషులు, పిల్లలతో సహా రాత్రింబవళ్ళు నడుములు ఎత్తకుండా, విసుగు విరామం లేకుండా కూర్చొని పిక్క తీసే పనిలో నిమగ్నమైన చేస్తారు. అలా పిక్క తీసిన చింత పండును మళ్ళీ 30-50 కేజీల చొ॥న ముద్దలుగా చేసి స్రీలు నెత్తి మోతలు, పురుషులు కావడి మోతలతో జీసీసీ డిపోలకు తీసుకెళ్ళుతారు. చింత పండు సేకరించుటకు చెట్టు పైకి ఎక్కినప్పుడు ప్రమాదవశాత్తు క్రింద పడి మనిషిని చనిపోవటమో, కాలు, చేతులు విరిగి అంగ వైకల్యం చెందడమో జరుగుతుంటాయి. అన్ని రకాల సబ్బులకు వుపయోగించే శీకాయ సేకరించేటప్పుడు శీకాయ చెట్టుకు వున్న ముళ్ళు మనిషి శరీరమంత గీరుకుపోయి గుచ్చుకుంటాయి. చాలా ఇబ్బంది పెడుతుంది. అయినా ఓపికతో శీకాయ సేకరిస్తారు. నల్ల జీడి గింజలు సేకరించేటప్పుడు చాలా ఇబ్బంది పడాల్సి వుంటుంది. జీడి గింజలో వున్న జీడి మనిషి శరీరంలో పడి పుండ్లు అవుతాయి. అటవీ వుత్పత్తులు సేకరించే సమయంలో గిరిజనులు ఎన్నో కష్టాలు పడవలసి వుంటుంది.

రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ అధికారంలో వున్న యూపీఏ కాంగ్రెసు ప్రభుత్వం గిరిజనాభివృద్ధి కొరకు ఎంతో పాటు పడుతున్నట్లు తన ప్రచార సాధనాల ద్వారా ప్రచారం చేసుకుంటున్నది. కానీ గిరిజనోత్పత్తులకూ, న్యాయమైన గిట్టుబాటు రేట్లు చెల్లించుటకు మాత్రం పాలకులు శ్రద్ధ పెట్టడం లేదు. గత్యంతరం లేని పరిస్థితిలో గిరిజనులు ప్రయివేట్ వ్యాపారస్తులపై ఆధార పడవలసిన పరిస్థితికి నెట్టబడ్డారు. ప్రైవేట్ వ్యాపారస్థులు గిరిజనుల వుత్పత్తులకు చాలా తక్కువ రేట్లు చెల్లించి అదే సరుకు బయటకు తీసుకొని వెళ్ళి అధిక లాభాలు సంపాదిస్తున్నారు. గిరిజనుల ప్రయోజనాల కొరకు పాలకులు చేసిన చట్టాలు ఆచరణలో అమలు జరుగకుండా కాగితాలకే పరిమితమయ్యాయి. అందువలన గిరిజనులపై ప్రైవేట్ వ్యాపారస్థుల దోపిడీ అడ్డూ, ఆపులేకుండా పెరిగిపోయింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుపబడుతున్న గిరిజన కార్పోరేషన్ ద్వారా కూడా గిరిజనులకు ఏమి ఒరగలేదు. పైగా అది చట్టబద్ద దోపిడీ సంస్థగా రుపాంతరం చెందింది.

చట్ట బద్ద దోపిడీ సంస్థగా రూపాంతరం చెందిన జీసీసీ

గిరిజనోద్యమాల ఫలితంగా ప్రైవేట్ వ్యాపారస్థుల, వడ్డీ వ్యాపారస్థుల దోపిడీ మోసాల నుండి గిరిజనులను రక్షించే పేరుతో 1956వ సం॥లో ఎపభుత్వం జీసీసీ సంస్థను ఏర్పాటు చేసింది. కానీ గిరిజనుల సేకరిస్తున్న అటవీ వుత్పత్తులకు జీసీసీ నిర్ణయించి అమలు చేస్తున్న రేటు చాలా తక్కువగా, నామ మాత్రంగా వున్నాయి. కొండ చీపురు, చింత పండు, జిగురు తదితర వుత్పత్తులు సేకరించుటకూ, వాటిని మారకపు సరుకుగా తయారుచేయుటకు తిరిగి తమ వుత్పత్తులను 5-10 కిలో మీటర్ల దూరంలోని జీసీసీ కేంద్రాలకు మోసుకుపోయినందుకు గిరిజనులు పడిన శ్రమకు జీసీసీ నిర్ణయించిన రేట్లు ఏ మాత్రం గిట్టుబాటు కావు. ఒకసారి నిర్ణయించిన రేట్లను కూడా జీసీసీ సంస్థ అటవీ వుత్పత్తులకు కుంటి సాకులతో రేట్లు తగ్గిస్తూ వుంది.

అంతేగాదు గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని జీసీసీ అధికారులు అనేక రకాలుగా దోపిడీ, మోసాలకు పాల్పడుతున్నారు.

పి. కృష్ణ

గిరిజనుల కష్టార్జితమైన అటవీ వుత్పత్తులను తప్పుడు తూకాలతో కొల్లగొడుతున్నారు. తరుగు తీసే పేరుతో ఒక బుట్ట లేదా దిమ్మకు 2, 3 కేజీల చొ॥న చింతపండు, ఇతర వుత్పత్తులు కాజేస్తున్నారు. మండల సెంటర్లలో జరుగుతున్న వారపు సంతలో చెకప్ చేసే పేరుతో జీసీసీ అధికారులు గిరిజనుల దగ్గర వున్న చింతపండునూ, చిన్న వ్యాపారస్థుల దగ్గరవున్న చింతపండు, కొండ చీపురును దౌర్జన్యంగా లాకెళ్ళుతున్నారు. లంచాలు తీసుకొని బడా వ్యాపారుల సరుకును వదిలి వేస్తున్నారు. స్మగ్లర్లను వదిలి వేస్తున్నారు. ఈ విధంగా జీసీసీ చట్టబద్ధంగా దోపిడీ చేస్తూ గిరిజనులకు వ్యతిరేకంగా, బడా వ్యాపారులకు అనుకూలంగా పని చేస్తున్నది.

ఏజెన్సీ అటవీ ప్రాంతం నుండి అనేక రకాల అటవీ సంపద తరలించుకుపోయి కోట్లాది రూపాయలు జీసీసీ సంపాదిస్తున్నది. కానీ గిరిజనులు సేకరిస్తున్న అటవీ వుత్పత్తులకు నామమాత్రపు రేట్లు చెల్లించి వాటిని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ, అధిక లాభాలు సంపాదిస్తున్నారు. ఉదా॥ కు చింతపండు. కేజీ చింతపండును గిరిజనుల దగ్గర 15/- రూ॥లకు కొనుగోలు చేసి అదే చింతపండును బహిరంగ మార్కెట్‌లో కేజీ 35/- రూ॥లకు జీసీసీ అమ్ముకుంటుంది. జిగురు (గమ్ము) కేజీకి 140/- రూ॥లకు గిరిజనుల దగ్గర కొనుగోలు చేసి అదే జిగురు కేజీ 1200/- రూ॥ల చొ॥న ఇతర దేశాలకు అమ్ముకుంటున్నది. ఈ విధంగా ఒక్క 2006 సం॥లోనే ప్రభుత్వం జీసీసీ ద్వారా చింతపండు, శీకాయ, తేనే, ఉసిరిక పౌడర్ తదితర వుత్పత్తులను అమెరికా, జర్మనీ, ఆఫ్రికా తదితర విదేశాలకు ఎగుమతిచేసి నెలకు కోటి రూపాయల చొ॥న సంపాదించింది. ఈ విధంగా ఒకవైపు అటవీ వుత్పత్తుల ద్వారా కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నది. కానీ, అటవీ వుత్పత్తులను సేకరించి మారకపు సరుకుగా తయారుచేసే గిరిజన, గిరిజనేతర పేద ప్రజలకు మాత్రం వారి కష్టానికి ఏ మాత్రం గిట్టుబాటు కాని నామమాత్రపు రేట్లు చెల్లిస్తున్నది.

ప్రపంచ బ్యాంకు విషమ షరతులు అంగీకరించి అప్పులు తెస్తున్న మన పాలకులు పేద ప్రజలకు ముఖ్యంగా గిరిజనులకు ఇస్తున్న సబ్సిడీలను అవకాశం దొరికినప్పుడల్లా ఒక్కొక్కటి క్రమంగా ఎత్తివేయాలని చూస్తున్నారు. ప్రపంచ బ్యాంకు పెట్టే షరతులకు భిన్నంగా నడిచే సాహసం భారత పాలకులకు లేదు. గిరిజనాభివృద్ధి గురించి దశాబ్దాలుగా పాలకులు ఎంతో గొప్పగా ప్రచారం చేస్తూ మరోవైపు గిరిజనులకు అమలు చేసే పథకాలకు బడ్జెట్ తగ్గిస్తూ కేటాయిస్తున్నారు. గిరిజనులు పండించే వ్యవసాయోత్పత్తులకూ, అటవీ వుత్పత్తులకూ న్యాయమైన గిట్టుబాటు రేట్లు చెల్లించుటంలో పాలకులు విఫలమయ్యారు. గిరిజనాభివృద్ధి గురించి తియ్యని మాటలు చెబుతూ అమాయక గిరిజనులను నమ్మిస్తూ ఆచరణలో పాలకులు గిరిజన వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నారు. ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొనుటకు చింతపండు అటవీ వుత్పత్తులను వన సంరక్షణ సమితీలు (విఎస్ఎస్‌లు) పొదుపు మహిళా గ్రూపులు, స్వేచ్ఛంద సంస్థల ద్వారా కొనుగోలు చేయించుటకు వి.ఎస్.ఎస్.లకు అధికారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అటవీ వుత్పత్తులు వి.ఎస్.ఎస్.ల ద్వారా కొనుగోలు చేయుటకు అవకాశమిస్తే గిరిజనుల్లోనే మధ్య దళారులుగా ఏర్పర్చి గిరిజనుల మధ్య తగాదాలు సృష్టించటం తప్ప మరేం కాదు. అంతేగాదు తమ అటవీ వుత్పత్తులకు గిట్టుబాటు రేట్లు పెంచుకోవాలంటే గిరిజనులు గిరిజనులే ఘర్షణలు పడాల్సి వుంటుంది. వి.ఎస్.ఎస్.లకు అటవీ వుత్పత్తులు కొనుగోలు చేసే అధికారం ప్రభుత్వం కట్టబెట్టిన తర్వాత అటవీ వుత్పత్తులకు రేట్లు పెంచే బాధ్యత జీసీసీకి, ప్రభుత్వాధికారులకు గాని వుండదు. వి.ఎస్.ఎస్. కమిటీ సభ్యులు అటవీ వుత్పత్తులు సేకరిస్తున్న గిరిజనులు నిత్యం ఘర్షణలు పడుతు వుంటారు. అంటే, ఐక్యంగా వున్న గిరిజనులను పాలకులు చీలదీస్తున్నారు. ప్రభుత్వాధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తారు.

ప్రజల కర్తవ్యం!

అటవిని నమ్ముకుని అటవిలో లభిస్తున్న వుత్పత్తులపై ఆధారపడుతున్న అడవి బిడ్డల జీవితాలు పాలకుల నిర్లక్ష్యం వలన దుర్భరమవుతున్నాయి. అటవీ వుత్పత్తులు సేకరించే గిరిజనులు అడుగడుగునా దగా పడుతున్నారు. దళారులు ఒక వైపు, జీసీసీ సంస్థ మరోవైపు నిలువునా దోపిడీ చేస్తున్నది. ఖమ్మం జిల్లా భద్రాచలంలోని గిరిజనులు ఇప్ప పువ్వు, ఇప్ప పప్పు సేకరిస్తూ నామమాత్రపు రేట్లకు ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్ముకుంటూ వారి చేత దోపిడీకి గురిఅవుతున్నారు. ప్రభుత్వం ఈ వుత్పత్తులకు రేటు నిర్ణయించి కొనుగోలు చేయుటకు ఎలాంటి శ్రద్ధ పెట్టలేదు. తూర్పు గోదావరి జిల్లాలో తాటి పీచు, జీడి పిక్కలు, వుత్పత్తి చేస్తూ వేలాది మంది గిరిజనులు బ్రతుకుతున్నారు. కానీ ప్రభుత్వం ఈ ఉత్పత్తులకు రేట్ల సమస్య అసలే పట్టించుకోలేదు. తమ వుత్పత్తులకు గిట్టుబాటు రేట్లు నిర్ణయించి ప్రభుత్వం జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలని గిరిజనులకు శంఖ మూదినట్లు వుంది.

తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, వరంగల్, ప్రకాశం, నల్లగొండ, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలో ఒక్కొక్క జిల్లాలో ఒక్కొ రకం వుత్పత్తులు సేకరిస్తూ గిరిజనులు జీవిస్తుంటారు. అందువలన అటవీ వుత్పత్తులు సేకరించే గిరిజనులు తమ వుత్పత్తులకు న్యాయమైన గిట్టుబాటు రేట్లు సాధించుకొనుటకు సంఘటితంగా వుద్యమించాలి. జిగురు, చింతపండు, కొండ చీపురు, ఇప్ప పప్పు, ఇప్ప పువ్వు, అడ్డ ఆకులు, జీడి మామిడి గింజలు, తాటి పీచు, కుంకుడు, కరక్కాయలు, శీకాయ, నారమామిడి చెక్క తేనే, ముషిని గింజలు తదితర వుత్పత్తులకు గిట్టుబాటు రేట్లు ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు చేయాలి. వి.ఎస్.ఎస్.ల ద్వారా అటవీ వుత్పత్తులు కొనుగోలు చేయించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలి. అటవీ వుత్పత్తులకు పెంచిన రేట్లు సీజన్ చివరి వరకు సక్రమంగా అమలు చేయాలి. అటవీ వుత్పత్తులు కొనుగోలు చేసే ప్రతి జీసీసీ డిపోలో అటవీ వుత్పత్తుల రేట్లు తెలియజేసే బోర్డును పెట్టి ప్రజలకు తెలియజేయాలి. అటవీ వుత్పత్తులు కొనుగోలు చేసేటప్పుడు తప్పుడు తూకాలు వేయటంగానీ, తరుగు తీసుకోవటం పూర్తిగా రద్దు చేయాలి. పాలకులు అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గిరిజనులు ఐక్యంగా వుద్యమించాలి. తమ వుత్పత్తులకు న్యాయమైన గిట్టుబాటు రేట్లు సాధించుకొనుటకు పోరాటం ఒక్కటే మార్గం.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగం

ఈ సంవత్సరం (2008)లో ఒక నెలన్నర వ్యవధిలో 2వ సారి విరుచుకుపడిన ఆకాల వర్షాలు రాష్ట్ర రైతాంగాన్ని నిలువునా ముంచివేశాయి. పంటలు పండి చేతికి వస్తున్న ఆనందం లేకుండా చేశాయి. కోసిన వరి పంటలు నీటి పాలైనాయి మట్టి కొట్టుకొన్నది. కల్లాలలో ఆరబెట్టి బస్తాలకెక్కించుటకు సిద్ధంగా వున్న మిర్చి తడిసి ముద్దయింది. కొన్ని చోట్ల వర్షం, వరదల వురవడికి పంటలు నీటిలో కొట్టుకు పోయాయి. మిర్చి, పసుపు, పొగాకు, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, పెసర, చెరుకు, శనగ తదితర పంటలు పాడైపోయి రైతు కన్నీరు పెడుతున్నాడు. గత నెల ఫిబ్రవరి 9 నుండి 14 వరకు ఇలాగే అకాల వర్షాలు సంభవించి ప్రకాశం, గుంటూరు, కృష్ణా, కర్నూలు, ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి ఉభయ గోదావరి తదితర జిల్లాల రైతాంగాన్ని దెబ్బతీశాయి. రూ॥ 700 కోట్ల రూపాయల పంట నష్టమైంది. ఈసారి మార్చి 22-25 వరకు సంభవించిన అకాల వర్షాలు ఖమ్మం, వరంగల్, కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలు, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి 12 జిల్లాలలో దాదాపు 2.5 లక్షల ఎకరాలలో రూ॥ 500 కోట్ల పంటల్ని నాశనం చేశాయి. 22 మంది ప్రాణాలు తీశాయి. ఆస్తినష్టం కల్గించాయి. కొన్ని చోట్ల ఇళ్లూ కూలిపోయాయి. ఇంత తీవ్రంగా సంభవించిన తుఫాను కేరళకు దగ్గరలో అరేబియా సముద్రంలో ఏర్పడి కేరళ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లలోని దక్షిణ కోస్తా ప్రాంతాన్ని తీవ్రంగా దెబ్బదీసింది. ఈ తుఫాన్ ప్రభావం బంగాళాఖాతంలో కూడా విస్తరించింది. ఈ ప్రభావం వల్ల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు 12 జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. ఈ విధంగా ప్రతి సంవత్సరం వరుసగా సంభవిస్తున్న తుఫాన్ వర్షాలు, వరదల వల్ల రైతాంగానికి కలిగే నష్టం ఎనలేనిది. దీనితో రైతాంగం దారుణమైన దీనస్థితికి నెట్టబడుతున్నది. ఈ పరిస్థితికి అభివృద్ధి పేరుతో జరిగే అక్రమ చర్యలు, పోకడలు కూడా కారణమవుతున్నాయని నిపుణులు అంటున్నారు. దీనికి పాలకులందరి బాధ్యత వుంది.

మనిషి తన బ్రతుకు తెరువుకోసం ప్రకృతిపై ఆధారపడటం మనిషి పుట్టుకతో వున్నది. అయితే, అడ్డూ అదుపు లేకుండా పెరిగిన స్వార్థంతో పకృతి సంపదను కొల్లగొట్టడం వికృత ధోరణి. ఈ ధోరణి ప్రకృతి ధర్మాన్ని మార్చివేస్తున్నది. చెట్ల నరికివేత, నదులు, సముద్రాలలోకి అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు వ్యర్థ పదార్థాలను వదలడం, పరిశ్రమల నుంచి కాలుష్య వాయువులను విడుదల చేయడం వంటి చర్యలవలన ప్రకృతిలో తీవ్రమైన మార్పులు సంభవిస్తున్నాయని వాతావరణ వేత్తలేకాకుండా, పర్యావరణ వేత్తలూ, నిపుణులూ హెచ్చరిస్తున్నారు. అయినప్పటికి పాలకులు పట్టించుకోని పరిస్థితి కొనసాగుతున్నందునే ఇలాంటి పరిస్థితి తలెత్తుతున్నది. ఇలా ప్రకృతి వికృతించినప్పుడు పాలకులు నామమాత్రపు చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు.

ప్రభుత్వ సహాయం నామమాత్రం: అకాల వర్షాలకు దారుణంగా నష్టపోతున్న రైతాంగానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సహాయం నామమాత్రంగానే ఉంటుండటం దారుణం. పంట కోల్పోయి రైతాంగం తదుపరి పంటలు వేసుకొనుటకు కావలసిన విత్తనాలకు, ఎరువులకు కావలసిన పెట్టుబడి మొత్తంలో కొంత సహాయం (రిలీఫ్) ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో వై.ఎస్.ఆర్. ప్రభుత్వం అందజేస్తానంటున్న సహాయం జరిగిన నష్టాన్ని ఏ మాత్రం పూడ్చలేదు. ఇప్పుడు జరిగిన నష్టానికి మిర్చికి ఎకరానికి రూ. 2050, మొక్కజొన్నకి ఎకరానికి రూ.750 అందజేస్తానంటున్నది. అంతేగాదు, ప్రకృతి వైపరీత్యాల ద్వారా సంభవించే నష్టాలకు పరిహారం చెల్లించుటకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ॥ 370 కోట్లు రాష్ట్రానికి అందిస్తున్నది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం 50% నిధులు కలిపి నష్టపరిహారాల కార్యక్రమాలు నిర్వహించి రైతులను ఆదుకోవాలి. కానీ, ఏ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ పనిచేయటం లేదు. "రైతు ప్రభుత్వం"గా చెప్పుకునే వై.ఎస్.ఆర్. ప్రభుత్వము అదే దారిలో నడుస్తున్నది. దీనితో కేంద్ర ప్రభుత్వనిధి మురిగిపోతున్నది. ఒక వేళ నష్టపరిహారం అందితే భూస్వాములకు, పెత్తందార్లకు, పలుకుబడిగల వారికి, అధికార పార్టీల వారికి అందుతున్నది. చిన్న-సన్నకారు రైతులకు సరిగా అందటం లేదు. ముఖ్యంగా కౌలు రైతులుగా వున్న 25 లక్షల మందికి అసలే అందక పోవటం దారుణం. అందుకే సమగ్ర పంటల బీమా పథకం అవసరం. ఇటువంటి పథకంతోనే జరిగిన నష్టాన్ని పూడ్చటం సాధ్యం. లేని యెడల ఆ తరువాత కాలంలో పంటలు పండించటం అసాధ్యం. ఇది ఆహార భద్రత సమస్యలను కలిగిస్తుంది. ప్రపంచంలో పలు దేశాలు పంటల బీమా పథకం, రైతుల బీమా పథకం వంటి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుండగా మనలాంటి వ్యవసాయక దేశంలో అమలు జరగక పోవటం ఘోరమైన విషయం. దేశంలో 70% మంది గ్రామీణులు వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నప్పటికి, రైతాంగం గురించి, వ్యవసాయ రంగం అభివృద్ధి గురించి నోరు చించుకొని ప్రగల్భాలు పలికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవి ఏ రాజకీయ పార్టీలైనా అధికారంలో వున్నప్పుడు ఒక మాట, అధికారంలో లేనప్పుడు మరోమాట మాట్లాడుతూ రైతాంగాన్ని దారుణంగా మోసగిస్తున్నాయి. కాగా, సహాయం చేస్తున్నట్లు చెప్పే పథకాల అమలులో నిబంధనల పేరిట పేద రైతాంగాన్ని అన్యాయం చేస్తున్నారు.

పేదలకు న్యాయం చేయని సహాయం నిబంధనలు: తుఫానులు-వర్షాలు-వరదలకు రైతాంగానికి జరిగే నష్టం పూడ్చలేనిది. పంట నష్టాలను ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో శ్రద్ధపెట్టి నష్టాన్ని శాస్త్రీయంగా అంచనావేసి నష్టపరిహారం చెల్లిస్తే తప్ప రైతుకు న్యాయం జరగదు. అయితే ఆచరణలో పరిహారం చెల్లించేటప్పుడు పాటించే నిబంధనలు అత్యధిక మంది నష్టపోయిన రైతాంగాన్ని నిరాశపర్చుతున్నాయి. ముఖ్యంగా కౌలు రైతును అసలు పట్టించుకోక పోవటం దారుణం. కౌలు రైతులు భూమిపై భారీగా పెట్టుబడులు పెట్టి, కుటుంబం మొత్తం శ్రమచేసి పండించిన పంట నష్టపోతే ఆ రైతుకు నయా పైసా నష్టపరిహారం లభించదు. అంతేగాదు, బ్యాంకుల నుండి రుణాలు తీసుకునే రైతాంగానికే పంటల బీమా వర్తించటం వల్ల చాలా మంది చిన్న, సన్నకారు రైతాంగానికి లభించటం లేదు. అలాగే, షావుకారు వద్ద అప్పు తెచ్చి కొంటే రైతుకు

కెవ్వుల రంగయ్య

బీమా వర్తించదు. ఇక అమలు చేశామని చెప్పే పథకాల తీరు రైతాంగాన్ని ఆకర్షించేవిగా లేవు.

భారతదేశంలో బీమా పథకం అమలు తీరు-తెన్నులు: భారతదేశంలో ఇప్పటి వరకు అమలు జరిగిన బీమా పథకాల తీరుతెన్నులు రైతులందరికి తోడ్పడేదిగా లేదు. వ్యక్తి ఆధారంగా రైతుకు గల భూమి విస్తీర్ణం ప్రాతిపదికగా 1978-79 వరకు అమలు చేసిన బీమా పథకాన్ని 3110 మంది రైతులు ఉపయోగించుకొన్నారని పరిశీలకులు చెప్తుతున్నారు. వారు రూ॥ 4-5 లు ప్రీమియంగా చెల్లించగా, నష్టపరిహారంగా వారికి రూ॥ 37.88 ల అందాయి. అలాగే ఏకీకృత భూమి విస్తీర్ణం ప్రాతిపతికగా 1979లో ప్రవేశపెట్టిన పైలట్ క్రాస్ బీమా పథకం 13 రాష్ట్రాల్లో 1984-85 వరకు అమలు జరిపామంటున్నారు. బ్యాంకు రుణాలతో అనుసందానించిన ఈ పథకం పరిధిలో 6.23 లక్షల మంది రైతులున్నారు. వీరు రూ॥ 197 లక్షలు ప్రీమియంగా చెల్లిస్తే, వారికి అందిన పరిహారం రూ॥ 153 లక్షలు మాత్రమే. సమగ్ర పంటల బీమా పథకం (సి.సి.ఐ.ఎస్) 1985 నుండి 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలైంది. ఈ పథకం క్రింద 1999 వరకు 7.62 కోట్ల మంది రైతులు రూ. 24,922 కోట్లు విలువైన పంటల బీమా చేశారు. రూ. 403 కోట్ల ప్రీమియం చెల్లించారు. పంట నష్టానికి పరిహారంగా వారికి రూ. 2365 కోట్లు అందింది. పంటల బీమాగా సంబంధించిన ఖర్చులో కేంద్రం తన వంతు భారం తగ్గించుకొనే విధంగా 1999-2000 రబీ కాలం నుండి జాతీయ వ్యవసాయ బీమా పథకం ప్రవేశపెట్టింది. సమగ్ర పంటల బీమా పథకం క్రింద కేంద్రం మోయవలసిన భారం కంటే అధికంగా రాష్ట్రాలు భరించే విధంగా. జాతీయ వ్యవసాయ బీమా పథకం రూపొందించింది. 1999 నుండి 2005 ఖరీఫ్ నాటికి 2,14,29,351 మంది రైతులు ఈ పథకం క్రిందికి వచ్చారు. వీరు రూ. 2,223 కోట్ల 75 లక్షల ప్రీమియం చెల్లించగా వీరికి పరిహారం రూ. 6829 కోట్ల 38 లక్షలు అందినది. సమగ్ర పంటల బీమా పథకం క్రింద ప్రీమియం - పరిహారం దమాషా 1.4 వుండగా జాతీయ వ్యవసాయ బీమా పథకంలో అది 1.3కి తగ్గింది. అంతేగాక, ప్రధాన ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు తదితర పంటలకి ఖరీఫ్ సీజన్‌లో చెల్లించాల్సిన ప్రీమియం 2% నుండి 2.5% పెరిగింది. గ్రామ యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని పలు రాష్ట్రాలు చెప్తుతున్నా, ఆచరణలో మండలాన్నే యూనిట్‌గా పరిగణిస్తున్నాయి. మన రాష్ట్రంలో బీమా పరిధిలో వరి విస్తీర్ణం 50%, వేరుశనగ 25%, చెరుకు 15%, పత్తి 5%గా వున్నవి. అంటే, ప్రీమియం అధికంగా వుండటమేగాక, బీమా పథకం మండలం యూనిట్‌గా వుంటం వల్ల సరైన ఫలితాలు వుండవని భావిస్తున్న రైతాంగం ఈ పథకంలో చేరటానికి ముందుకు రావటం లేదు. ఈ పరిస్థితుల్లో అకాల వర్షాలకు నష్టపోయిన రైంతాంగాన్ని మేలుచేసే సమగ్ర పంటల బీమా పథకం కోసం పాలకులు రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా వుంది.

రైతాంగం సమైక్యంగా పోరాడాల్సిన అవసరం: పాలకుల రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలనీ, ప్రస్తుతం వున్న లోపభూయిష్టమైన బీమా పథకాల స్థానంలో రైతు అనుకూల సమగ్ర పంట బీమా పథకాన్ని రూపొందించాల్సిన అవసరం ఎంతైనా వున్నది. అన్ని రాష్ట్రాలలో గ్రామ యూనిట్ ప్రాతిపదికగా అమలు జరగాలి. వరి, గోధుమ, పప్పు ధాన్యాలు, నూనె గింజలు, తదితరాలకు 2% మించి ప్రీమియం వుండరాదని, పొగాకు, మిర్చి తదితర వాణిజ్య పంటలన్నిటికి బీమా పథకం విస్తరించాలనీ, వీటికి కూడా ప్రీమియం 3.5% మించి వుండరాదని, మామిడి, అరటి, తదితర తోటలకు జపాన్‌లో వలె పండ్ల చెట్లకి బీమా సౌకర్యం కల్పించాలనీ, చిన్న-సన్నకారు రైతులకు ప్రీమియం చెల్లింపులు 50% సబ్సిడీ కొనసాగించాలనీ, ఆ విధంగా నష్టపోయిన రైతులను సంపూర్ణంగా ఆదుకొనే విధంగా పథకం వుండాలనీ, పంట నష్టపోయిన రైతాంగానికి పంటలను బట్టి ఎకరానికి 5 వేల నుండి రూ. 20 వేల వరకు నష్టపరిహారం చెల్లించాలనీ, తడిచిన పంటనంతా ప్రభుత్వమే తన సంస్థల ద్వారా సరసమైన ధరలను నిర్ణయించి కొనుగోలు చేయాలనీ, నష్టపోయిన రైతుల రుణాలన్ని రద్దుచేసి, కొత్త రుణాలు అందజేయాలనీ, తిరిగి పంటలు వేసుకొనుటకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పనిముట్లు 50% సబ్సిడీపై అందజేయాలని, వర్షాలు-వరదల్లో మరణించిన వారికి రూ॥ 2 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలనీ, ఇళ్ళు కూలి పోయిన వారికి రూ॥ 1 లక్ష రూపాయలతో పక్కా గృహం నిర్మించి ఇవ్వాలనే తదితర డిమాండ్లతో రైతాంగం సమైక్యంగా పోరాడితే తప్ప తమకు న్యాయం జరగదని గుర్తించాలి.

అక్రమ భూస్వాధీన చర్య పట్ల నెల్లిమర్ల రైతుకుటుంబాల ప్రతిఘటన

విజయనగరం జిల్లా నెల్లిమర్లలో నాలుగైదు తరాల నుంచి సుమారు 80 రైతు కుటుంబాలు 62 ఎకరాల పంట భూములను సాగుచేస్తున్నాయి. ఇవి శాసనసభ్యులు సాంబశివరాజు ఫ్యూడల్ కుటుంబీకుల మిగులు భూమిగా ప్రభుత్వం సుమారు మూడు దశాబ్దాల క్రితమే వీరికి యిచ్చింది. అంతకంటే నాలుగైదు తరాల ముందు నుంచి కూడా వీరే కౌలుకు సాగుచేస్తున్నారు. ఇళ్ళ స్థలాలకి కేటాయించే పేరిట ఈ పంట భూమి 'డి'పట్టాల రద్దుకి గత ఏడాది ఆగస్టులో ప్రభుత్వం నోటీసు లిచ్చింది. ఈ నోటీసులను ఉపసంహరించుకొని, శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) ఆధ్వర్యంలో గత డిసెంబరు చివరలో రైతు కుటుంబాల ప్రదర్శన స్థానిక ఎం.ఆర్.ఓ. ఆఫీసుకు జరిగింది. నాటి నుంచి భూపరిరక్షణకై వివిధ రూపాలలో రైతుల కృషి కొనసాగుతున్నది. ఇదిలావుండగా ప్రభుత్వయంత్రాంగం 8.4.2008వ తేదీన ఈ 62 ఎకరాల పంట భూముల స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడంతో న్యూడెమోక్రసీ నాయకత్వంలో రైతు కుటుంబాలు ప్రతిఘటనకి దిగాయి.

స్థానిక తహశీల్దారు ఆఫీసుకి చెందిన సర్వేయరు తదితర సిబ్బంది కొలత రాళ్ళతో కూడిన ట్రాక్టరుతో నేరుగా ఆ రోజు భూముల మీదికి వచ్చారు. భూములను సర్వేచేసి సరిహద్దు రాళ్ళు పాతి స్వాధీన పరుచుకునే లక్ష్యంతో వచ్చిన వార్త అందిన వెంటనే న్యూడెమోక్రసీ మండల డివిజన్ కమిటీల నాయకత్వం రంగంలోకి దిగింది. స్వల్ప సమయంలోనే రైతు కుటుంబాలని సమీకరించింది. సుమారు 20 మంది మహిళలతో సహా మొత్తం 75 మంది రైతులు భూముల వద్దకు చేరారు. మండుటెండలో సుమారు మూడు గంటలపాటు వివాదం కొనసాగింది. కొలతరాళ్ళను పాతనివ్వకుండా ప్రజలు అటకాయించారు. సిబ్బంది వెను దిరక్క తప్పలేదు.

ఈ ఆందోళనకి న్యూడెమోక్రసీ నాయకులు కా॥ కె. సన్యాసిరావు, కె. సింహాచలం, పీడీఎస్‌యూ నాయకులు పి. మల్లిక్ సారధ్యం వహించారు. ఈ రైతు కుటుంబాలతో సాంఘిక సంబంధాలు గల స్థానిక దేశం పార్టీ నాయకులు బైరెడ్డి నాగేశ్వరరావు (మాజీ నెల్లిమర్ల గ్రామ సర్పంచ్) లెంక అప్పల నాయుడు తదితరులు కూడా ఈ ఆందోళనలో పాల్గొని తమ సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వ సిబ్బంది వెను తిరిగి వెళ్ళిపోయాక భూముల దగ్గరే జరిగిన సభలో న్యూడెమోక్రసీ నాయకులు ప్రసంగించారు. మున్ముందు పోలీసు బలగాలతో భూస్వాధీనానికి ప్రయత్నించే ప్రమాదం వుందని రైతాంగం అప్రమతంగా వుండాలన్నారు. సంఘీభావ వుద్యమాన్ని నిర్మించుకోవాల్సి వుందని కూడా సందేశమిచ్చారు.

దళిత విముక్తి -

ఇటీవల దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఎన్నికలలో బి.యస్.పి. విజయం సాధించింది. బి.యస్.పి. నేత మాయావతి ముఖ్యమంత్రిగా అధికారం స్వీకరించారు. గతంలో కూడా రెండు దఫాలు బి.యస్.పి. పార్టీ ఆ రాష్ట్రంలో అధికారంలో భాగస్వామ్యం వహించింది. ఒక దఫా బూర్జువా - భూస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌తోనూ, మరో దఫా బీజేపీతోనూ అధికారం పంచుకున్నది. ఈ దఫా సొంతంగా అధికారం నిర్వహించగలిగే మెజారిటీని సాధించింది. అయితే అధికారం కోసం ఎన్నికలలో సర్వజన సమాజ్ పేరుతో బ్రాహ్మణ, వైశ్య కులస్థులను కూడా కలుపుకుని వుమ్మడిగా పోరాడారు.

ఇలా బ్రాహ్మణుల, వైశ్యుల మద్దతు కూడా తీసుకుని అధికారంలోనికి రావటం పట్ల దేశంలో చర్చ జరుగుతోంది. మాయావతి దళిత బహుజన వుద్యమాన్ని మరింత 'ప్రజాస్వామికీకరించారని' కొందరు అభిప్రాయపడుతున్నారు. దళిత విముక్తికి, దళిత బహుజనుల రాజ్యాధికార సాధనకు మాయావతి ఫార్ములా ప్రత్యామ్నాయమని, యిది సరైందని అభిప్రాయ పడుతున్నారు; ఇతర రాష్ట్రాలలో కూడా ఈ ప్రయోగం అమలు చేయాలని భావిస్తున్నారు. అయితే పెరియార్, పూలే, అంబేద్కర్ వంటి వారందరూ దళిత విముక్తికి బాహ్మణవాద వ్యతిరేక వుద్యమాలు నిర్వహించారు. దానికి భిన్నంగా యు.పి.లో ప్రస్తుతం అదే బ్రాహ్మణ సెక్షన్‌ను కూడా కలుపుకుని అధికారానికి వచ్చిన తీరును ఎలా చూడాలనేది చర్చనీయాంశం.

మార్క్సిస్టు-లెనినిస్టులో, విప్లవకారులో భావించిన వాటిని అటుంచినా డా॥ అంబేద్కర్, పూలే, పెరియార్ వంటివారు దళితుల విముక్తి, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసి ఆరాటపడినవారు. వారి ఆశయాల వెలుగులో కృషి చేస్తామని ఏర్పడిన బి.యస్.పి. యిటీవలి ఎత్తుగడలు ఆ నాయకుల భావాలకు అనుగుణంగా వున్నాయా అనేది ఆలోచించాలి. ఈ సందర్భంగా దళిత విముక్తి వుద్యమాల అవగాహనను ఒక దఫా చర్చించుకోవటం అవసరం.

దళిత విముక్తి పట్ల వివిధ అవగాహనలు:

భారతదేశంలో అణగారిన కులాల సామాజిక వుద్యమాలు మూడు ప్రధాన సూత్రాలపై ఆధారపడి నడుస్తున్నాయి. దోపిడీకి ప్రాతిపదికగా సమాజం రెండు వర్గాలుగా (దోచుకోబడేవారు-దోచుకునేవారు) విభజింపబడి వుండటాన్ని సామాజిక వుద్యమం గుర్తిస్తుంది. భారతదేశంలో 'జన్మతః పవిత్రం - అపవిత్రం' అనే ప్రాతిపదికన కులాల వర్గీకరణ జరిగింది. నాగరికతకు సంబంధించిన అన్ని రంగాలలో పీడితుల ఆధిపత్యాన్ని పీడక సామాజిక వ్యవస్థ ఛాలెంజి చేస్తుంది. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, మత వ్యవస్థలలో బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని పెరియార్ ఛాలెంజి చేశార్ను బ్రాహ్మణవాద వ్యవస్థ సంపూర్ణ నిర్మూలనకు ఒక పథకం రూపొందించారు. మెరుగైన సమాజానికి ప్రత్యామ్నాయ నమూనాను సాంఘిక వుద్యమం ఆశిస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం విలువలపై ఆధారపడిన సమాజాన్ని అంబేద్కర్ ఆకాంక్షించారు. గాంధీ వర్ణాశ్రమ ధర్మ సిద్ధాంతాన్ని వ్యతిరేకించారు. ఆత్మ గౌరవం, స్వీయ చైతన్యంతో కూడిన గుర్తింపును కోరుకున్నారు. పీడక సామాజిక వ్యవస్థ అంతాన్ని కోరుకున్నారు; స్వేచ్ఛ, సమానత్వంతో కూడిన సమాజాన్ని కాంక్షించారు.

భారతదేశంలో సమాజంలో వర్గ విభజనతోపాటు కుల విభజన కూడా వుండటం ప్రత్యేకమైన అంశంగా వుంది. సమాజ మనుగడకు అవసరమైన సహజసిద్ధ శ్రమ విభజనను వర్గాలు ఏర్పడటంతో బానిస సమాజంలో వర్గ దోపిడీ పరిరక్షణకై దాన్ని శాశ్వతం చేసి వర్ణ విభజనగా మార్చారు. సమాజంలో సొంత ఆస్తి, వారసత్వం ఏర్పడటంతో ఫ్యూడల్ భూస్వామ్య సమాజంలో వర్ణ విభజనను శాశ్వతం చేసి కులాలుగా స్థిరీకరించారు. జన్మతః పవిత్ర, అపవిత్ర భావాలను ముందుకు తెచ్చారు. 'అంటరాని తనాన్ని ప్రవేశపెట్టారు'. సమాజపు మెదడును విషపూరితం చేసి ఈ కుల వివక్షను, కులోన్మాదాన్ని నింపివేశారు. మతం దీనికి ముఖ్యంగా హిందూమతం శక్తివంచన లేకుండా నడుం కట్టింది. అంటరాని తనాన్ని, కులవివక్షను, అసమానత్వాన్ని ప్రశ్నించిన వారిని, ఎదిరించి, ప్రతిఘటించి వారి అంతు చూసింది.

దళితులపై జరుగుతున్న దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా ముఖ్యంగా అంటరానితనం, దళితుల ఆత్మగౌరవం కోసం, విద్య హక్కు కోసం, వివిధ దశల్లో వివిధ తరాల దళితులు పెరియార్, పూలే, అంబేద్కర్ వంటి వారి నాయకత్వంలో సామాజిక వుద్యమాలు నడిపారు. హిందూ మత ప్రవక్త మనువాద బ్రాహ్మణవాద భావజాలం, ఆధిక్యతకు వ్యతిరేకంగా పోరాడారు. వలస పాలకుల అధికార మార్పిడి సందర్భంగా, రాజ్యాంగ రచన సమయంలో అంబేద్కర్ వంటి నాయకుల కృషి మూలంగా అణగారిన, అవమానాలకు, అంటరానితనానికి, అసమానతలకు గురవుతున్న దళితులకు వుపయోగపడే సానుకూల చర్యలను (రిజర్వేషన్లను) ప్రతిపాదించారు, సాధించారు.

ఇది జరిగి 50 సం॥లు నిండినా దళితులు నేటికీ యింకా ఎందుకు వివక్షకు గురవుతున్నారు? వెనుకబడి, అసమానతకు గురవుతున్నారు? వివక్షకు, దాడులకు గురవుతున్నారు? దీని నుండి బయట పడడమెలా అనే ఆలోచన వచ్చింది. డాక్టర్ అంబేద్కర్ తర్వాత దళితుల సామాజిక వుద్యమాలపై పలు రకాల ప్రతిపాదనలు ముందుకు తెచ్చారు. అందులో ఒకటే - "దళిత బహుజనులకు రాజకీయాధికారం" అనే యుపి రాష్ట్ర దళితనేత కాన్షీరాం పిలుపు.

ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటిలో వర్గ, కుల, జండర్, మత, జాతి అసమానతలు లేకుండా సమానత్వం తప్పకుండా వుండాల్సిందే. అయితే వీటిని సాధించటమెలా అనే దగ్గరే భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరు వర్గ విప్లవం మొదట పూర్తయిన తర్వాత కుల సమస్య. పరిష్కారం గురించిన ఆలోచన చేయాలంటున్నారు. మరికొందరు వర్గ విప్లవం, ఆర్థిక ఆధిపత్యం కంటే ముందే దళితులు రాజకీయాధికారం సాధించుకోవాలని ఆలోచిస్తున్నారు.

రాజకీయ వ్యవస్థ ఆర్థిక వ్యవస్థకు ప్రతిబింబం మాత్రమే:

సమాజ మనుగడకు అవసరమైన భూమి, నీరు, అడవి, ఇతర సంపదలపై, వుత్పత్తి సాధనాలపై యాజమాన్యం ఎవరిదనే దానిని బట్టే ఆ సమాజంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఆధిపత్యం కూడా చలామణిలో వుంటుందనేది అర్థం చేసుకోవాలి. రాజకీయ ప్రాతినిధ్య సంస్థలు ఆర్థికంగా బలవంతుల రాజకీయ ప్రతినిధులు మాత్రమే. సమాజంలో అత్యధిక మెజారిటీ పేద ప్రజానీకంలో కూడా దళితులు, వెనుకబడిన, అణగారిన ప్రజానీకం గణనీయమైన సంఖ్యలో వుండటమేగాక వీరు సంపద, వుత్పత్తి సాధనాల నుండి వెలివేయబడినారు. అగ్రవర్ణ భూస్వాములు, పెత్తందార్లు, ధనవంతుల చేతిలో అవన్నీ కేంద్రీకరించబడినాయి. వారిదే గ్రామ సీమలలో రాజ్యాధికారం. దీనిని బ్రద్దలు కొట్టాలి. శ్రమించే పేదలు, దళితుల చేతికి వుత్పత్తి సాధనాలు, వనరులు రావాలి. అవి రావాలంటే తప్పనిసరిగా దళిత, బడుగు, బలహీన, పేదవర్గాలు ఐక్యంగా వుద్యమించి విప్లవ పోరాటంలో పాల్గొనాల్సిందే. వాటిని చేజిక్కించుకోవటం ద్వారా వాళ్ళ చేతిలో వున్న రాజకీయాధికారాన్ని, రాజ్యాధికారాన్ని కూడా చేజిక్కించుకో గలుగుతారు. అందుకని మనువాద, అగ్రకుల భూస్వామ్య, పెత్తందారీ, సంపన్నుల ఆర్థిక ఆధిపత్యం కూల్చకుండా రాజ్యాధికారం సాధ్యం కాదు. ఒకవేళ వచ్చినా అది నిలకడగా, స్థిరంగా వుండజాలదు. రెండూ పరస్పర సంబంధం కలిగినవి. దోపిడీ రాజ్యాంగ యంత్రాన్ని కూల్చివేసి రాజ్యాధికారం సాధించటం కూడా అవసరం. రెండింటిలో ఏ ఒకటి వున్నా సరిపోదు.

మనువాదానికి పునాది కూడా ఆర్థిక వ్యవస్థే. దోపిడీ వ్యవస్థ పరిరక్షణ కోసమే మనువు హిందూ మత ధర్మ సూత్రాలు బోధించాడు. ఆశించిన దళిత విముక్తి, స్వాతంత్ర్యం, సమానత్వం సాధించాలంటే వీటిని మరువకూడదు.

అంటరానితనానికి, దళితుల ఆత్మగౌరవం, అభ్యున్నతికి నిర్విరామంగా పోరాడిన డా॥ అంబేద్కర్ నిరాశతో నిస్సహాయులై తన జీవిత చరమాంకంలో దళిత విముక్తికి మత మార్పిడిని పరిష్కారంగా ఎంచుకున్నారు. మొదట సాంస్కృతిక సమానత్వాన్ని బోధించే సిక్కు మతంలోనికి మారాలని ప్రయత్నించారు. కాని పరిశీలనలో అక్కడ అమలవుతున్న అసమానతలు గమనించి ఆ ఆలోచన విరమించుకున్నారు. తిరిగి బౌద్ధ మతంలోనికి మారారు. ఆయన వెంట ఆయన అనుచరులు కూడా చాలా మంది పయనించారు.

డా॥ అంబేద్కర్ బౌద్ధమత స్వీకరణ సమస్యకు పరిష్కారమా?

దళిత రాజకీయ, సామాజిక అస్తిత్వానికి సంబంధించిన తక్షణ సమస్యల పరిష్కారం కోసం 1936లో అంబేద్కర్ రెండు ప్రత్యేక తరహా పోరాటాలను ప్రకటించారు. 1936 ఆగస్టు 15న అయోలా వద్ద బుద్ధిజంలోనికి తన మార్పిడిని ప్రకటించారు. తన మొదటి రాజకీయ సంస్థ "స్వతంత్ర లేబర్ పార్టీ"ని నెలకొల్పారు. రాజ్యాంగ ముసాయిదా రచన కమిటీకి ఆయన చైర్మన్. మైనార్టీ కమ్యూనిటీలకు సెక్యులర్ హక్కులతోపాటు పశ్చిమ దేశాల తరహా పౌరసత్వంపై ఆధారపడిన దేశ రాజ్యాంగం వుండాలని కోరుకున్నారు. అయితే వ్యవస్థలోని వైరుధ్యాలను ఆయన గమనించక పోలేదు. ఆ సందర్భంగా అంబేద్కర్ యిలా చెప్పారు:

"జనవరి 26 (1956)న మనం వైరుధ్యాలతో కూడిన జీవితంలోనికి ప్రవేశించబోతున్నాం. రాజకీయాల్లో సమానంగా వుండబోతున్నాం; సామాజిక, ఆర్థిక జీవనంలో మాత్రం అసమానత్వాన్నే కలిగివుంటాం. రాజకీయాల్లో ఒక మనిషికి ఒకే ఓటు ప్రాతిపదికన సమానత్వం వుంటుంది; మన సామాజిక, ఆర్థిక నిర్మాణం కారణంగా సామాజిక, ఆర్థిక జీవనంలో మాత్రం ప్రతి మనిషికి ఒకే విలువ అనే సూత్రం పట్ల తిరస్కారం కొనసాగుతూనే వుంటుంది. ఇది పరిష్కారం గాకపోతే రాజకీయ ప్రజాస్వామ్యం కూడా ధ్వంసమవుతుంది".

ఆ విధంగా దళితులు గౌరవప్రదమైన జీవనం గడపటానికి అవసరమైన అన్ని రంగాలలో సమానత్వం లేదని సరిగానే గ్రహించారు. అయితే వాటి మధ్య వుండే పరస్పర సంబంధాన్ని ఏ ఒక్కటీ విడిగా మిగతావి లేకుండా అమలు గావటం కష్టమని గ్రహించాలి; అంటే ఆర్థిక స్వాతంత్ర్యం లేని రాజకీయ సమానత్వం నామమాత్రం. వయోజన ఓటు హక్కు వుండటం ఒక్కటే రాజకీయ సమానత్వం కాదు. చట్టం వేరు; ఆచరణ వేరు. అలాగే రాజకీయాధికారం / రాజ్యాధికారం సాధించకుండా ఆర్థిక సమానత్వం అమలు జరుగుతుందని ఆశించటం భ్రమే అవుతుంది. సాంఘిక సమానత్వంతో సహా, అన్ని రంగాల్లో సమానత్వం వున్నప్పుడే అది సమగ్రమవుతుంది. అంతేకాదు వాటిని సాధించటానికి అవసరమైన పోరాట వ్యూహం, ఎత్తుగడలు - వాటి అమలు కూడా అవసరం.

బుద్ధిజం రాడికల్ సామాజిక సందేశం కల్గివుందని ఆయన భావించారు. అది సామాజిక సంబంధాలను మార్చటమే గాకుండా మానవ విలువలను కూడా పెంపొందిస్తుందని భావించారు. అంబేద్కర్ తన చివరి దశలో రాజకీయ సమస్యలపై దృష్టిపెట్టడం కాకుండా సామాజిక మార్పు సాధించటంపైనే దృష్టి వుంచారు. 1956 అక్టోబర్ 14న బౌద్ధమత దీక్ష తీసుకున్నారు. తన యావత్ జీవితం ఇండియాలో బౌద్ధమత ప్రచారానికే అంకితమవుతుందన్నారు. ఒక రాజకీయ నాయకుడిగా రాజకీయాల్లో పాల్గొనేందుకుగాను "రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా" అనే పార్టీని స్థాపించారు.

అయితే ఆయన అత్యంత అహింసాయుతమైన ప్రజా, సమిష్టి ప్రతిఘటన ద్వారా సామాజిక మార్పు తీసుకురావాలని భావించారు. పైగా ఆయన పశ్చిమ దేశాల (వలసవాదుల) ఆధునికత్వం వ్యక్తి స్వేచ్ఛను, మానవ హక్కులను, మానవ నాగరికత శాస్త్రీయ ప్రగతిని ప్రసాదిస్తుందని భావించి దానిని గౌరవించేవారు. ఇది సామ్రాజ్యవాద స్వభావంపై సరైన అంచనా లేనితనాన్నే తెలియజేస్తుంది. సమాజంలో నైతికతను నెలకొల్పే సామాజిక సిద్ధాంతంగా ఆయన బౌద్ధమతాన్ని పరిగణించారు. అంబేద్కర్ అనంతర దళిత వుద్యమాలు దానికి భిన్నంగా సామాజిక మార్పు కోసం రెండు భిన్న ప్రత్యామ్నాయ నమూనాలను ముందుకు తెచ్చాయి. ఈ రెండు సామాజిక, రాజకీయ ప్రత్యామ్నాయాలు పరస్పర సంబంధం లేకుండా దూరంగా వుండి పెద్ద ప్రభావం పడవేయలేక పోతున్నాయి.

యు.పి. ఫార్ములా

= పి టాన్యా

రెండింటిలో ఒకటి మహారాష్ట్రలో సామాజిక ప్రత్యామ్నాయం (మత మార్పిడి), రెండవది, ఉత్తరప్రదేశ్‌లోని రాజకీయ ప్రత్యామ్నాయం.

మహారాష్ట్రలో దళిత - బౌద్ధ వుద్యమం - పరిమితులు!

ఈ రాష్ట్రంలో బౌద్ధ మతం స్వీకరించిన దళితులు అసంఖ్యాక బుద్ధ విహార్‌లు నెలకొల్పారు. వాటిలో అంబేద్కర్, బుద్ధుని విగ్రహాలు నెలకొల్పారు. బౌద్ధమత సాహిత్యం, పాటలు, నాటికలు స్వీయ చరిత్రలు ప్రకటించారు. ఈ మత మార్పిడి వుద్యమం కారణంగా ప్రజల్లో సంచరించేటప్పుడు దళితులు న్యూనతాభావం లేకుండా తలెత్తుకొని తిరుగుతున్నారట! వీటిలో భాగమే - రిపబ్లికన్, దళిత పాంథర్ల వుద్యమాలు!

బౌద్ధులతోసహా ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వెనుకబడిన సెక్షన్ల ప్రజానీకం కోసం కృషి చేయటం కోసం తన నైతిక లక్ష్యంతో రిపబ్లికన్ పార్టీ ఏర్పడింది. స్వలాభంతో కూరుకుపోయిన దళిత (మహర్) నాయకత్వం సమర్ధవంతంగా పనిచేయలేదు. రిపబ్లికన్ పార్టీ నేడు 11 చీలకలుగా విడిపోయింది. పాలక బూర్జువా, భూస్వామ్య కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా వెనుకబడిన కులాలను, ముస్లింలను కూడగట్టటంలో ఈ పార్టీ విఫలమైనిది. మాలేతర దళితులను నచ్చజెప్పి కూడగట్టటంలో కూడా ఈ నాయకత్వం విఫలమయ్యింది. అధికార సంపాదన కోసం కాంగ్రెస్ పార్టీతో అవకాశవాద పొత్తులను కుదుర్చుకున్నది. పాలకవర్గంలోని బలవంతులకు వీరు తోకలుగా తయారయ్యారు. మహారాష్ట్రలో రాజకీయంగా అప్రాముఖ్యమైన సెక్షన్‌గా మిగిలిపోయారు. తమ బహిరంగ సభలలో బౌద్ధమతంలోనికి మార్పిడి గురించి చెప్పటానికే ప్రాధాన్యమిచ్చారు. రాష్ట్రంలోని అణగారిన శెక్షన్ల ప్రజలు ఎదుర్కొనే ఆర్థిక, రాజకీయ సమస్యలపై ప్రజల్ని సమీకరించటానికి ఎలాంటి కృషి చేయలేదు.

దళిత పాథర్స్ వుద్యమం

ఇదే సమయంలో రిపబ్లికన్ పార్టీ అవకాశవాద, అవినీతికర నాయకత్వానికి వ్యతిరేకంగా 1972 సం॥లో దళిత పాంథర్లు బయటికి వచ్చారు. వీరు నూతనంగా విద్యావంతులైన యువకులు, యవ్వనంలో వుండే ఆశలు, ఆకాంక్షలతో నిండివున్నారు. రాడికల్, సామాజిక, రాజకీయ కార్యక్రమాన్ని ప్రకటించారు. ఇది మేధావుల వుద్యమం. పట్టణ దళితులలో నూతన సాంస్కృతిక, మతపరమైన విలువలను పాదుకోల్పగలిగారు. వీరి ప్రభావం వువ్వెత్తున పెరుగుతున్న సందర్భమది. దళిత పాంథర్స్‌లో అత్యంత సమరశీల యోధులయిన యిద్దరు నాయకులు - నామ్‌దేవ్ దశల్, రాజాథాలే అనేవారి మధ్య సామాజిక మార్పుకై సాగే వుద్యమంలో బౌద్ధమత ప్రాధాన్యత గురించిన విషయంలో ఘర్షణ జరిగింది. వుద్యమం రెండు గ్రూపులుగా చీలిపోయింది. వాటిలో దశల్ గ్రూపు మార్బిస్టు వర్గ దృక్పథం అనుసరించింది; థాలే గ్రూపు సామాజిక మార్పుకై అంబేద్కర్ బోధించిన అంబేద్కర్ - బౌద్ధమత నమూనాను అనుసరించింది.

నాయకత్వపు భిన్నమైన ఆదర్శాలు తదితర సమస్యల కారణంగా దళిత పాంథర్స్ వుద్యమం అసంపూర్తిగా మధ్యలోనే అంతమయ్యింది; విస్తారమైన విప్లవ సాహిత్యం, సంస్కృతిని మిగిల్చి వెళ్ళారు. ఈ వుద్యమం ప్రస్తుతం దాదాపు కనుమరుగయ్యింది. బౌద్ధమతంలోనికి నూతనంగా మారిన దళితులకు అంతర్జాతీయంగా బౌద్ధులతో సంబంధాలు నెలకొల్పుకోవటానికి పొరుగునవున్న బౌద్ధమత సమాజాలు - చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు సహాయ పడగలవని అంబేద్కర్ ఆశించారు. ఈ సంబంధాలు బుద్ధగయ, సారనాథ్‌లలో కళాత్మక పగోడాల నిర్మాణానికి మాత్రమే పరిమితమయ్యాయి. కలకత్తాలోని బుద్ధ మహాసభ వంటి దళితేతర బౌద్ధ సంస్థలు అంబేద్కర్ - బౌద్ధ వుద్యమాన్ని పరిగణనలోనికి తీసుకోలేద్మ్క ఇండియాలోని 2500 సం॥ల బౌద్ధమత చరిత్రలో అంబేద్కర్ మత మార్పిడిని కనీసం పేర్కొనలేదు.

మాహరేతర దళితులు రిపబ్లికన్ పార్టీ, దళిత పాంథర్ల నాయకత్వాన్ని తిరస్కరించారు. ఆ మహర్ నాయకుల ఆచరణ సాధ్యంకాని, స్వీయ-మానసిక ధోరణే దీనికి కారణం. దళిత రాజకీయ నాయకత్వం సెక్యులర్ సంఘటన ఏర్పాటుకు బౌద్ధేతర శెక్షన్ల కలుపుకోవటానికి కృషి చేయలేదు. రెండో ప్రత్యామ్నాయం గురించి పరిశీలిద్దాం:

బహుజన సమాజ్‌పార్టీ (బి.యస్.పి.) - నూతన దళిత రాజకీయ సిద్ధాంతం!

బి.యస్.పి. మొదటి నుండీ "దళిత బహుజనులకు రాజ్యాధికారం" అనే నినాదంతో కృషి చేసింది. ఈ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం. "దళిత శోషిత్ సంగ్రామ్ సమితి" అనేది తన రాజకీయ పార్టీ మొదటి పేరు. అంబేద్కర్ భావన కూడా - దళితులు ఆర్థికంగా దోచుకోబడుతున్నారు. సాంస్కృతికంగా వెనక్కు నెట్టబడుతున్నారు. సామాజికంగా వివక్షకు గురవుతున్నారు. అంతేగాకుండా రాజకీయాధికారానికి దూరంగా వుంచబడుతున్నారనేదే. ఈ పార్టీ మొత్తం అణగారిన కులాలన్నీ మాత్రమే ఒకటి కావాలని లేదా సామాజిక వుద్యమాల ద్వారా మైనారిటీ అగ్రకుల రాజకీయ నాయకులను అణచివేయాలనిగాని అనుకోవటం లేదు.

ఇండియాలో రాజకీయంగా వివక్షకు గురవుతున్న కులాల గ్రూపులన్నీ భారత చరిత్రలో అత్యంత ఎక్కువ దోపిడీకి గురయిన కులాల - దళితుల నాయకత్వంలో ఐక్య సంఘటనగా ఏర్పడాలనేది ఈ పార్టీ లక్ష్యం. ఈ అణగారిన మైనార్టి శెక్షన్లన్నీ - యస్.సి., యస్.టి., ఒ.బి.సి., మైనారిటీలు - కలిస్తే భారత జనాభాలో మెజారిటీకి ప్రాతినిధ్యం అవుతారు. అయితే యిక్కడ అణగారిన వర్గాలన్నీ ఐక్యమయితే సంతోషినిచవలసిందే. కాని పూర్వపు దళిత నేతలు ఏ భావజాలానికి వ్యతిరేకంగా దళిత వుద్యమాలు నడిపారో అదే సామాజిక గ్రూపు - మొత్తంగా బ్రాహ్మణులను సైతం అధికారం కోసం పీడిత వర్గాల ఐక్య సంఘటనలో చేర్చుకోవటం ఆ సిద్ధాంతాలకు వ్యతిరేకమైంది. కులతత్వం వదులుకుని సంస్కరించుకున్న కొద్దిపాటి మందిని కలుపుకోవటం వేరు సంగతి. మొత్తంగా బ్రాహ్మణ సమూహాన్నంతా చేర్చుకోవటం గురించి చర్చించాలి.

అస్థిరమైన బి.యస్.పి. విధానాలు - మాయావతిగారి ఫార్ములా!

ఒక సామాజిక వుద్యమంగా ముందుకు వచ్చిన బి.యస్.పి. సామాజిక, రాజకీయ అవకతవకలకు వ్యతిరేకంగా యోధురాలిగా ప్రజల ముందుకు వచ్చింది. తన చారిత్రక లక్ష్యాలను రాజకీయ వత్తిడితో బూర్జువా రాజకీయ ఎత్తుగడలుగా మార్చివేసింది. గతంలో బూర్జువా-భూస్వామ్య కాంగ్రెస్ పార్టీతో అధికారం కోసం పొత్తులు పెట్టుకుంది. ప్రస్తుత బి.యస్.పి. అవగాహన ప్రకారం ప్రతి కులంతో సంబంధాన్ని ఆమోదిస్తుంది. దాని వర్గ సామాజిక స్వభావాన్ని బట్టి గాక రాజకీయ ప్రాతినిధ్యాన్ని బట్టి కలుపుకుంటున్నది. ఈ అవగాహన ప్రకారం బ్రాహ్మణ, వైశ్య కులాలకు యు.పి. రాజకీయ చిత్రపటంలో తగిన ప్రాతినిత్యం లేదని భావిస్తూ బి.యస్.పి. నాయకత్వంలోని సామాజిక వుద్యమంలోనికి వారిని ఆహ్వానిస్తుంది. భారతదేశపు కార్మికవర్గ నాయకత్వంలో జరిగే ప్రజాస్వామిక సామాజిక వుద్యమాన్ని (నూతన ప్రజాతంత్ర విప్లవాన్ని) ఈ కూటమి తిరస్కరిస్తుంది.

తనకు అధికార అందలాన్ని అందించిన సొంత అణగారిన దళితుల బతుకుల్లోని వెతలను తీర్చేందుకు ఏమి చేస్తుందో చూడాలి. తాను ఎంచుకున్న ఎత్తుగడల ఫలితంగా ముందు ముందు చిక్కులు ఏర్పడే అవకాశం వుంది. అప్పుడు ఎటువైపు నిలబడుతుందనేది, నమ్మినవారికి న్యాయం చేస్తుందా లేదా అనేది తేలుతుంది.

ముందున్న ప్రమాదం:

దేశంలోని అణగారిన కులాల మధ్య ఐక్యత అనే పూర్వపు సిద్ధాంతం నుండి ప్రక్కకు జరిగింది. బి.యస్.పి గతంలో నేతలు, మేధావులు ముక్తకంఠంతో ఖండించిన శెక్షన్ల (బ్రాహ్మణ, బనియా) సహాయంతో ప్రస్తుత యు.పి.లోని బి.యస్.పి. ప్రభుత్వం అధికారం నిర్వహిస్తున్నది. ఈ శెక్షన్లను సైతం అధికారంలో కూర్చోబెట్టటం మూలంగా సామాజిక న్యాయం శాంతి భద్రతలు, లౌకికత్వం వంటి విషయాల్లో నీరుగార్చేలా బి.యస్.పి. నెట్టబడే అవకాశం వుంది. అధికార పరిరక్షణే ధ్యేయంగా పరిగణిస్తే బహుజనుల సాధికారత అనే చారిత్రక విషయం బి.యస్.పి. మర్చిపోయే ప్రమాదం వుంది. సర్వజనులను ఆకట్టుకోవాలనే తపనతో బహుజన ప్రజానీకానికి సామాజిక న్యాయం కల్పించే విషయంలో రాజీపడే ప్రమాదం వుంది. బహుజనేతరులకు (అగ్రకులాలకు) అలాంటి స్వేచ్ఛ కల్పించటం అంటే సామాజికోద్యమాల నైతిక మార్గదర్శకాలు ధ్వంసం చేయబడవచ్చు. సర్వజన్ అనే ముసుగులో అగ్రకులాలు క్రమంగా మనువాదులు తమ ఆధిపత్యాన్ని సంఘటిత పర్చుకునే అవకాశాలను కల్పించే ప్రమాదం వుంది. శ్రమజీవుల సంఘటనగా సమాజంలోని అణగారిన శెక్షన్లన్నింటి ఐక్యం చేసుకోవాల్సిన అవసరం వుంది. అవసరమయితే అధికారం వదులుకోవటానికైనా సిద్ధపడాలి తప్ప దళిత బహుజనుల ప్రయోజనాలకు నష్టం కల్గించే విషయాలపై రాజీపడకూడదు, అలా గాకపోతే పశ్చిమ బెంగాల్‌లో ప్రకటిత సిద్ధాంతానికి తూట్లు పొడిచి సి.పి.ఎం. నాయకత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ నాయకులు వుద్యమించిన పేద రైతులు, గిరిజనులపై నక్సల్‌బరీ, సింగూరు, నందిగ్రామ్‌లలో అనుసరించిన ద్రోహపూరిత వైఖరి చందమే అవుతుంది.

ఈ రెండు సామాజిక వుద్యమాలు సామాజిక మార్పుకై రెండు భిన్న ప్రత్యామ్నాయాలు ముందుకు తెచ్చాయి. పరస్పరం యితరుల వ్యూహాలను గౌరవించవు; పరస్పరం విమర్శించుకుంటాయి. శతృపూరితంగా వుంటాయి; ఒకవైపు మహారాష్ట్రలోని బుద్ధిస్టు వుద్యమం మహర్లపై తన సైద్ధాంతిక, మానసిక ప్రభావాన్ని గరుపుతుంది. కాని బౌద్ధేతర శెక్షన్ల విశాల దళిత ప్రజానీకానికి ఎలాంటి రాజకీయ ప్రత్యామ్నాయం చూపదు, అణగారిన శెక్షన్ల ప్రయోజనాలను నెరవేర్చటంలో విఫలమవుతున్నది; మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో బహుళ కుల, బహుళ మత, రాజకీయ కూటమికి దళిత నాయకత్వం సమర్పించటంలో విజయవంతమయ్యింది; దళితుల సాధికారత పెంపు సాధించటంలో విఫలమయ్యింది. ఉత్తరప్రదేశ్ దళితుల్లోని అత్యధిక మెజారిటీ దళితులు అంటరానితనం, పేదరికం, నిరక్షరాస్యతకు గురవుతున్నారు. సింబాలిక్ దళిత రాజకీయ నాయకత్వం ఈ రుగ్మతలపై పోరాడటంలో పరిమితులను ఎదుర్కొంటున్నది. రెండు కూడా అంబేద్కర్ రాజకీయ, సాంఘిక రచనలనే తమ వాదనలు సరైనవని చూపుకోవటానికి వుటంకిస్తాయి.

బి.యస్.పి.కి కత్తిమీద సాము:

బి.యస్.పి. తన సత్తా నిరూపించుకునేందుకు దళితుల సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, హోదా మార్చేందుకు చేసేదే నిజమైన పోరాటం. అధికారం చేజిక్కించుకోవటానికి ఎత్తుగడగా యితర కులాల శెక్షన్లతో కూటములు నిర్వహిస్తున్నది. అధికారంలోనికి వచ్చిన మీదట ఏదో ఒక కుల గ్రూపు అధికారం క్రింద వుండదు, బేరమాడే శక్తితో అనేక అదనపు అధికారాల బ్లాకుల పర్యవేక్షణ క్రింద వుండాల్సి వుంది. ఈ రాజకీయ పరిస్థితిలో కర్తవ్య నిర్వహణ మాయావతి గారికి కత్తిమీద సాము వంటిదే. తన ఆశయాలలో దేనికైనా అనుమతి సాధించినా అంటరాని తనంతో సహా తిరోగామి, మితవాద, ఛాందసవాద ఆచరణగల వారి సాహచర్యంతో వాటిని అమలు జరపటం క్లిష్టంగానే వుంటుంది. ఒ.బి.సి.లకు 27 శాతం రిజర్వేషన్ల సమస్యపై యిటీవల అగ్రకులాలు అరుపులు, కేకలు చూశాం. అందుకే దళితుల, పేదల అభివృద్ధి కోసం అధికారాన్ని వుపయోగించాలి తప్ప అధికారం కోసం దళితుల ప్రయోజనాలకు నష్టకరంగా రాజీపడకూడదు. అలాంటి స్థితే వస్తే తమ హక్కులు కాపాడుకోవటానికి ఓట్లు యిచ్చి గెలిపించిన దళిత బహుజనులే ప్రతిఘటించక మానరు. బహుజనులు అణగారిన పేదవర్గాల వారితో కలిసి ఈ అర్థభూస్వామ్య-అర్ధవలస వ్యవస్థ మార్పు కోసం, మనువాద, పితృస్వామిక వ్యవస్థ రద్దు కోసం వుమ్మడిగా విప్లవించాలి. నూతన ప్రజాస్వామిక విప్లవంలో క్రియాశీలకంగా, నిర్మాణాత్మకంగా భాగస్వాములు కావాలి. దళిత బహుజనులు, మహిళలు, మైనార్టీలు, పేదలపై జరిగే దోపిడీ, పీడన, కుల, మత, వివక్ష, అంటరానితనం, జండర్ వివక్షలకు వ్యతిరేకంగా సమానత్వం కోసం పోరాటాలలోనికి వుద్యమించాలి. అప్పుడే ఆత్మగౌరవం, సగౌరవమైన, స్వేచ్ఛ, సమానత్వాలతో కూడిన జీవితాలను సాధించుకోగలం. అంబేద్కర్, పూలే, పెరియార్ వంటి అనేక మంది దళిత నేతలు పడిన ఆరాటానికి న్యాయం చేకూరుతుంది.

వ్యవసాయానికి ఉరి తాళ్ళు - ఎన్నికల తాయిలాలు

కె సురేష్

భారత పాలకవర్గాలకు మరల తిరిగి ప్రజల ఓట్లు అవసరమయ్యాయి. ఏలుబడిలో వున్న కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్షంలో వున్న బీజేపీ, తెలుగుదేశం పార్టీలు ప్రజలపై 'ఎనలేని ప్రేమని' కురిపిస్తున్నారు. తాము అధికారంలో (ఎన్‌డీఏ) వున్న సమయంలో (2000) వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై ఆంక్షలను ఎత్తివేసిన (బీజేపీ-టీడీపీ) పాలకపార్టీలు నేడు గిట్టుబాటు ధరలు పెంచాలనీ, వ్యవసాయరంగాన్ని ఆదుకోవాలనీ, ఆత్మహత్యల రైతు భారతావనిని ఆదుకోవాలని ఢిల్లీ నుండి గల్లి వరకు లొల్లి చేస్తున్నాయి. ఇదే క్రమంలో దేశంలో మొదట ఐ.ఎం.ఎఫ్. షరతులను, తదుపరి నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన కాంగ్రెస్ పార్టీ తాను రైతు పక్షపాతినని, అందుకే 60,000/- కోట్ల రైతు రుణాలను మాఫీ చేస్తున్నట్లుగా ప్రకటించింది. అన్ని పార్టీలు ప్రజల సంక్షేమానికే కట్టుబడినట్లు నేడు క్రొత్త రూపంలో ముందుకు వస్తున్నాయి.

గ్రామీణ వ్యవసాయ ప్రజలపై ఇంత ప్రేమను ఎందుకు కురిపిస్తున్నట్లు? తాము అధికారంలోకి రావాలంటే దేశంలోని ఓట్లలో 60%గా వున్న గ్రామీణ ప్రాంతం ఓటర్లు నేడు వారికి కావాలి. వారిని మాయ చేసో, మభ్యపెట్టో తాము ప్రజల పక్షంగా ఉన్నామని భ్రమలు కల్పించాలి. దానిలోని భాగమే నేటి ఈ కపట ప్రేమలు. ప్రతిపక్షంలోని వారు ప్రజల కొరకు 'పోరాటాలు', అధికార పక్షం వారు ప్రజల బాగు కొరకు 'ఆరాటం'గా ముందుకు వస్తున్నారు.

నిజంగా నేడు ప్రకటించిన రుణమాఫీ నిజంగా రైతుల బ్రతుకుల్లో మార్పు తీసుకు వస్తుందా? రైతులు నేడు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి బ్రతుకుల్లో కనీసం ఒడిదుడుకులు లేని సాఫీ జీవనాన్ని ప్రసాదించుతుందా? తద్వారా వ్యవసాయంపై ఆధారపడే మొత్తం ప్రజలలో 60%గా వున్న గ్రామీణ ప్రాంత ప్రజల జీవితాలు కనీసం నిలకడగానైనా సాగుతాయా అనేది పరిశీలించాల్సిన అంశం.

గత ప్రభుత్వాలు అమలు జరిపిన ప్రజా వ్యతిరేక విధానాలే నేడు రైతులు రుణగ్రస్తులుగా మారటానికి, ఆత్మహత్యలకు గురి కావటానికి కారణాలు. ఒక్కసారి ప్రణాళికా కేటాయింపులు పరిశీలించితే వీరి నిజాయితి తేటతెల్లమవుతుంది. మొదటి ప్రణాళికలో వ్యవసాయ, అనుబంధ రంగానికి 14.9% కేటాయించారు. అయిదవ ప్రణాళికలో 12.3% కేటాయించారు. నూతన ఆర్థిక విధానం దేశంలో అమలు ప్రారంభించిన నాటికి ఎనిమిదవ ప్రణాళిక నాటికి 5.2% కి తగ్గించారు. తదుపరి తొమ్మిదవ ప్రణాళికలో 4.9%, 10వ ప్రణాళికలో 5.2% మాత్రమే కేటాయించారు. భారతావనిలో నూటికి 60 మంది బ్రతికే రంగానికి ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యత ఎంత దగాకోరుగా ఉందో స్పష్టమవుతుంది. అదే విధంగా మొత్తం జాతీయ నికర ఉత్పత్తిలో గ్రామీణ ప్రాంత అభివృద్ధికి కేటాయింపులు కూడా నూతన ఆర్థిక విధానాల ప్రారంభించినప్పుడు 1990 సం॥లో 4%గా ఉండగా, అది 1995 నాటికి 2.6%గాను, 2000 నాటికల్లా 1.9% కి క్షీణించింది. ప్రొ॥ ఉత్సా పట్నాయక్ అంచనా ప్రకారం ఈ విధంగా తగ్గించిన వార్షిక వ్యయం 1993-94 స్థిర ధరల ప్రాతిపదికన 1991-2000ల మధ్య రూ. 30,000/- వేల కోట్లుగా తగ్గుతూ వచ్చిందని స్పష్టం చేశారు.

పై వివరాల్ని పరిశీలిస్తే నేడు, నిన్న ఏలిన పాలకవర్గ పార్టీలు గ్రామీణ రైతాంగ, పేద ప్రజల కేటాయింపులు సంవత్సరాల తరబడి లక్షల కోట్లు గుంజేసుకుని, నేడు రూ. 60,000/- కోట్లు రుణ మాఫీని ప్రకటించటాన్ని నిఖార్సయిన నిలువు దోపిడి కాక మరేమవుతుంది?

పాలకవర్గాల విధానాలను వరుసగా పరిశీలించితే మనకు నేటి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఈనాటి ఆత్మహత్యల స్థాయికి చేరటానికి కారణాలు స్పష్టంగా అర్థం అవుతాయి. నూతన ఆర్థిక విధానాల ప్రారంభంలో ప్రభుత్వాలు ఇది సమస్త ప్రజలకు లాభకరమని, రైతులు తమ ఉత్పత్తులను ప్రపంచంలో ఎక్కడ ధర ఉంటే అక్కడ అమ్ముకోవచ్చునన్నారు. తద్వారా అధిక ధర లభించి రైతు ఆర్థిక పరిస్థితి ఎంతో ఎదుగుతుందని ప్రచారం చేసారు. ఆ విధానాల సమర్థకులు, సామ్రాజ్యవాదం ఏజంట్లు ఇంకింత ఆకర్షణీయంగా రంగుల కలలను రైతు ముందు ఆవిష్కరించారు. 1991లో సరళీకరణ ఆర్థిక విధానాలు దేశంలో ప్రారంభించిన సంవత్సరం విదేశీ మారక ద్రవ్యం కొరత నుండి బైటపడటానికి మన రూపాయి విలువను 25% తగ్గించారు. దీనితో ప్రపంచ వ్యవసాయ మార్కెట్లలో కన్నా రూపాయి విలువ తగ్గిన భారత వ్యవసాయ ఉత్పత్తులు చౌకగా లభించటంతో ఎగుమతులు పెరిగాయి. ఈ పరిస్థితిని సానుకూలంగా ప్రచారానికి వినియోగించుకుని సరళీకరణ విధాన సమర్థకుల విపరీత ప్రచారంతో భారత రైతాంగం వ్యాపార పంటల వైపు మరలింది. ప్రత్తి పంటల సాగు మెట్ట ప్రాంతాలలో విపరీతంగా పెరిగింది.

ఈ కాలంలోనే ప్రపంచ వ్యవసాయ వ్యాపారులకు (ఉదా॥ మాన్‌సాంటో - కార్గిల్ - సిన్ జెంటా) విత్తన మార్కెట్‌లోకి అనుమతి లభించింది. ఫలితంగా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రభుత్వ విత్తన అభివృద్ధి యూనిట్స్‌ను 24 నుండి 10 యూనిట్స్‌గా 2003 నాటికే కుచించుకు పోయాయి. తద్వార విత్తన ధరలు విపరీతంగా పెరిగాయి. దాదాపు 1425% మెట్ట ప్రాంత రైతులు బోర్లు విపరీతంగా వేయించటం జరిగింది. వాటికి కరెంటు ఏర్పాటు ఖర్చులు కలిసాయి. అదే విధంగా అధిక దిగుబడి కొరకు రసాయన ఎరువుల వాడకం, పురుగు మందుల వాడకం విపరీతంగా పెరిగింది. ఈ కాలంలోనే ప్రభుత్వ విధానాల్లో మార్పొచ్చి ఎరువులపైన, పురుగు మందులపైన సబ్సీడీలను క్రమక్రమంగా ఎత్తివేయటం, తగ్గించటం జరిగింది. ఈ విధానం వలన 2000వ సంవత్సరానికి పురుగు మందులపై సబ్సీడీలను 66% తగ్గించి వేసారు. అదే విధంగా ఈ కాలంలో రసాయనిక ఎరువుల ధరలు 300% వరకు పెరిగాయి. కరెంటు ధరలు, పురుగు మందుల సబ్సీడీల తగ్గింపు, రసాయన ఎరువుల ధరల పెరుగుదల వలన ఎకరానికి కనీసం పెట్టుబడులలో రూ. 1000/- నుండి రూ. 3000/- వరకు ఉత్పత్తి ఖర్చు పెరిగింది.

ఒక ప్రక్క సబ్సీడీల కోతతో కునారిల్లుతున్న రైతాంగంపై పిడుగులాగా నాటి ఎన్.డి.ఏ. ప్రభుత్వం 1500 రకాల ఉత్పత్తులపై దిగుమతి ఆంక్షల్ని ఎత్తివేశాయి. దీనితో దేశంలోకి వ్యవసాయ ఉత్పత్తులు ఇబ్బడిముబ్బడిగా చౌకగా చేసింది. కొద్ది కొద్దిగా ప్రత్తి దిగుమతులపై దిగుమతి సుంకాన్ని తగ్గించుతూ ప్రభుత్వం ముందుకు తెచ్చింది. అది 0% నుండి 10% లోపుగా కొనసాగింది. దీనితో 1995 నుండి ప్రత్తి రేటు తగ్గుతూ వచ్చింది. అదే సందర్భంలో సబ్సీడీల ఎత్తివేతవలన రైతు పంట ఖర్చు పెరిగింది. దీనితో ప్రత్తి రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయినవి. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరోవారి డేటా ప్రకారం 1997-2001 వరకు 78,737 మంది, 2002-2005 మధ్య కాలంలో 70,507 మంది రైతులు ఆత్మహత్యలకు గురిఅయ్యారు. అంటే 1997-2005 మధ్యకాలంలో (8 సంవత్సరాలలో) లక్షా యాభై వేల మంది రైతులు చనిపోయారు. ప్రధానంగా ప్రత్తి రైతులు ఆంధ్రప్రదేశ్ - మహారాష్ట్రాలలో ఆత్మహత్యలకు గురి అయ్యారు.

అదే విధంగా ప్రపంచంలో మిరియాలను అధికంగా ఉత్పత్తి చేసే ప్రాంతాలలో కేరళ ఒకటి. కాని దిగుమతులపై ఆంక్షలు ఎత్తివేసిన పిదప సార్క్ దేశాల నుండి (వియత్నాం నుండి) దిగుమతులు విపరీతంగా పెరిగాయి. (దిగుమతి సుంకం 0%). అప్పటి వరకు క్వింటాలు మిరియాలు రూ. 27,000/- ఉండగా 2001-2002 నాటికి క్వింటాలు మిరియాల ధర క్వింటాలుకు రూ. 7000/-గా పడిపోయింది. అదే విధంగా కాఫీ గింజల ధరలు క్వింటాలు రూ. 11,000/- నుండి రూ. 2,800/-కి, తేయాకు క్విం॥ రూ. 1800/- నుండి రూ. 400కి పడిపోయింది. కాని కాఫీ, టీపొడిని ఉత్పత్తి చేసే బహుళజాతి కంపెనీల ఉత్పత్తులు ఏ మాత్రం తగ్గలేదనేది గమనించాలి. ఈ పరిణామాల వలన కేరళలో మిరియాల రైతులు అప్పులు పాలయ్యారు. కేరళ రైతుల ఆత్మహత్యలు చేసుకున్న రైతులలో దాదాపు 50% రైతులు మిరియాలు పండించే వారే ఉండటాన్ని బట్టి నూతన ఆర్థిక విధానాల ఫలితాల దుష్ప్రభావం మనకు స్పష్టంగా కనబడుతుంది.

ప్రధానంగా ఈ 18 సంవత్సరాల కాలంలో దేశాన్ని, రాష్ట్రాలని ఏలిన పాలకవర్గ పార్టీలలో భారతదేశంలో ఏ ఒక్కటి కూడా రైతు పక్షాన నిలబడలేదు. కాంగ్రెసు, బీజేపీ, తెలుగుదేశం మొదలుకుని 'కమ్యూనిస్టులు' వరకు, సరళీకృత విధానాలను అత్యంత క్రమశిక్షణగా అమలు చేసిన వారే. అప్పుడప్పుడు ప్రతిపక్ష పాత్ర నిర్వహించే సందర్భాలలో తప్ప ఈ విధానాలను పోటీ పడి అమలు జరిపినవారే. 18 సం॥ల నుండి గ్రామీణ రైతాంగం మరియు పేదవారి ప్రాణాలను సామ్రాజ్యవాదులకు, గుత్త పెట్టుబడిదారులకు ఆహారంగా అర్పించే విధానాల అమలుదారులంతా ఒక్కసారిగా మానవీయ ముసుగు తగిలించుకుని ఒకరు రుణాలు మాఫీ చేసానంటుంటే, మరోకరు మేము మీ కోసమే పోరాడుతామని నమ్మబలకటానికి సిద్ధమవుతున్నారు.

నూతన ఆర్థిక విధానాల్ని అమలు చేస్తూ గ్రామీణ ప్రజల మెడలకు ఉరితాళ్ళు బిగించి కాళ్ళు పట్టుకు లాగే ఈ పైశాచిక రాజకీయ పిశాచాలు అంతంగాకుండా, బిగిసిన ఉరితాళ్ళుగా ఉన్న విధానాలు మారకుండా ఉపశమనాలు రైతు ఆత్మహత్యల దైన్యస్థితిని ఏమాత్రము మార్చలేవు. గ్రామీణ భారతంలో నివశించే 60% ప్రజల బ్రతుకులలో అభివృద్ధి ఫలితాలు రానంత వరకు భారత అభివృద్ధి గురించి ఎంతగా చెప్పినా అది అందమైన అబద్ధమే. ఎన్నికల రాబంధులు మరల గ్రామీణ ప్రాంత ప్రజల ఓట్ల కొరకు వేటగాడు ఎరలు వేసి కాటు వేయడానికే చేసే విన్యాసాల్లాంటివే ఈ రుణరద్దులు, రాయితీలు.

గోదావరిఖనిలో కామ్రేడ్ యు. రాములు వర్ధంతి సభ

సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) కరీంనగర్ జిల్లా నాయకుడు, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడైన కామ్రేడ్ యు. రాములు 4వ వర్ధంతి సభ గోదావరిఖనిలో మార్చి 16న జరిగింది. ముందుగా గోదావరిఖనిలో కా॥ యు.ఆర్. స్మారక స్థూపం వద్ద సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) ఇఫ్టూ డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కా॥ ఎస్.కె. ముఖ్తార్ పాషా జెండావిష్కరణచేయగా, రెండు నిముషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ వర్ధంతి సభకు సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి కా॥ కె. రాజన్న అధ్యక్షత వహించగా కా॥ ఎస్.కె. ముఖ్తార్ పాషా మాట్లాడుతూ కా॥ యు.ఆర్.ను విప్లవ ద్రోహులు భౌతికంగా లేకుండా చేసినా ఆయన ఆశయ సాధనలో అనేక పోరాటాలను ఇఫ్టూ నిర్వహించిందన్నారు. పార్టీని దెబ్బతీసేందుకు స్వార్థపరశక్తులు, విప్లవ వ్యతిరేకశక్తులు అనేక కుట్రల చేసినప్పటికీ కా॥ యు.ఆర్. విప్లవ శ్రేణులను పార్టీ వెనుక సమీకృతం చేశాడన్నారు. ఆయన ఆశయ సాధనలో విప్లవోద్యమంలో ముందుకు సాగడమే కా॥ యు.ఆర్.కు నిజమైన నివాళి కాగలదన్నారు.

ఇంకా ఈ వర్ధంతి సభలో జి.ఎల్.బి.కె.ఎస్. (ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్షులు కా॥ టి. శ్రీనివాస్, రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు కా॥ ఐ. క్రిష్ణ, కె. విశ్వనాథ్, కా॥ యుఆర్ సతీమణి కా॥ హేమలతలతోపాటు 300 మంది కార్మికులు పాల్గొన్నారు. అరుణోదయ కళాకారులు అమరవీరులపై పాటలు పాడారు.

చదవండి! చందాదారులు కండి!

ప్రజాపంథా

చందాల రేట్లు

సం॥రం చందా - రూ. 150.00

అర్థ సం॥రం చందా - రూ. 75.00

విడి ప్రతి వెల - రూ. 8.00

ధరల ముట్టడిలో ప్రజలు

పోయిన నెలకీ, ఈ నెలకీ మూడొందల రూపాయలు తేడా వచ్చింది. ఇంట్లో సరుకులకే ఇంత పెరిగితే ఎలా బ్రతకాలి! సణుక్కుంటూ సరుకుల సంచితో వెడుతోందో ఇల్లాలు. పచ్చి పులుసుక్కూడా పది రూపాయలైతే ఎలా! నిన్నకొన్న రేటు ఇవాళ లేదాయే. రేట్లు మండిస్తున్నారు. తిట్టుకొంటూ దుకాణం నుండి బైటికొస్తోందో కార్మిక మహిళ.

చూశారా పిన్నిగారూ! పాతిక రూపాయలు పెడితే వారం రోజులకు సరిపడా కూరగాయలు వచ్చేవి. మరి ఇప్పుడో... ఒక్క రోజుకే పాతిక రూపాయలవుతోంది. అంటూ వాపోయిందో మధ్యతరగతి మహిళ.

చిక్కటి పాలని చెప్పి ఇరవై రూపాయలు తీసుకొంటున్నారు. కానీ అవే నీళ్ళపాలు పోస్తున్నావు. ఇలాగైతే ఎలా చెప్పు? అంటూ గొడవపడుతోంది ఓ సాధారణ గృహిణి.

పెరిగిన ఇనుము, సిమెంటు ధరలు చూసి సొంతిల్లు కట్టుకోవాలనే తన ఆశ తీరదనే నిరాశతో దిగాలుపడ్డ ఓ బడుగు జీవి.

అదేమిటంటే! ఒక్క ఏడాదే మూడు వేలు పెంచమంటే ఎలా? ఒకేసారి ఐదు వేల నుండి ఎనిమిది వేలు చేస్తారా? మా కొచ్చే జీతంలో సగం ఇంటి అద్దెకే పోతే మేమెలా బ్రతికేది? అంటూ ఇంటి ఓనరుతో వాదిస్తోంది ఓ పట్టణ మహిళ.

అవును మరి. ఇది ఏ ఒక్కరి సమస్యో కాదు. ప్రతి ఒక్కరినీ వేధిస్తున్న, వెంటాడుతున్న సమస్య. మరీ ముఖ్యంగా రెక్కాడితేగానీ డొక్కాడని పేద ప్రజలను మరింత కృంగదీస్తున్న సమస్య. అదే అధిక ధరల సమస్య.

చుట్టుముడుతున్న అధిక ధరలు

ఓ కవి రాసినట్లుగా మసూరి ధర వింటే మంటెత్తి పోతోంది. మంచి నూనె ధర నింగిని తాకింది. ఎంతపండు రేటు - చింత లెక్కికూచుంది. కోడి ధర వింటేనే నాటు దిగిపోయింది. మషాలా ధర వింటే నాషాల మంటింది. ఇలా ఒక్కటేమిటి? అన్ని సరుకుల ధరలూ ధరణిని వీడి ఆకాశాన విహరిస్తున్నాయి. మన పాలకులు ఆకాశానికేగిసిన ధరలకు కళ్ళెం వేసి కిందికిదించే మార్గాల గురించి ఆలోచించకుండా కబుర్లతో కాలం వెళ్ళబుచ్చుతున్నారు. అసెంబ్లీలో ప్రజల సమస్యల కంటే ఒకరిపై ఒకరు ఆరోపణలూ, ప్రత్యారోపణలతోనే విలువైన సమయం వృధా అవుతోంది.

ఈ సంవత్సరం నిత్య జీవితావసర సరుకుల ధరలు మున్నెన్నడూ లేనంతగా పెరిగాయి. 2004 సంవత్సరంతో పోలిస్తే రెండు నుండి మూడు రేట్లు ధరలు పెరిగాయి. ఆహార ధాన్యాల ధరలు 75 శాతం, పప్పు ధాన్యాల ధరలు 100 శాతం, నూనెల ధరలు 250 శాతం పైన పెరిగాయి. గత ఏడాదితో పోల్చినా కూడా అన్నింటి ధరలు విపరీతంగా పెరిగాయి. 2004 సంవత్సరంలో కందిపప్పు ధర 21 రూపాయలుండగా నేడది 40 రూపాయలకు చేరుకొంది. పెసరపప్పు ధర 21 రూపాయల నుండి 40 రూపాయలకూ, శనగపప్పు ధర 20 నుండి 38 రూపాయలకూ, మినపప్పు ధర 24 నుండి 45 రూపాయలకూ, చింతపండు ధర 20 నుండి 40 రూపాయలకూ, ఎండుమిర్చి ధర 25 నుండి 70 రూపాయలకూ, నూనెల ధరలు 38 రూపాయల నుండి 70-80 రూపాయలకూ పెరిగింది. ఇక ఇనుమూ, సిమెంటు ధరలు కనీవినీ ఎరుగని రీతిలో పెరిగాయి. గ్యాస్ ధర పెరిగింది. పాల ధర పెరిగింది. పండ్ల ధర పెరిగింది. కూరగాయల ధరలు పెరిగాయి. పిల్లల స్కూలు ఫీజులు పెరిగాయి. అదనంగా స్కూటర్ ఆయిల్ ఖర్చూ, సెల్‌ఫోన్ల ఖర్చూ, కేబుల్ కనెక్షన్లూ, ఇలా ఒకటేమిటి, అన్నింటి ఖర్చూ కలిసి మధ్యతరగతి వర్గాలకు కూడా మోయలేని భారంగా తయారైంది.

ఇలా అంతూపంతూ లేకుండా పెరిగిన ధరల మూలంగా నిరుపేదలు తమ ఆదాయంలో డెబ్బై శాతాన్ని వెచ్చిస్తేనేగానీ బతుకీడ్చగలిగే పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా తలసరి ఆహార వినియోగం కూడా పడిపోయింది. 1991లో 500 గ్రాములున్న తలసరి ఆహార వినియోగం, 2005 నాటికి 422 గ్రాములకు పడిపోయింది. అంటే పెరిగిన ధరల మూలంగా ఆహార వినియోగం 78 గ్రాములు తగ్గింది. ఇది సగటున వేసిన లెక్కలు. పేదల విషయానికి వస్తే తలసరి ఆహార వినియోగం ఇంకా తక్కువ వుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా తమ ఆదాయం పెరగక పోవడంతో అనివార్యంగా ఆహారంపై పెట్టే ఖర్చును తగ్గించుకొంటున్నారు. ఫలితంగా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అప్పులపాలవుతున్నారు.

భారత రాజ్యాంగంలోని 43వ అధికరణ ప్రకారం ప్రతి ఉద్యోగికీ, కార్మికునికీ తన కుటుంబ జీవనాన్ని సాగించడానికి సరిపడే వేతనాన్ని (లివింగ్ వేజ్) ప్రభుత్వాలు విధిగా కల్పించాలని ఆదేశిస్తోంది. ఈ ఆదేశిక సూత్రాన్ని దృష్టిలో ఉంచుకొని 15వ అఖిల భారత కార్మిక సదస్సు నిపుణులను సంప్రదించి ఆహారం, ఇంటి అద్దె, కుటుంబానికి కావలసిన దుస్తులు, వైద్యం తదితర ఖర్చులను లెక్కకట్టి కనీస వేతనాన్ని నిర్ణయించే కొలబద్దను సూచించింది. ప్రస్తుతం వున్న ధరల ప్రకారం లెక్కగడితే కనీస వేతనం 10 వేల రూపాయలుగా వుండాలని కూడా సూచించింది. అంతేకాదు. ఇది కేవలం కుటుంబం బ్రతకడానికి మాత్రమేనని కూడా స్పష్టం చేసింది. కానీ భారత రాజ్యాంగంలోని 43వ అధికరణానికి భిన్నంగా మన ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే దానిని కాలరాస్తున్నాయని చెప్పాలి.

ధరల పెరుగుదలకు పెట్రోలు ధరల పెంపే కారణమా?

నిత్య జీవితావసర వస్తువుల ధరల పెరుగుదలకు అంతర్జాతీయ విపణిలో చమురు ధరలు పెరగడమే కారణమని ప్రభుత్వం చెపుతోంది. ఇది కొంత వరకు కారణమని చెప్పవచ్చు కానీ ఇదే కారణమని చెప్పడం అంటే తన బాధ్యత నుండి తప్పుకోవడమే. కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ళలో ఏకంగా తొమ్మిదిసార్లు డీజిల్ ధరలు పెంరిగాయి. 2004లో లీటర్ డీజిల్ 23.52 రూపాయలు వుండగా, ఇప్పడది 34.53 రూపాయలకు పెరిగింది. అంటే గడిచిన నాలుగేళ్ళలో పదకొండు రూపాయలకు పైగా పెరిగిందన్నమాట. దీని ప్రకారం చూస్తే రవాణా ఛార్జీలు కిలో మీటరుకు 16 పైసల నుండి 20 పైసల వరకు పెరగాలి. కానీ ఆ పేరుతో వ్యాపారులు పెంచింది మాత్రం 6-7 రూపాయలు. వాణిజ్యవర్గాలు చేస్తున్న అక్రమాన్ని, అన్యాయాన్ని మాత్రం పాలకవర్గాలు అరికట్టవు.

కె రమ

పెట్రోలియం ధరల పెరుగుదల మూలంగా సరుకుల రవాణా వ్యయం పెరుగుతుంది. ఫలితంగా ఆహార ధాన్యాల ధరలు కూడా కొంత మేరకు పెరుగుతాయి. అయితే ఈ విషయంలో మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతివాటం కూడా చాలా వుంది. వాణిజ్య వర్గాలు పెట్రోలు ధరల పెంపు పేరుతో సరుకుల ధరలు పెంచుతూ రెండు చేతులా దండుకొంటుంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల రూపంలో పిండుకొంటున్నాయి. పెట్రోలియం ఉత్పత్తులపై విధిస్తున్న ఎక్సైజ్, కస్టమ్స్ పన్నులు భారీగా వుంటున్నాయి. 2004 నుండి పెట్రో ఉత్పత్తులపై కేంద్ర రాబడి డెబ్బై వేల కోట్ల రూపాయల నుండి ఏకంగా లక్షా డెబ్బై వేల కోట్లకు ఎగబాకింది. అంటే యూపీఏ సర్కారు హయాంలో పెట్రో ఉత్పత్తులపై ఆదాయం లక్ష కోట్లు పెరిగిందన్న మాట. పెరిగిన ఈ భారం ఎవరి మీద పడుతుంది? ప్రజలపైనే కదా!

డీజిల్ ధర ప్రతి సంవత్సరం పెరుగుతుండటంతో సహజంగానే లారీల బాడుగ ధర పెరుగుతుంది. 2004లో విజయవాడ నుండి హైదరాబాద్‌కు సరుకు తరలించాలంటే ఐదు వేల రూపాయల కిరాయి వుండేది. కానీ డీజిల్‌తోపాటు, టైర్లూ, కందెన ధరలు కూడా విపరీతంగా పెరగడంతో లారీల బాడుగ కూడా అదే స్థాయిలో పెరిగింది. ప్రస్తుతం 5000 రూపాయల నుండి 6600 రూపాయలకు పెరిగింది. అంటే గడిచిన నాలుగేళ్ళలో 1600 రూపాయలు పెరిగిందన్న మాట. ఈ 1600 రూపాయల రవాణా వ్యయం న్యాయంగా సరుకు ధరకు చేరాల్సిందే. కానీ వాణిజ్య వర్గాలు దానికే పరిమితం కావడం లేదనేది నిర్వివాదాంశం.

తలాపాపం తిలా పిడికెడు అన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం పెట్రోలుపై 33 శాతం, డీజిల్‌పై 22.55 శాతం చొప్పున పన్నులను విధిస్తోంది. ఫిబ్రవరిలో పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగినప్పుడు, పెరిగిన ధరలపై పన్నుల రూపేణా ఏడాదికి 120 కోట్ల రూపాయల అదనపు ఆదాయం ప్రభుత్వానికి రానున్నట్లు తేలింది. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే పెట్రోలు పన్ను మన రాష్ట్రంలోనే ఎక్కువ. డీజిల్ పన్ను రేటులో మరో మూడు రాష్ట్రాలు మాత్రమే మనకంటే ముందున్నాయి. వ్యాట్ రాక ముందు డీజిల్‌పై 19.33 శాతం మాత్రమే పన్ను వుండేది. అదిప్పుడు 22.25 శాతానికి చేరుకొంది. పంజాబ్‌లో డీజిల్‌పై 8.8 శాతం, మధ్యప్రదేశ్‌లో 8.34 శాతం, ఢిల్లీలో 12.5 శాతం మాత్రమే పన్ను వుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసే పన్నులూ, వాణిజ్యవర్గాలు రవాణా వ్యయం పేరుతో వసూలు చేసే భారమూ ఎవరి మీద పడుతోంది? సామాన్యులపై కాదా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోలు, డీజిల్‌పై విధించే పన్నులను తగ్గిస్తే ఆ మేరకు ధరల పెంపును తగ్గించవచ్చు. అంతేగాకుండా పెరిగిన డీజిల్ ధరల కనుగుణంగా గాకుండా అదుపులేకుండా పెంచుతున్న సరుకుల ధరలను నియంత్రించే బాధ్యత కూడా ప్రభుత్వానిదే. 7.4% దాటిన ద్రవ్యోల్బణాన్ని తగ్గించే వైపు అన్ని రకాల చర్యలు చేపట్టాలి.

ఆహార అభద్రత

మన దేశంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా ఆహార ఉత్పత్తుల రేటు గణనీయంగా పడిపోయింది. భారతీయ జనాభాలో మూడింట రెండొంతుల మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. గడిచిన నాలుగు దశాబ్దాల కాలంలో వ్యవసాయ కమతాలు కుంచించుకు పోయాయి. తగిన ప్రోత్సాహం కానీ, రాబడి కానీ లేక పోవడం మూలంగా భారతీయ రైతులలో 40 శాతం మంది వ్యవసాయాన్ని విడిచిపెట్టాలని భావిస్తున్నారు. అందుకే 1950-51లో వ్యవసాయరంగం వాటా స్థూల జాతీయోత్పత్తిలో (జీడీపీ) 56 శాతం కాగా 2006-07వ సంవత్సరంలో అది 18 శాతానికి పడిపోయింది.

అయినా ప్రభుత్వం వ్యవసాయ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. రైతులకు సరైన ప్రోత్సాహకాలు లేవు. మొత్తం రైతుల్లో చిన్న, సన్నకారు రైతులు 84% వున్నారు. వీరిలో 74 శాతం మంది ప్రైవేట్ అప్పులపైనే ఆధారపడుతున్నారు. ఆరుగాలం కష్టపడినా గిట్టుబాటు ధర లభించక పోవడంతో, చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అందుకే ప్రతి అరగంటకు ఒక రైతు ప్రాణాలు తీసుకొంటున్నాడు. 2006లో 7006 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నారని గణాంకాలు చేపుతున్నాయి. మన భూములను ఆహారధాన్యాల ఉత్పాదన వైపు మళ్ళిస్తే కోట్లాది మంది వ్యవసాయ కార్మికులకు ఉపాధి లభిస్తుంది. ఆహారధాన్యాల కొరత తీరుతుంది. కొనుగోలు శక్తి పెరుగుతుంది. అధిక ధరలు కొంత వరకైనా తగ్గుతాయి. ప్రభుత్వం ఈ చర్యలకు పూనుకోదు. అందుకే రైతుల మరణానికి ప్రభుత్వమే కారణమని వేరే చెప్పాల్సిన పనిలేదు.

ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాలలో భాగంగా మన వ్యవసాయాన్ని వాణిజ్య పంటల వైపుకు, ఎగుమతి ఆధారిత వ్యవసాయోత్పత్తుల వైపుకు మళ్ళిస్తున్నది. పూలూ, పళ్ళూ, కూరగాయలూ, జామాయిలూ, సుబాబులూ, చేపల చెరువులూ, పత్తి, మిర్చి తదితర పంటలవైపు మన భూములను మళ్లిస్తున్నారు. ఫలితంగా ఈ రోజు తీవ్రమైన ఆహార పదార్థాల కొరతను ఎదుర్కొంటున్నాం. పాలకవర్గాల పుణ్యమా అని ఎగుమతి చేసే స్థితిలో వుండాల్సిన మనం, నేడు ఆహార పదార్థాలను దిగుమతి చేసుకోవాల్సిన స్థితికి నెట్టబడ్డాం. అయిన వారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో పెట్టినట్లుగా మన రైతులు పండించిన గోధుమలకు క్వింటాకు 800 రూపాయలు చెల్లించిన ప్రభుత్వం అంతకంటే నాసిరకం గోధుమలను ఆస్ట్రేలియా నుండి 1600 రూపాయలకు ఎగబడి దిగుమతి చేసుకొంది. 2006లో 55 లక్షల టన్నులూ, 2007లో 23 లక్షల టన్నుల గోధుమలను దిగుమతి చేసుకొన్నది. దీనిపై పరిశోధన జరిపిన కేంద్ర విజిలెన్స్ కమీషన్, ఆ గోధుమలు ఎంత మాత్రం నాణ్యమైనవి కావని తేల్చింది.

ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధరలు నిర్ణయించక పోవడం మూలంగా వ్యాపారవర్గాలు ఏకమై రైతుల ఇంటికి పంటలు చేరగానే అతి తక్కువ ధరకు కొని నిల్వ చేస్తున్నాయి. గతంలో ఇలా చేయడం శిక్షార్హం. కానీ ఫ్యూచర్ ట్రేడింగ్‌కు గ్రీన్ సిగ్నల్ యివ్వడం మూలంగా నిత్య జీవితావసర సరుకులను కూడా యథేచ్ఛగా స్టాకు చేసుకొని, తాత్కాలిక కొరతను సృష్టించి ఎక్కువ ధరకు అమ్ముకొంటున్నారు. ఇటీవల పార్లమెంటరీ స్థాయి సంఘం 25 రకాల నిత్య జీవితావసర సరుకులైన వ్యవసాయ ఉత్పత్తులను ఫ్యూచర్ ట్రేడింగ్ నుండి మినహాయించాలని సూచించింది. ఇలా చేయడం వలన బ్లాక్ మార్కెట్‌ను నివారించవచ్చు. ధరల పెరుగుదలకు కొంత వరకైనా కళ్ళెం వేయవచ్చు.

ప్రపంచ వ్యాపితంగా అధిక ధరలు, ఆహారధాన్యాల కొరత తీవ్రంగానే వుంది. దీనికి ప్రధాన కారణం ఆయా దేశాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల అమలు ఫలితమే తప్ప మరోకటి కాదు. మన ప్రభుత్వం మన దేశంలో ధరల పెరుగుదలకు అంతర్జాతీయ పరిస్థితులే కారణమని చెపుతోంది.

తునికాకు కూలిరేట్ల పెంపుదలకై ఏప్రిల్ 15 నుండి 20 వరకు ఆందోళన జరపండి!

ఏఐకెయంయస్ రాష్ట్ర కార్యవర్గం పిలుపు

అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం 2008 ఏప్రిల్ 7, 8 తేదీలలో హైదరాబాద్‌లోని (విద్యానగర్) మార్క్స్ భవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ పి. టాన్యా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గత 3 నెలలుగా సంఘం చేపట్టిన కార్యక్రమాలను, తక్షణ ప్రజా సమస్యలను చర్చించి ఈ క్రింది తీర్మానాలు చేయడం జరిగింది. దీనికి ముందు ఇటీవల మరణించిన ప్రగతిశీల మేధావి కామ్రేడ్ రాజేంద్ర సరంగి (ఒరిస్సా)కి సమావేశం సంతాపం తెలిపింది. వారి కుటుంబానికి సానుభూతిని తెలిపి 2 ని॥ మౌనం పాటించింది.

1. తునికాకు సమస్యపై: తునికాకు సమస్య (బీడీ ఆకు) రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతమంతటా ముఖ్యంగా తెలంగాణా జిల్లాల్లోని అటవి ప్రాంతంలో వున్నది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ చివరి వారం నుండే మే చివరి వరకు తునికాకు కాంట్రాక్టర్లు తునికాకు కల్లాలను ఏర్పాటు చేసి గిరిజనులు ఇతర పేదల చేత ఆకు సేకరించుకుంటారు. ఇందుకోసం ఏ పని దొరకని వేసవి కాలంలో పేదలంతా, ముఖ్యంగా గిరిజనులు తెల్లవారుజామునే అడవుల్లోకి వెళ్ళి చెట్టూ పుట్టా తిరిగి ఎండ, కొండ అనుకోకుండా ఆకు సేకరిస్తారు. ఈ పని చేయటమే కాకుండా తెచ్చిన ఆకును ఇంటిల్లిపాది కట్టలు కట్టి ఆకుల కల్లానికి తరలిస్తారు. ఇందుకోసం గంటల తరబడి శ్రమ చేయవలసి వస్తున్నది. ఆకు సేకరించే సమయంలో ఎండ దెబ్బకు, పాముకాటుకు, ఇతర క్రూర జంతువుల బారినపడి మరణించేవారి సంఖ్య పెరుగుతున్నది. ఇన్ని కష్టాలకోర్చి సేకరించే ఆకులకు ఈ సంవత్సరం (2008) ప్రభుత్వం ధర నిర్ణయించి ప్రకటించక పోవడం దారుణమైన విషయం. గతంలో ప్రకటించిన రేటు కూడా పెరుగుతున్న ధరల కనుగుణంగా శ్రమకు తగ్గట్టుగా లేదు. కేవలం 50 ఆకుల కట్టకు, 60, 61 పైసలు మాత్రమే ప్రకటించి చేతులు దులుపుకుంది. ప్రతి రోజు గిరిజనుల కోసం, ఇతర పేదల సంక్షేమం కోసం మాట్లాడే రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెసు ప్రభుత్వం ఈ విధంగా అనుసరించడం సరైంది కాదు. ఈ విధానాన్ని అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) నిరసిస్తున్నది. అందుకని 2008 సంవత్సరంలో 50 ఆకుల కట్టకు రూ. 1.50పై ప్రకటించాలనీ, ఇతర పనులకు గతం కంటే అదనంగా కూలీరేట్లు పెంచాలనీ, 2007 బోనసు వెంటనే చెల్లించాలని, ఆకు సేకరించే సమయంలో మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా 2 లక్షలు చెల్లించాలనీ, కల్లెదారుల కమీషన్ గతంకంటే అదనంగా 25% పెంచాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 15 నుండి 20 వరకు మండల కేంద్రాలలో ప్రదర్శనలు, ధర్నాలు, గ్రామాల్లో సభలు, సమావేశాలు, రాష్ట్ర వ్యాప్తంగా జరిపి సమ్మెకు సిద్ధం కావాలని అఖిల భారత రైతు-కూలీ సంఘం తునికాకు సేకరణ కూలీలకు పిలుపునిస్తున్నది.

2. అకాల వర్ష బాధలో రైతాంగాన్ని ఆదుకోవాలి! ప్రిల్ మొదటి వారం నుండి కురుస్తున్న అకాల వర్షాలకు రాష్ట్రంలో దెబ్బతిన్న రైతులందరి పంటలన్నిటిని ప్రభుత్వం తన సంస్థల ద్వారా సహేతుకమైన ధరలు నిర్ణయించి కొనుగోలు చేయాలనీ, పంట నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలనీ, నష్టపోయిన వారి రుణాలన్నీ మాఫీ చేసి కొత్తగా అవసరమైన రుణాలు, విత్తనాలు, ఇతర వ్యవసాయ పనిముట్లు 50% సబ్సిడితో రైతాంగానికి ప్రభుత్వం అందజేయాలి.

3. రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువులు పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలి. 4. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో బాక్సైట్ వెలికితీత పేరిట్మ ప్రకాశం, చిత్తూరు, మహబూబ్‌నగర్ అటవీ ప్రాంతాల్లో టైగర్ పార్క్ పేరిట్మ పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి అటవీ ప్రాంతాలలో అడవుల పెంపకం పేరుతో అన్ రిజర్వు ప్రాంతాన్ని, రిజర్వ్‌డ్ ప్రాంతంగా మార్చడాన్మీ గిరిజనులను పోడు భూముల నుండి వెళ్ళగొట్టే ప్రయత్నాలను సంఘం తీవ్రంగా ఖండించింది. ఇలాంటి ప్రయత్నాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది.

5. అటవీ హక్కుల చట్టంలోని ప్రజానుకూల అంశాలను వెంటనే అమలు జరిపి, గిరిజనులు, ఇతర పేదలు సాగుచేసుకుంటున్న పోడు భూములన్నింటికి పట్టాలివ్వాలని, ఇందులో గుత్తికోయలను మినహాయించరాదని, అందరికి జీవించే హక్కు కల్పించాలని సమావేశం డిమాండ్ చేసింది.

6. వ్యవసాయ కూలీలకు జీవిత బీమా పథకం అమలు చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం 38 లక్షల మందికే వర్తింపు చేస్తున్నట్లుగా ప్రకటించింది. అలా కాకుండా సెంటు, గుంట భూమి కల్గిన, పేద రైతు కూలీలందరికి (1.5 కోట్లు) వర్తింప చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. 7. ఉపాధి హామీ పథకంలో జరిగే అవకతవకలపై సామాజిక తనిఖీ కోసం రైతు-కూలీ సంఘాలను భాగస్వాములను చేయాలని, చట్టాన్ని సక్రమంగా అమలు జరపాలని సమావేశం డిమాండ్ చేసింది.

8. రుణ మాఫీ పథకాన్ని మెట్ట ప్రాంతాల్లోని 5 ఎకరాలు మించిన రైతాంగానికి వర్తింప చేయాలనీ, 2008 మార్చి వరకు అప్పులు చెల్లించిన రైతాంగానికి వర్తింప చేయాలనీ, ఈ పథకాన్ని రైతులందరికీ వర్తింపచేయాలనీ, పంటల బీమా అన్ని పంటలకు వర్తింప చేయాలని డిమాండ్ చేస్తున్నది.

9. చెరుకు టన్నుకు 7500, పసుపు కి. 4 వేలు, జీడి కేజికి 60 రూ॥లు రేటు నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

పోలవరం ముంపు ప్రాంతంలో అటవీ భూముల సాగుకోసం ఉద్యమిస్తున్న గిరిజనులు, పేద ప్రజలు

రాష్ట్ర ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా ఖమ్మం జిల్లాలో ఇందిరాసాగర్ (పోలవరం) ప్రాజెక్టు నిర్మించాలని పనులు ప్రారంభించింది. దీనితో జిల్లాలో 6 మండలాలలో 205 గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయి. 35 వేల కుటుంబాలు, లక్షలాది ఎకరాల భూములు జలమయం అవుతున్నాయి. లక్ష మందికి పైగా నిరాశ్రయులౌతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహార, పునరావాస ప్యాకేజిపై ప్రజలు అసంతృప్తి, నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గిరిజనేతర భూములకు ఎకరాకు 1,15,000, 1,30,00, 1,50,000 నష్టపరిహారం, గిరిజనులకు భూమికి బదులు భూమి, గిరిజనులకు 6 ఎకరాలకు మించి భూమి వుంటే నష్టపరిహారం చెల్లించే విధానం, గిరిజనేతర భూస్వాముల పాలిట వరంగానూ, గిరిజనులు, గిరిజనేతర పేదల పాలిట శాపంగాను తయారైంది. భూస్వాముల వద్ద భూములు లేకపోయినా రికార్డులలో మాత్రం భద్రంగా వున్నాయి. లంచగొండులైన అధికారులు భూస్వాములతో కుమ్మక్కై వారికి నష్టపరిహారం చెల్లిస్తున్నారు. మరొక వైపు గిరిజనులు అనాదిగా సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూములకు, పోడు భూములకు, భూస్వాముల ఆక్రమణలో వున్న భూములను, పోరాటం ద్వారా సాగుచేసుకొంటున్న భూములకు ఎలాంటి చట్టబద్ధ హక్కులు లేవు. అందువలన నష్టపరిహారం చెల్లింపులో అడుగడుగునా అన్యాయానికి గురౌతున్నారు.

ప్రభుత్వం గిరిజనులను వేరే ప్రాంతాలలో పునరావాస గ్రామాలు నిర్మించి, భూములు కొనుగోలు చేసి, నిర్వాసితులను ఆయా ప్రాంతాలకు తరలించే కార్యక్రమం ఆచరణ యోగ్యంగా లేదు. ప్రభుత్వ అధికారులు వ్యవహరించే తీరుపై ప్రజలకు విశ్వాసం కలిగించలేక పోతున్నది. కాలనీల నిర్మాణం అవినీతి అధికారుల, కాంట్రాక్టర్ల పాలిట కల్ప వృక్షంలా తయారైంది. భూస్వాముల వద్ద నుండి భూములు కొనుగోలు వ్యవహారం, భూస్వాముల మిగులు భూములు, గిరిజనుల అన్యాక్రాంత వివాదాస్పద భూములు ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్ముకొంటానికి భూస్వాములకు మేలు చేసే కార్యక్రమంగా తయారైంది. ఈ పరిస్థితులలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం యెడల భయాందోళనలు, ప్రభుత్వ పునారావసంపై అపనమ్మకంతో ఏమైనా వేరే ప్రాంతాలకు ఎక్కడికో వెళ్లడం యిష్టం లేక గిరిజనులు, గిరిజనేతర పేద ప్రజలు ముంపు ప్రాంతాల చుట్టు ప్రక్కల అటవీ, బంజరు భూములను సేద్యయోగ్యం చేసుకొని జీవించటానికి అత్యధిక ప్రజలు సిద్దమైనారు.

వేలేరుపాడు మండలం

– గుండ్లమడుగు ప్రాంతంలో అటవీ బంజరు భూమిని నరకటానికి కట్కూరు, ఎడవెల్లి, చిట్టంరెడ్డిపాడు, బిగుమామిడి, బోళ్లపల్లి, కొత్తూరు, నార్లవరం గ్రామాల నుండి 300 మంది కదిలి పోవటం ప్రారంభించారు. 50 ఎకరాలు నరికారు. 500 ఎకరాలు వుంది.

– జిన్నెలగూడం ప్రాంతంలో నరకటానికి చాగరబెల్లి, గొల్లగూడెం గ్రామాల నుండి 150 ఎకరాలు నరికారు. యింకా 200 ఎకరాలు వుంది.

– తెల్లపెల్లి ప్రాంతాలలో కొర్రాజులగూడెం నుండి 35 కుటుంబాలు 25 ఎకరాలు నరికారు. యింకా 50 ఎకరాలు వుంది.

– రామవరం ప్రాంతంలో రెడ్డిగూడెం, రామవరం గ్రామాల నుండి 81 మంది 40 ఎకరాలు నరికారు. 500 ఎకరాలు నరకాల్సి వుంది.

– మాదారం ప్రాంతంలో 85 మంది 25 ఎకరాలు నరికారు. 150 ఎకరాలు వుంది.

కుకునూరు మండలం

– లచ్చిపేట అటవీ ప్రాంతంలో వేలేరుపాడు మండలం కొయిదా, కాసారం, టేకూరు, వసంతవాడ గ్రామాల నుండి కుకునూరు మండలం, అర్వాయిపల్లి, లచ్చిగూడెం, మద్దిగట్ల, గొమ్ముగూడెం, నెమలిపేట, గుండుగూడెం, గుండంబోరు, రాయికుంట, నల్లకుంట, దాసారం తదితర 18 గ్రామాల నుండి 920 మంది కదిలి 400 ఎకరాలు నరికారు. యింకా 2000 ఎకరాలు వుంది.

– బంజరుగూడెం ప్రాంతంలో 120 మంది 45 ఎకరాలు నరికారు. యింకా 250 ఎకరాలు వుంది.

– రాజీవ్‌నగర్‌లో 40 మంది 20 ఎకరాలు నరికారు. 80 ఎకరాలు వుంది.

– కమ్మరిగూడెంలో 15 కుటుంబాలు 3 ఎకరాలు నరికారు. 50 ఎకరాలు వుంది.

– పుల్లప్పగూడెంలో 25 కుటుంబాలు 20 ఎకరాలు నరికారు. 100 ఎకరాలు వుంది.

– రామన్నగూడెంలో 60 కుటుంబాలు 35 ఎకరాలు నరికారు. 200 ఎకరాలు వుంది.

– నల్లకుంటలో 55 కుటుంబాలు 25 ఎకరాలు నరికారు. 200 ఎకరాలు వుంది.

– లంకాలపల్లిలో 50 కుటుంబాలు 10 ఎకరాలు నరికారు. 150 ఎకరాలు వుంది.

– కొర్లకుంటలో 24 కుటుంబాలు 15 ఎకరాలు నరికారు 300 ఎకరాలు వుంది.

– కిష్టారంలలో 93 కుటుంబాలు 15 ఎకరాలు నరికారు. 300 ఎకరాలు వుంది.

– కమ్మరిగూడెంలో 20 కుటుంబాలు 10 ఎకరాలు నరికారు. 100 ఎకరాలు వుంది.

– కొండపల్లిలో 50 కుటుంబాలు 200 ఎకరాలు నరికటం ప్రారంభించారు. ఇందిరాసాగర్ (పోలవరం) ముంపు ప్రాంతాలలో ప్రజలు అధికులు వేరే కొత్త ప్రాంతానికి వెళ్లటానికి సంసిద్ధంగా లేరు. తామున్న చోటనే చుట్టు ప్రక్కల పోడుభూములు సాగుచేసుకొని బతకటానికి నిశ్చయించుకొంటున్నారు. ప్రభుత్వం ప్రజలకు యిష్టమైన చోట అవసరమైతే ఫారెస్టును డీఫారెస్టుగా ప్రకటించి పోడు భూములను సాగు భూములుగా అభివృద్ధి చేసి, నీటి సౌకర్యం కల్పించి, పునరావాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలి. ప్రాజెక్టు నిర్మించటానికి ముందు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించటానికి పూనుకోవాలి. యిప్పటి వరకు ప్రభుత్వ చర్యలు ప్రజలకు విశ్వాసం కల్గించేవిగా లేవు. సాగుచేసుకుంటున్న భూములకు ఎలాంటి హక్కులు లేకుండా ఎంతో కాలంగా ప్రజలు సాగు చేసుకుంటున్నారు. అలాంటి భూములకు హక్కులు కల్పించి నష్టపరిహారం చెల్లించాలి. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా ప్రాజెక్టు నిర్మాణం తలపెడితే ప్రజలు ప్రభుత్వాన్ని ఎదిరించి తీరుతారు.

– పాల్వంచ ప్రాంత ప్రతినిధి

← తన బాధ్యత నుండి తప్పుకోజూస్తున్నది. ఇది కొంత కారణమైనా పూర్తి కారణం అదెంత మాత్రం కాదు. చాలా మంది చెపుతున్నట్లుగా జీవ ఇంధన తయారీకి ఆహార ధాన్యాల ఉపయోగించడం మూలంగా కూడా కొంత మేరకు ఆహారధాన్యాల కొరత ఏర్పడుతోంది. అమెరికాలో 2000 సం॥రం నుండి మొదలుకొని ఇప్పటి వరకు ఇథనాల్ ఉత్పత్తికి వాడుతున్న మొక్కజొన్నల స్థాయి 6 శాతం నుండి 25 శాతానికి పెరిగింది. ఈ సం॥రం నిర్మాణంలో ఉన్న 62 జీవ ఇంధన డిస్టిలరీలు గనుక పూర్తయితే మొత్తం ధాన్యాల ఉత్పత్తిలో 28 శాతానికి పెరిగే అవకాశం వుంది. ప్రపంచంలోని ఆహార ధాన్యాల ఎగుమతిలో సగం వాటా అమెరికానే వుండడం గమనార్హం. అందుకే ఆహార భద్రతకు ముప్పును కలిగిస్తున్న జీవ ఇంధన తయారీని తీవ్రంగా వ్యతిరేకించాలి.

మొత్తంగా చూస్తే మన దేశంలో నిత్యజీవితావసర సరుకుల ధరలు ఆకాశంలో విహరించడానికి మన పాలకులు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల అమలే ప్రధాన కారణం. దానికి తోడు పెట్రోలియం ఉత్పత్తులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న కస్టమ్స్, ఎక్సైజ్ పన్నులూ, నిత్య జీవితావసర సరుకులకు ఫ్యూచర్ ట్రేడింగ్‌కు అవకాశం యివ్వడం, ఆహార ఉత్పత్తులకు ప్రాధాన్యత యివ్వకుండా వాణిజ్య పంటలను ప్రోత్సహించడం, ప్రభుత్వం అనుసరిస్తున్న ఎగుమతి – దిగుమతి విధానాలూ ఇవన్నీ మనదేశంలో సరుకుల ధరలు పెరగడానికి కారణాలుగా చెప్పవచ్చు.

పై సమస్యలను పరిష్కరించకుండా ధరలపై ధర్మ యుద్ధమంటూ గంభీర ప్రకటనతో ప్రయోజనం శూన్యం. ధరల నియంత్రణకు పూనుకోవాలనే చిత్తశుద్ధి వుంటే తక్షణం డీజిల్, పెట్రోలుపై పన్నులను రద్దు చేయాలి. ఫ్యూచర్ ట్రేడింగ్ పద్ధతికి స్వస్తి చెప్పాలి. ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టంగా అమలయ్యేలా చూడాలి. నూతనంగా ప్రవేశపెట్టిన రెండు రూపాయల కిలో బియ్యం పథకాన్ని అక్రమార్కుల పాలుగాకుండా చూడాలి. ఈ చర్యలు చేపడితే కొంతలో కొంతైనా ధరలకు కళ్ళెం వేయవచ్చు.

'ఇందిరమ్మ' ఇంటి వ్యయం పెంచాలని కోరుతూ మహబూబ్‌నగర్‌లో ధర్నా

నిర్మాణ వ్యయాలు రోజు రోజుకు పెరుగుతున్న దృష్ట్యా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు నిర్మాణ వ్యయాన్ని లక్ష రూపాయలకు పెంచాలని డిమాండ్ చేస్తూ మార్చి 31 సి.పి.ఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. మూడు గంటలపాటు జరిగిన ఈ ధర్నాకు పార్టీ జిల్లా నాయకుడు కా॥ బి. రాము అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కా॥ కె.జి. రాంచందర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం ఇచ్చే 31 వేలు, డ్వాక్రా ద్వారా 20 వేల రుణం రెండు కలిపితే ఇంటి పునాదికే సరిపోవడం లేదన్నారు. మొదటి, రెండు విడతల్లో 45 లక్షల ఇళ్ళు మంజూరు చేయగా 5.5 లక్షలు మాత్రమే నిర్మాణం జరిగాయని (10 శాతం కంటే తక్కువ) కారణం ఇళ్ళకు అవసరమయ్యే ఇనుము, ఇటుక, ఇసుక, సిమెంట్ రేట్లు విపరీతంగా పెరగటమేనన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచించి ఇందిరమ్మ ఇంటికి లక్ష రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు.

ఇంకా ఈ ధర్నానుద్దేశించి పార్టీ జిల్లా నాయకులు కామ్రేడ్స్ క్రిష్ణ, సిహెచ్. రాంచందర్, హన్మేష్, వెంకటేశ్, అరుణ్ కుమార్‌లు ప్రసంగించారు. ఇందిరమ్మ ఇళ్ళకు ఆర్థిక సహాయం లక్ష రూపాయలు పెంచే వరకు దశల వారీగా వుద్యమించాల్సిందేనని ప్రజలకు పిలుపు నిచ్చారు.

అనంతరం ప్రతినిధి బృందం కలెక్టర్‌కు విజ్ఞాపన పత్రాన్ని అందజేసింది.

కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు కోరుతూ మెళియాపుట్టిలో ధర్నా

కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులోని ప్రజానుకూలమైన అంశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐకెఎంఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 3న ధర్నా జరిగింది. ఈ ధర్నానుద్దేశించి ఎఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు కా॥ పైలా చంద్రమ్మ మాట్లాడుతూ, ప్రజా వుద్యమాల వత్తిడి ఫలితంగా కోనేరు రంగారావు అధ్యక్షతన భూకమిటీని ప్రభుత్వం వేసిందనీ, ఆ కమిటీ నివేదించిన అంశాలలోని మెజారిటి ప్రజానుకూలమైన అంశాలు వున్నాయని, వీటిని వెంటనే ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సమగ్ర భూసంస్కరణలు అమలు కోరుతూ పార్టీ ఇచ్చిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని ఆమె అన్నారు. ఇంకా ఈ ధర్నాలో ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి వి. మాధవరావు తదితరులు మాట్లాడారు. ధర్నా అనంతరం ప్రదర్శన జరిగింది.

ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామాలకు నష్ట పరిహారం కోరుతూ రామగుండంలో సైకిల్ ర్యాలీ

కరీంనగర్ జిల్లా రామగుండం మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ, మార్చి 7న సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) ఆధ్వర్యంలో రామగుండం మండలంలో సైకిల్ ర్యాలీ జరిగింది. 150 మందితో జరిగిన ఈ ర్యాలీ మద్దిర్యాల, పొట్యాల, సోమనపల్లి, బ్రాహ్మణపల్లి, మూర్‌మూర్, ఎల్లంపల్లి, అంతర్గాం మీదుగా రామగుండం తహశీల్‌దారు కార్యాలయం వరకు సాగింది. అనంతరం ధర్నా చేసి తహశీల్‌దారుకు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ పెద్దపల్లి డివిజన్ నాయకుడు కా॥ కె. రాజయ్య మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు సమగ్రమైన ప్యాకేజిని ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇంకా ఈ ధర్నాలో ఇఫ్టూ, పీఓడబ్ల్యూ, పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు కామ్రేడ్స్ జ్యోతి, సాంబయ్య, శంకర్, సత్యం తదితరులు మాట్లాడారు.

శ్రీకాకుళం జిల్లాలో కా॥ భగత్‌సింగ్ వర్ధంతి సభ

విప్లవ యువకిశోరం, భారతమాత ముద్దుబిడ్డ అమరుడు కా॥ షహీద్ భగత్‌సింగ్ 77వ వర్ధంతి సభ శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టిలో మార్చి 23న ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో జరిగింది. ఎఐకెఎంఎస్ మండల నాయకుడు కా॥ సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి కా॥ వి. మాధవరావు మాట్లాడుతూ బ్రిటీషు సామ్రాజ్యవాదుల వలసపాలనను అంతమొందించే లక్ష్యంతో వారి గుండెల్లో దడపుట్టించిన కా॥ భగత్‌సింగ్ అతి చిన్న వయస్సులోనే దేశం కోసం ఉరికంభాన్ని ముద్దాడాడన్నారు. సామ్రాజ్యవాదం అంటేనే కా॥ భగత్‌సింగ్ గుర్తు కొస్తాడనీ, ఆయన కర్తవ్యాన్ని పూరించేందుకు సామ్రాజ్యవాదానికి, దోపిడి, పీడనకు వ్యతిరేకంగా వుద్యమించాలనీ, అదే కామ్రేడ్ భగత్‌సింగ్ మనం అర్పించే నిజమైన నివాళి అవుతుంది.

గోదావరిఖనిలో కా॥ మొండయ్య 5వ వర్ధంతి సభ

కరీంనగర్ జిల్లా గోదావరిఖనిలో జి.ఎల్.బి.కె.ఎస్. నాయకుడు అమరుడు కా॥ మొండయ్య 5వ వర్ధంతి సభ ఫిబ్రవరి 13న జరిగింది. జి.ఎల్.బి.కె.ఎస్. ఆర్‌జి-1 నాయకుడు కా॥ ఇ. నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ, గత 25 సం॥లుగా నిస్వార్ధంగా కార్మికవర్గ శ్రేయస్సే ధ్యేయంగా పనిచేసిన నాయకుడు కా॥ మొండన్న అన్నారు. ఆయన ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవ కార్మికోద్యమ నాయకుడని, ఆయన ఆశయాల బాటలో కార్మికవర్గం పోరాడాలని కా॥ టి.ఎస్. పిలుపు నిచ్చారు. ఇంకా ఈ సభలో ఇఫ్టూ నాయకులు కామ్రేడ్స్ కె. విశ్వనాథ్, ఐ. క్రిష్ణ, ఎ. వెంకన్న తదితరులు మాట్లాడారు.

పార్టీ నిధికి నెల్లిమర్ల కార్మికుల విరాళం

సి.పి.ఐ(ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) విజయనగరం డివిజన్ కమిటీకి నెల్లిమర్ల జూట్ మిల్లు కార్మికులు ఒక లక్షా పదహారు వేల మూడు వందల యాభై (1,16,350) విరాళాన్ని అందించారు. నిధి సేకరణకు పార్టీ యిచ్చిన పిలుపు మేరకు ప్రతి కార్మికుడు తన జీతం నుండి రూ. 50/- చొప్పున దాదాపు రెండు వేల ఐదు వందల మంది విరాళమిచ్చి సహకరించారు.

ఫిబ్రవరి 7న జూటు మిల్లు వద్ద మూడు షిఫ్టుల కార్మికులకు గేటు మీటింగులు పెట్టి పార్టీ నిధికి కార్మికులు ఆర్థిక సహకారమివ్వాల్సిన ఆవశ్యకతను కా॥ పి. ప్రసాద్ వివరించారు. కార్మికవర్గ హక్కుల పరిరక్షణతోపాటు, భూకబ్జాలను ఎదిరించడంలోనూ, సాగుదార్ల పట్టాల కోసం, దున్నే వానికే భూమి కావాలనే లక్ష్యంతో ఉద్యమిస్తూ, బూర్జువా పార్టీల అన్యాయాలను, అక్రమాలను నిరసించడంలో ముందు భాగాన నిలుస్తున్న సీపీఐ(ఎం-ఎల్-న్యూడెమోక్రసీ)ని ఆర్థికంగా ఆదుకోవడం ద్వారానే పేద ప్రజలకు మరింత రక్షణ వుంటుందన్నారు. అదే విధంగా నెల్లిమర్ల కార్మికోద్యమానికి అండగా వుందన్న కృతజ్ఞతా భావంతో విరాళాలను కోరడం లేదనీ, న్యూడెమోక్రసీ పార్టీ రాజకీయ లక్ష్యాలు, విధానాలు, సాధారణ కృషి గుర్తించి విరాళాలు ఇవ్వాలని కా॥ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఇఫ్టూ యూనియన్ కూడా నిధికి కృషి చేసింది. విరాళాన్ని అందించిన కార్మికులకు పార్టీ డివిజన్ కమిటీ దన్యవాదాలు తెలుపుతూ కరపత్రం వేసి ప్రచారం చేసింది.

అదే విధంగా నెల్లిమర్ల ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సెవెన్ హిల్స్ అయిల్ మిల్ కార్మికులు 24 మంది 4 వేల రూ॥లను, అక్కవరం ప్లైవుడ్ ఫ్యాక్టరీ కార్మికులు 79 మంది 7,900లు విరాళాలు అందించారు.

కూసుమంచిలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరుతూ రాస్తారోకో

ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలో ఆర్‌టీసీ బస్టాండును నిర్మించి, అన్ని రకాల బస్‌లకు హాల్టింగ్‌ను ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 20న సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమం జరిగింది. జిల్లాలో కూసుమంచి పెద్దమండలం కావడంతో ఖమ్మం, సూర్యాపేట, హైదరాబాదు ఎక్కువ మంది వెళ్ళాల్సి వస్తున్నందున తక్షణమే బస్టాండు నిర్మించి అన్ని డిపో బస్సులను ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పార్టీ నేలకొండపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి కా॥ పి.సి. వీరాస్వామి డిమాండ్ చేశారు.

'బీచ్‌శాండ్' ప్రాజెక్టు ఉపసంహరణకై విజయనగరంలో న్యూడెమోక్రసీ ఆందోళన

విజయనగరం జిల్లా పూసపాటి రేగ మండలంలోని సముద్ర తీర ఇసుక ఆధారంగా చౌడవాడలో 'బీచ్‌శాండ్' ప్రాజెక్టు నిర్మాణానికి గత సంవత్సరం ప్రభుత్వ ట్రోత్‌లీ అనే బహుళజాతి సంస్థకు అనుమతినిచ్చింది. 'బీచ్‌శాండ్' పరిశ్రమను నిర్మించేందుకు పూనుకోగా నిర్వాసితుల సమస్య తీవ్ర సమస్యగా ముందుకు వస్తుందనే నేపంతో రైతులు, మత్స్యకారులు వ్యతిరేకించి, ఆందోళనకు సిద్ధపడగా ప్రభుత్వం ఉపసంహరించుకున్నది. తిరిగి ఈ సంవత్సరం 2008 మార్చి మొదటి వారంలో ప్రాజెక్టు నిర్మాణానికై ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) విజయనగరం డివిజన్ కమిటీ, తీరప్రాంత మత్స్యకారుల సంక్షేమ సంఘం సంయుక్తంగా ప్రజాభిప్రాయ సేకరణకై మార్చి 8, 9 తేదీలలో ప్రధానంగా చింతపల్లి పరిసర గ్రామాల పెద్దలను, ప్రజా ప్రతినిధులను మత్స్యకారుల పెద్దలను కలిసి సమస్య తీవ్రతను వివరించింది. ఆ తరువాత మార్చి 10న చింతపల్లిలో సమావేశాన్ని ఏర్పాటు చేయగా 6 గ్రామాల నుండి 100 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

మత్స్యకార్ల సంక్షేమ సంఘం నాయకుడు బి. అప్పన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో న్యూడెమోక్రసీ పార్టీ నుండి కా॥ పి. ప్రసాదు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు వల్ల మత్స్య వృత్తి విధ్వంసం, రైతాంగం పంట భూములు కోల్పోవడం, వాతావరణ కాలుష్యం తదితర సమస్యలు తీవ్రస్థాయిలో తలెత్తుతాయనీ విఫలంగా వివరించారు. తీర ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలు దీనికి వ్యతిరేకంగా వుద్యమించాల్సిన అవశ్యకతను కూడా కా॥ ప్రసాద్ వివరించారు. ప్రజలను పోరాటాలకు సిద్ధం చేసి ముందు నిలబడుతుందని ప్రకటించారు.

ఇంకా ఈ సభలో చింతపల్లి గ్రామ సర్పంచ్ తాతారావు, ఎంపీటీసీ లక్ష్మణరావు, కొర్లయ్య, దాసు, చిన రామయ్య తదితరులు మాట్లాడారు. 'బీచ్‌శాండ్' ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తామని ప్రకటించారు. సభ అనంతరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం ఉపసంహరించకపోతే దశలవారీ ఆందోళనకు పూనుకోవాలని సభ తీర్మానించింది.

అటవీ ఉత్పత్తుల గిట్టుబాటు ధరకై రంపచోడవరం డివిజన్‌లో ఎఐకెఎంఎస్ ఆందోళన

తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం డివిజన్‌లో ఆదీవాసీ మండలాల్లో ఆదివాసీల అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎఐకెఎంఎస్ ఆందోళనకు దిగింది. ముందుగా డివిజన్ కార్యవర్గం సమావేశమై, ఆందోళన చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఫిబ్రవరి 25 నుండి మార్చి 10 వరకు విస్తృతంగా ప్రచారం చేపట్టింది. సభలు, సమావేశాలు జరిపి గిరిజనులను చైతన్య పరిచింది. గిట్టుబాటు ధర లభించేంతవరకు పోరాడాలని పిలుపునిచ్చింది.

మార్చి 21న ఆకు మామిడి కోటలో 150 మంది తోనూ, 22న 300 మందితో గుర్రమామిడి గ్రామంలోనూ, మార్చి 23న రంపచోడవరంలో జనరల్ బాడీ సమావేశాలు జరిగాయి. ఎఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కా॥ పి. టాన్యా మాట్లాడారు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేంత వరకు ఐక్యంగా పోరాడాలన్నారు. తరువాత గిట్టుబాటు ధర సాధన పోరాట కమిటి ఏర్పడింది. పోరాట కమిటీ కన్వీనర్‌గా కా॥ మడకం ఎర్రన్న దొర, 29 మందితో కమిటీ ఏర్పడింది. కమిటీ తరపున మార్చి 24న చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌ను జీసీసీ అధికారికి అందజేసింది. అటవీ ఉత్పత్తులైన 21 వస్తువులకు గిట్టుబాటు ధరలు కల్పించాలనీ, తూకాల్లో మోసాలను అరికట్టాలనీ, పెంచిన రేట్లు సంవత్సరంపాటు కొనసాగించాలనీ, అవకతవకలకు పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలనీ, తరుగు తీసుకోవటం పూర్తిగా రద్దు చేయాలని ప్రతినిధి బృందం జీసీసీ మేనేజర్ వివరించింది. ఈ కార్యక్రమంలో కామ్రేడ్స్ ఎర్రన్న దొర, మాధవరెడ్డి, బాలు దొర, సోమన్న, జోగమ్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మందపల్లిలో ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో భూఆక్రమణ

ఆదిలాబాదు జిల్లా ఖానాపూర్ మండలం మందపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 118లో 630 ఎకరాల భూమిని ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో 100 మంది పేదలు ఆక్రమించి తుప్పలు కొట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఫారెస్టు, పోలీసు బలగాలతో తోపులాట, వాగ్వాదాలు జరిగి ఉద్రిక్తతకు దారి తీసింది. అయినా ప్రజలు వెనక్కు తగ్గకుండా, ఎన్ని బెదిరింపులు చేసినా ఈ భూమి నుండి కదిలేది లేదని తేల్చి చెప్పారు. ఇది అంతా ప్రభుత్వభూమి అని, మేమంతా పేదలం, ప్రభుత్వం ఇప్పటి వరకు పంచిన భూమి మాకు అందలేదు. కాబట్టి ఈ భూమి నుండి కదలం అని అధికారులకు చెప్పటంతో, ఫారెస్టు అధికారి గతంలో ఎక్కడి వరకు పోడు కొట్టారో సర్వే చేయించి ఇస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కా॥ నంది రామయ్య మాట్లాడుతూ 630 ఎకరాల్లో ఇప్పటికే 300 ఎకరాల తుప్పలు కొట్టి బాగు చేసుకున్నారనీ, ఎన్ని కేసులు, నిర్బంధాలు, బెదిరింపులు భయపడకుండా ఐక్యంగా ధైర్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు.

ఫారెస్టు అధికారుల వైఖరిని నిరసిస్తూ ఖానాపూర్ ప్రదర్శన

ఆదిలాబాదు జిల్లా ఖానాపూర్ మండలంలోని జిల్లేడి కుంట గ్రామం ఇందిరమ్మ ఆదర్శగ్రామంగా ఎన్నికైంది. 24 ఇళ్లు మంజూరు అయి నిర్మించుకుంటున్న దశలో ఫారెస్టు అధికారులు మా డిపార్టుమెంటు పరిధిలో వున్నందున ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దనీ నిర్మాణ పనులను ఆపు చేయించారు.

దీనిపై ఫిబ్రవరి 20న ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ళకు ఆటంకం కల్గిస్తున్న ఫారెస్టు అధికారుల వైఖరిని నిరసిస్తూ ఖానాపూర్‌లో ప్రదర్శన, తహశీల్‌దారు కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. తహశీల్‌దారుకు ప్రతినిధి బృందం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేసింది. ఆయన ఇళ్ళు కట్టుకోవడానికి మీకు ఎలాంటి ఆటంకాలు వుండవనీ హామీ ఇచ్చారు. ఇళ్ళ నిర్మాణం జరుగుతుంది.

ఈ సందర్భంగా ఎఐకెఎంఎస్ మండల నాయకుడు కా॥ మాన్క దేవన్న, సత్తన్న, రాజన్నలు మాట్లాడారు.

KLVA102M302

విజయనగరం జిల్లాలో కా॥ మామిడి అప్పల సూరి 11వ వర్ధంతి సభ

వీరోచిత శ్రీకాకుళం విప్లవోద్యమ నిర్మాతలలో ఒకరైన కా॥ మామిడి అప్పల సూరి 11వ వర్ధంతి సభ ఆయన స్వగ్రామం కోమర్తి (నర్సన్నపేట మండలం, శ్రీకాకుళం జిల్లా)లో 21.3.2008వ తేదీన జరిగింది. అదే గ్రామానికి చెందిన కా॥ గుమ్మడి లచ్చయ్య, మామిడి లచ్చమ్మలతో సహా ముగ్గురు అమరయోధుల స్మారకార్థం నిర్మించిన స్మారక స్థూపం వద్ద ఇదే రోజు ప్రతి ఏటా ఉమ్మడిగానే స్మారక సభలు జరపడం ఆనవాయితీగా వుంది. ఈ ఏడాది కూడా అమరవీరుల స్మారక కమిటీ ఆధ్వర్యంలోనే ఈ సభ జరిగింది.

ఈ సభకి ముందు స్థూపానికి అల్లంత దూరాన గల స్మారక భవనం వద్ద యూసీసీఆర్ఐ (ఎం-ఎల్-డి.వి.) నాయకులు, అప్పల సూరి సన్నిహితులైన కా॥ బీవీఎన్ పట్నాయక్ చేత స్మారక కమిటీ జెండా ఆవిష్కరణ చేయించింది. అనంతరం ప్రదర్శనగా స్థూపం వద్దకు చేరారు. స్థూపం వద్ద నివాళులర్పించాక అదే చోట సభ జరిగింది.

కొల్లి చిన్నబాబు (స్మారక కమిటీ ప్రధాన కార్యదర్శి) అధ్యక్షతన ఈ సభ జరిగింది. ఈ సభలో తొలుత ఉత్తరాంధ్ర ప్రముఖ కథా రచయిత, విప్లవ కవి, అమరవీరుల కుటుంబీకులు కూడా అయిన కా॥ అట్టాడ అప్పలనాయుడు ప్రసంగిస్తూ ఈ సభ విప్లవ సంస్థలందరి ఉమ్మడి విశాల వేదిక కావాలన్నారు. దీనికి హాజరైన వివిధ విప్లవ సంస్థల ప్రతినిధులు పరస్పర విమర్శలు ఈ వేదిక మీద చేసుకోవద్దని సూచించారు. నెల రోజుల క్రితం ఇదే గ్రామంలోని ఇదే అమరుల స్మారక భవన్‌ను అనైతికంగా, అరాజకంగా ఆక్రమించడానికి ఒక విప్లవ పార్టీ (సీపీఐ (ఎం-ఎల్-కానూసన్యాల్) పూనుకున్న సంఘటన విప్లవోద్యమంలో ఒక అపశ్రుతి అన్నారు. అలాంటి అవాంఛనీయ పరిస్థితులు పునరావృతం కారాదని తనవంటి విప్లవాభిమానుల ఆకాంక్షగదా పేర్కొన్నారు.

ఈ సభలో సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ) నాయకులు కా॥ పి. ప్రసాదు, యుసీసీఐఆర్ఐ (ఎం-ఎల్-) నాయకులు కా॥ బీవీఎన్ పట్నాయక్, సి.పి.ఐ (ఎం-ఎల్-రామచంద్రన్) నాయకురాలు కా॥ జయమ్మ, సీపీఐ (ఎం-ఎల్-లిబరేషన్) నాయకులు కా॥ మద్దిల మల్లేశ్వరరావు, వసంతాడ రామలింగాచారి స్మారక కమిటీ సభ్యులు కా॥ మార్పు మల్లేశ్వరరావు, సీపీఐ (ఎం-ఎల్) ఉత్తరాంధ్ర ఆర్గనైజింగ్ కమిటీ నాయకులు కా॥ క్రిష్ణమూర్తి, కా॥ తాండ్ర ప్రకాశ్ తదితరులు ప్రసంగించారు. వీరు విప్లవ శక్తులన్నీ నూతన ప్రజాతంత్ర విప్లవ పథంలో ఐక్యంగా పురోగమించాల్సి వుందని ప్రసంగించారు. ఇందులో కొందరు నాటి శ్రీకాకుళం పోరాటంలో పాల్గొన్న స్వానుభవాలను ఉద్వేగపూరితంగా నెమరు వేసుకున్నారు. ఈ సభలో ఇంకా ఉత్తరాంధ్ర రైతు-కూలీ సంఘం (మండ్ల సుబ్బారెడ్డి) నాయకులు కా॥ భాస్కరరావు, నీలంరాజు, మామిడి క్రాంతి (కార్మిక నాయకులు, ఎపీఎఫ్‌టీయూ శ్రీకాకుళం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి), అచ్యుతరావు (ఏపీటీఎఫ్) తదితరులు ఈ సభలో మాట్లాడారు.

ఈ సభలో న్యూడెమోక్రసీ నాయకులు ప్రధానోపన్యాసం చేస్తూ నేడు దేశంలో భూమి చుట్టూ ప్రధాన రాజకీయాలు సాగుతున్న పరిస్థితిని వివరించారు. ఈ దేశ విముక్తికి తెలంగాణా, నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరీ లోయల సాయుధ విప్లవ పోరాట్ల పంథాయే మార్గదర్శకమైనదన్నారు. విప్లవ శక్తుల చీలికలతోపాటు కొన్ని వస్తుగత సామాజిక ఉపరితల మార్పులవల్ల నేడు విప్లవోద్యమంలో ఏర్పడిన స్థబ్దత తాత్కాలికమైనదన్నారు. ప్రజాయుద్ధ పంథాలో దృఢంగా పనిచేస్తే విప్లవ వెల్లువ అనివార్యమన్నారు. అడవులూ - లోయలూ - కొండలూ లేని ఇరాక్, లెబనాన్, పాలస్తీనా వంటి దేశాల పీడిత జాతులు దీర్ఘకాలంగా సాయుధ విప్లవాలను అప్రతిహతంగా కొనసాగిస్తున్న అనుభవాలు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. అయితే ప్రజలను ప్రజాయుద్ధ పంథాలో సంసిద్ధం చేయాల్సిన ప్రాథమిక రాజకీయ కర్తవ్యాన్ని విడనాడి ఆయుధాలూ - అడవుల ఎంపికతో విప్లవ సాధన సాధ్యం కాదన్నారు. మామిడి అప్పలసూరి వంటి అమరుల విప్లవాశయ సాధనకై అంకితం కావాలన్నారు. శ్రీకాకుళ విప్లవోద్యమ పునర్నిర్మాణ కర్తవ్యం చేపట్టడమే నిజమైన నివాళి అన్నారు.

ఈ సభలో విశాఖ అరుణోదయ కళాకారులు పాటలు పాడారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకి చెందిన సుమారు 500 మంది ఈ సభకి హాజరయ్యారు. స్థానిక ప్రజలు, రైతు-కూలీ సంఘం సభ్యులు, కార్మికులతోపాటు విప్లవాభిమానులు, విప్లవ మేధావులు వీరిలో వున్నారు. ఈసారి స్మారక సభ ఈ ప్రాంత విప్లవాభిమానులు, వుద్యమ శ్రేణుల మీద అధిక ప్రభావాన్ని కలిగించింది.

ఈ సభకోక ప్రత్యేక ప్రాధాన్యత వుంది. దీన్ని నిర్వహించిన స్మారక కమిటీ సుమారు దశాబ్ద కాలంగా సీపీఐ (ఎం-ఎల్- కానూసన్యాల్) నిర్మాణంలో అంతర్భాగంగా వుంది. ఉత్తరాంధ్ర స్థాయిలో ఆ పార్టీలో ఇటీవల ఏర్పడిన నిర్మాణ సంక్షోభం వల్ల ఒక బలమైన వర్గం ఆ నిర్మాణం నుంచి విడిపోయింది. ఈ నేపథ్యంలో తాము అంతర్గతంగా సీపీఐ (ఎం-ఎల్) ఉత్తరాంధ్ర ఆర్గనైజింగ్ కమిటీగా ఏర్పడినట్లు వారు తెలిపారు. కోమర్తి స్మారక కమిటీతో సహా ఈ ప్రాంత విప్లవ శ్రేణులు కూడా ఈ కొత్త నిర్మాణంలో భాగమయ్యాయి. ఇదే కోమర్తి గ్రామంలోని స్మారక స్థూపం, స్మారక భవనాలు ఈ స్మారక కమిటీ ఆధ్వర్యంలో వున్నాయి. కానీ ఈ స్మారక సభకి సరిగ్గా నెల రోజుల క్రితం 22.2.2008న ఇదే కోమర్తిలోని స్మారక భవన్ తమదంటూ సీపీఐ (ఎం-ఎల్- కానూసన్యాల్) ఆక్రమించుటకై ప్రయత్నించింది. 2 వాహనాల మీద ఆ పార్టీకి చెందిన నలుగురు రీజనల్ కమిటీ సభ్యులు, ఒక రాష్ట్ర కమిటీ నాయకుడుతో సహా ఈ ప్రయత్నంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా జరిగిన వివాదం స్వల్ప ఘర్షణకి దారితీసింది. ఈ వివాదం మంచి చెడులు ఏమైనప్పటికినీ, అది జనరల్ విప్లవశ్రేణులు, సానుభతి పరులను కలతకి గురి చేసింది. ఈ నేపథ్యంలో జరిగిన ఈ సభకి సహజంగానే ప్రత్యేకత ఏర్పడింది.

భూబకాసుర పాలకుల స్వగత గీతం!

(గురజాడకు క్షమాపణలతో)

పి. ప్రసాదు

- దేశమంటే మట్టి కాదని
రాత రాసిన దెవ్వరోయ్
దేశ మంటే మనుషులేనని
నీతి చాటిన దెవ్వరోయ్
- మట్టి ఎందుకు దేశమవదోయ్
సంత కంతకు గొప్ప సరుకోయ్
మనుషు లెట్లగ దేశమగు నోయ్
మట్టి గరిచే వెట్టి జనులోయ్
- నాడు వుంటే వాడి నిట్లగ
రాయనిస్తే ఒట్టు బెట్టోయ్
కొలువులిచ్చిన నాటి రాజులు
మాకు ఎన్నడు మనిషి ఘనుడని
- మట్టి కంటెను మనిషి ఘనుడని
రాసి నోడిది నమ్మకండోయ్
'మట్టి చిక్కన మనిషి పలచన'
మాది బోధన నమ్మరండోయ్
- ఖాళి జాగలు కంటపడితే
ఎందరడ్డిన వదల బోమోయ్
వట్టి మాటలు మావి కాదోయ్
మట్టి అంటే గట్టి ప్రేమోయ్
- తొండలుడతలు గుడ్లు పొదిగే
పొదలు చదునుగ చేసినామోయ్
ఎలుగులుండే కొండ లెదికీ
గ్రానైట్లను తవ్వినామోయ్
- ఏటిలోపలి పాడు ఇసుకని
పసిడిపంటగ మార్చినామోయ్
రోడ్ల పక్కన పిచ్చినేలకి
వెలను ఇలలో పెంచినామోయ్
- అడవి లోపలి రంగురాళ్ళకి
వన్నె తెచ్చిందెవ్వ రోయ్
పాము పుట్టల ఎర్రమట్టికి
విలువ కూర్చిందెవ్వరోయ్
- బీడు భూములు కొండకోనలు
చెరువు శిఖములు మిగలనివ్వం
బహిర్భూములు వల్లకాడులు
అంటరానివి మాకు కాదోయ్
- ఆదివాసుల సాగుపోడులు
పల్లె సీమలు తీరభూములు
కారు చౌకగ బడాబాబుల
కప్పగించిన ఘతనమాదోయ్
- దున్నెవాడికి భూమి వద్దోయ్
తన్నె వాడికి చెందుతుందోయ్
దేశమంటే కంపెనీలోయ్
మనుషులన్నది నిజం కాదోయ్
- నాటి కవిగా దండలేసీ
దండమెడతాం నేటి దొరలుగ
నేటి జనులకి నాటి రాతలు
స్ఫూర్తినిస్తే వూరు కోమోయ్
- వాడి గీతం జాతి జనులకి
జీవ నాదం అయ్యేదాకా
ఆటలిట్లగ ఆడుతామోయ్
సిగ్గు ఎగ్గులు అడ్డురావోయ్
- మట్టికోసం మోటు మనుషులు
యుద్ధ గీతిక పాడెదాకా
పాట లిట్లగ పాడుతామోయ్
చీము నెత్తురు మాకు లేవోయ్

(ఒక వైపు గురజాడ భావ సందేశ స్ఫూర్తికి విరుద్ధంగా సెజ్‌లతోపాటు భూకబ్జా విధానాన్ని అవలంభిస్తూనే మరొకవైపు ఆయనకి నిత్యనివాళులర్పిస్తూ, ఈ మధ్య ఆయన ఇంటికి కూడా రంగులేస్తున్న నయవంచక కంటి తుడుపు చర్యల పట్ల ప్రతిస్పందనగా రాసిన వ్యంగ్య రచన! భూబకాసుర పాలకుల స్వగత గీతమిది. దీనికి పాటగా పాడుకునే లయబద్ధత కూడా వుంది.)

హైదరాబాద్‌లో కా॥ రాజిందర్ సారంగి సంస్మరణ సభ

ప్రపంచీకరణ వ్యతిరేకోద్యమ నాయకుడు, ప్రగతిశీల మేధావి కా॥ రాజిందర్ సారంగి మార్చి 27న అనారోగ్యంతో మరణించారు. ఆయన సంస్మరణ సభ ఏప్రిల్ 8న హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్ ఎఐకెఎంఎస్ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ పి. టాన్యా అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎఐకెఎంఎస్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి కా॥ గాదె దివాకర్ మాట్లాడుతూ, కా॥ సారంగిని కోల్పోవడం ప్రపంచీకరణ వ్యతిరేక వుద్యమాలకు, ముఖ్యంగా ఒరిస్సా ప్రాంత వుద్యమాలకు తీరని లోటన్నారు. ఒరిస్సాలో జరిగిన కళింగనగర్, పోస్కో వుద్యమాలకు మంచి అండదండలు అందించి నిలబడిన మిత్రుడుని కోల్పోయామని, ఆయనకు జోహార్లు అర్పించారు. భూమి, నీరు, పాలు, విత్తనాలు, ఆరోగ్యం తదితర అంశాలు ఎలా ప్రైయివేటీకరణ చేయబడుతున్నాయో లోతైన అధ్యయనం చేసిన ప్రగతిశీల మేధావి అన్నారు. వాటి యెడల ప్రజలకు అవగాహన కల్గిస్తూ వారిని చైతన్య పరచడంలో ముఖ్యమైన పాత్ర పోషించిన నాయకుడన్నారు. సీపీఐ (ఎం-ఎల్-న్యూడెమోక్రసీ)తో సన్నిహిత సంబంధాలు కలిగివుంటూ, విప్లవ సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేస్తూ, విప్లవ రాజకీయాల వైపు అడుగులేసే క్రమంలో కా॥ సారంగి చనిపోవటం విప్లవ శిభిరానికి, ప్రపంచీకరణ వ్యతిరోకోద్యమానికి తీరని లోటన్నారు.

ఇంకా ఈ సభలో పార్టీ రాష్ట్ర నాయకులు కా॥ కె. గోవర్ధన్, ఎఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ కె. రంగయ్య మాట్లాడారు. సభలో అరుణోదయ రామారావు సారంగిపై వ్రాసి పాడిన పాట ఆలోచింపచేసింది.

If undelivered please return to: Manager

PRAJAPANDHA
MARX BHAVAN
H.No.1-9-295/11/4
7th Line,
Vidyanagar,
Hyderabad.
500 044. A.P.

Regd. No. HSE-673

BOOK-POST

To

BOOK-POST
53. Complimentary 1-1-200
COMRADE KOLLA VENKAIAH
MEMORIAL LIBRARY,
PEDANANDIPADU (PO & MDL)
GUNTUR (DIST) - 522 235.

Published by M. Narayana Swamy, Publisher, Printer and owner from H.No.1-9-295/11/4, 7th Line, Maseedu Road, Vidyanagar, Hyderabad-44 and Printed at Navya Printers, Badam Sohna Apartments, Raj Bhavan Road, Hyderabad (A.P.) Editor : M. Narayana Swamy-Phone: 27607884, Fax : 27662518

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M302
పుస్తకం పేరు	ప్రజాపంథా
తారీఖు	07 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	13
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినవారు	Priyanka
పేజీలు విడదీసినవారు	Priyanka
స్కాన్ చేసినవారు	Naveeda
పరీక్ష చేసినవారు	AMRUTHA
పేజీలు సరిచూసినవారు	
బైండింగు చేసినవారు	
ప్యాకింగు చేసినవారు	
సంస్థతి	[illegible]